వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54






నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


స్కాట్లాండ్ పార్లమెంటుకు భారత వలస విద్యార్థి

పాక్‌లో ఉగ్రదాడి : 15 మంది భద్రతాధికారుల మృతి


ముగింపు దశకు యుద్ధం : పుతిన్

08


సంపుటి 28, సంచిక: 317 | సోమవారం | 11-05-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


# ప్రధాని పొదుపు మంత్రం

## ఇంధనాన్ని ఆదాచేద్దాం

- ప్రపంచంలో ఇంధన భద్రత ప్రాముఖ్యత పెరిగింది
- ఈ రంగంలో కేంద్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోంది
- సౌరశక్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది
- తెలంగాణకు గుజరాత్ కంటే రెట్టింపు కేటాయింపులు చేస్తాం
- మాతో కలిసి రండి... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ పిలుపు
- హైదరాబాద్ హెచ్ఐసిసి వేదికగా రూ.9,400 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచంలో ఇంధన భద్రత ప్రాముఖ్యత పెరిగిందని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సౌరశక్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచిందని, ఈ మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు పెట్టుబడి పెడుతోందన్నారు. భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో ముందుకు సాగుతోందని, అదే సమయంలో నేటి భారతదేశం ఆధునిక మౌలిక సదుపాయాలను నిర్మిస్తోందన్నారు. గత 12 సంవత్సరాలుగా, ఆధునిక కనెక్టివిటీ కూడా భారత ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యతగా ఉందని, అది రహదారులు కావచ్చు, రైల్వేలు కావచ్చు, లేదా విమానాశ్రయాలు కావచ్చు ప్రతి ఒక్క కనెక్టివిటీ మార్గంలో ఇదివరకు ఎన్నడూ లేనంతటి విధం గా పెట్టుబడి పెడుతున్నామని చెప్పారు. నేడు రాష్ట్రంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయని, తెలంగాణ కనెక్టివిటీని తరువాయి 8లో

తెలంగాణ ప్రాజెక్టులను

## పరిశీలించండి

మోదీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

దేశంలోని ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఆరు ప్రధాన మహానగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల అన్ని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి వేగంగా అనుమతులు త్వరగా లభించేలా ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) లో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. భారీ ఆర్థిక వృద్ధి, మహా నగరాలు, విశ్వ నగరాల నుంచే వస్తుందని, భారతదేశంలోని ఆరు నగరాలు ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే ఈ మహానగరాలను తరువాయి 8లో

**తెలంగాణలో అధికారంలోకి వస్తాం**
కుటుంబ పాలనను తిరస్కరించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధం : ప్రధాని మోదీ 03

విలీనానికి

## ఈ ఏడాది బ్రేక్

- ఇంటర్ ప్రవేశాలకు తక్కువ సమయం ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా ప్రక్రియ చేపట్టండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- పాఠశాల విద్యలో ఇంటర్ విలీనంపై విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలి
- ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలి
- అసెంబ్లీలో చర్చించి తుదినిర్ణయం తీసుకుందామని స్పష్టీకరణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ అడ్మిషన్లను యథావిధిగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఇంటర్ ప్రవేశాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటం కారణంగా విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సిబిఎస్ఇలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర తరువాయి 12లో






# విజయ్ సర్కార్

**తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం**




- మంత్రులుగా మరో 9 మంది
- ఉచిత విద్యుత్‌పై సిఎం తొలి సంతకం
- నిజమైన, లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన ఒక కొత్త శకం ఇప్పుడు మొదలవుతుందని ఉద్ఘాటన

**చెన్నై :** ఉత్సాహభరితమైన మద్దతుదారుల మధ్య, సి. జోసెఫ్ విజయ్ ఆదివారం తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 'నిజమైన, లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన ఒక కొత్త శకం ఇప్పుడు మొదలవుతుంది' అని ఆయన ప్రతిజ్ఞ చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ విజయ్‌తో ప్రమాణం చేయించారు. ఆ తరువాత 'బస్సీ' ఎన్. ఆనంద్, ఆదావ్ అర్జున, కె.ఎ. సెంగోట్టయ్యన్, కెజి అరుణరాజ్, పి వెంకటరమణన్, సిటిఆర్ నిర్మల్ కుమార్, ఎ రాజ్‌మోహన్, కీర్తన, కెటి ప్రభు తదితరులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు విజయ్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి, బిజెపి నేత, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, నటి త్రిష, సిపిఐ, సిపిఐ(ఎం), విసికె, ఐయుఎంఎల్ నాయకులు, స్నేహితులు సహా పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. అయితే మాజీ ముఖ్యమంత్రులు, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్, ఎఐఎడిఎంకె చీఫ్ కె. పళనిస్వామి, విజయ్ భార్య సంగీత, వారి చిన్నారులు హాజరు కాలేదు. 'ఇది ఒక సరికొత్త ఆరంభం. నిజమైన, లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన ఒక కొత్త శకం మొదలవుతుంది' అంటూ విజయ్ ఒక క్షణం ఆగి, తల వంచుకుని, తన చేతి గడియారం వైపు చూపిస్తూ, అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుండి ఉరుము లాంటి చప్పట్లు, కేరింతలు, ఈలలతో స్వాగతం లభించింది. తన ప్రసంగానికి ముందు, ఆయన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల భద్రత కోసం ఒక టాస్క్‌ఫోర్స్, మాదకద్రవ్యాల బెడదను ఎదుర్కోవడానికి ఒక టాస్క్‌ఫోర్స్ అనే మూడు ఉత్తర్వులపై సంతకం చేశారు. తాను ఏ రాజవంశానికి చెందినవాడిని కాదని స్పష్టం చేస్తూ, విజయ్ స్వచ్ఛమైన తమిళంలో భావోద్వేగభరితంగా ప్రసంగించారు. ప్రజలు తనను 'స్వాగతించి, అంగీకరించారని', తాను వారిని తప్పుడు వాగ్దానాలతో ఎన్నటికీ మోసం చేయనని ఆయన అన్నారు. గత డిఎంకె ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల భారంలో పెట్టిందని ఆరోపిస్తూ, ప్రజల అంచనాలను అందుకోవడానికి, తన పనితీరుకు సమయం ఇవ్వాలని విజయ్ వారిని కోరారు. తరువాయి 12లో

పెట్రో బాదుడుకు

## రంగం సిద్ధం?

10 వారాల్లో రూ.లక్ష కోట్ల నష్టమంటూ ప్రచారం




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా యుద్ధం పేరుతో ప్రజలపై పెట్రో భారం మోపేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. అందులో భాగంగా చమురు కంపెనీలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు కొన్ని రోజులుగా ప్రచారం సాగిస్తోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన ఇంధన ధరలతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు చవిచూస్తున్నాయి. వడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600–1700 కోట్ల మేర నష్టపోతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. గడిచిన 10 వారాల్లో రూ.లక్ష కోట్ల మేర నష్టాలు చవిచూసినట్లు తెలిపాయి. భారీ నష్టాల నేపథ్యంలో త్వరలోనే పెట్రో ధరలు పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు చమురు కంపెనీలు సంకేతాలు ఇస్తున్నాయి. ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతలు మొదలై, అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, తరువాయి 12లో

# ఎడ్యుకేషన్ మాఫియా




- ఇంటర్ ఫీజు రూ.లక్ష నుంచి రూ.3.50 లక్షలు
- రూ.వేల కోట్లలో జరుగుతున్న విద్యా వ్యాపారం
- క్యూర్ పరిధిలో రెచ్చిపోతున్న ఎడ్యుకేషన్ మాఫియా
- మాఫియాకు ఇంటర్ బోర్డు అడ్డుకట్ట వేస్తుందా?

ప్రజాపక్షం/సిటీబ్యూరో

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం 2026–27 ప్రారంభం ఆసరాగా చేసుకుంటున్న ఎడ్యుకేషన్ మాఫియా రూ.వేల కోట్లు దండుకునేందుకు పక్కాగా స్కెచ్ వేసి అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే క్యూర్ పరిధిలోని దాదాపు 700 కాలేజీల ద్వారా ఎడ్యుకేషన్ మాఫియా ఇంటర్ అడ్మిషన్ల పేరిట రూ.వేల కోట్ల దోపిడీకి ప్రణాళిక రూపొందించి దండుకుంటున్నది. సిబిఎస్ఇ ఫలితాలు వెలువడక ముందు నుంచే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఎస్ఎస్‌సి పరీక్షలు రాసిన విద్యార్థుల జాబితాలు తెచ్చుకుని జూనియర్ కాలేజీలు టెలీకాలర్స్‌తో తమ కాలేజీల్లో ప్రవేశాలు పొందేందుకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను వేధింపులకు గురిచేయడం జరిగింది. ఇక తమ కాలేజీల్లో ఎంసెట్, నీట్‌తో కలిసి జెఇఇ, ఐఐటి, జెఇఇ మెయిన్స్ బోధించడం జరుగుతుందని రూ.లక్ష నుంచి రూ.3.50 లక్షల ఫీజు డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నారు. సాధారణంగా క్లాసులో 43 నుంచి 48 మంది విద్యార్థులు ఉండాలి. కానీ కొన్ని కాలేజీలు 60 మంది విద్యార్థులతో క్లాసులు నిర్వహిస్తున్నాయి. ఒక్కో కాలేజీ ఐదు, ఆరు, ఏడు సెక్షన్లు ఏర్పాటు చేస్తూ ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.లక్షకు తగ్గకుండా ఫీజు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక కాలేజీ ఏడు గ్రూపుల్లో మొత్తం కలిపితే 420 మంది విద్యార్థుల నుంచి సగటున ఏడాదికి ఫీజు రూపేణా రూ.4.20 కోట్లు దండుకుంటున్నది అంటే.. సదరు కాలేజీకి క్యూర్ పరిధిలో ఎన్ని కాలేజీలు ఉంటాయి? ఎంత మంది తరువాయి 8లో

అధికలాభం ఆశ..

## భారీ మోసం

**నెలకు నాలుగు శాతం లాభాలంటూ రూ.6.81 కోట్ల టోకరా**

గ్లోబల్ కూలింగ్ సొల్యూషన్స్ పేరుతో భారీ స్కాం




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో భారీ ఇన్వెస్ట్‌మెంట్ మోసం వెలుగుచూసింది. ఎయిర్‌కండీషనింగ్ వ్యాపారం పేరుతో అధిక లాభాల ఆశ చూపించి రూ.6.81 కోట్ల మేర పలువురు బాధితులను మోసం చేసిన ఘటనలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు. గ్లోబల్ కూలింగ్ సొల్యూషన్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ జయసుధతో పాటు విజయ్‌కుమార్, రాజేష్‌లపై చీటింగ్, నమ్మకద్రోహం ఆరోపణలు నమోదయ్యాయి. హిమాయత్‌నగర్‌కు చెందిన తరువాయి 12లో



బిసిలకు ద్రోహం చేస్తున్న బిజెపికి రాజకీయ పతనం తప్పదు

వి.హెచ్ దీక్ష విరమణ 03




# సర్పంచ్‌లపై ‘బడి’ భారం




- అప్పుల్లో ఉన్న సర్పంచ్‌లకు ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ అప్పగింతా?
- గోడు మొరపెట్టుకున్నా స్పందించని అధికారులు
- రాష్ట్రంలో వెలవెలబోతున్న గ్రామ స్వరాజ్యం

ప్రజాపక్షం / నిర్మల్

తెలంగాణలో గ్రామ స్వరాజ్యం వెలవెలబోతోంది. ఒకప్పుడు గ్రామ పాలకులంటే అభివృద్ధికి చిరునామాగా ఉండేవారు. కానీ నేడు వారు కేవలం ప్రభుత్వం భారాలను మోసే కూలీలుగా మారిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామంలో మురుగు కాలువలు తీయించాలన్నా, వీధి దీపాలు వెలిగించాలన్నా జేబులో నుండి డబ్బులు ఖర్చు పెట్టి అప్పుల పాలైన సర్పంచ్‌లకు, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణను అప్పగించడం 'పుండుమీద కారం' చల్లినట్లుగా ఉంది. నిధుల విడుదల విషయంలో వేల కొర్రీలు పెడుతున్న ప్రభుత్వం బాధ్యతల విషయంలో మాత్రం ఏలాంటి కనికరం లేకుండా ఆదేశాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శ వ్యక్తమవుతోంది.

**అప్పుల ఊబిలో గ్రామ పాలకులు**

గ్రామాల్లో ఏ చిన్న పని చేయాలన్నా సర్పంచ్‌లకు నిధుల గండం వెంటాడుతోంది. గతంలో చేసిన పనులకు సంబంధించి వందలాది కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, ఊళ్ళో అప్పులు ఇచ్చిన వారికి మొహంచూపించలేక సర్పంచ్‌లు ఆత్మరక్షణలో పడ్డారు. పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను సైతం ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళిస్తోందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇలాంటి ఆర్థిక సంక్షోభంలో తరువాయి 8లో

# భరోసా.. కొంతేనా?



- రబీ సీజన్ ముగిసినా రైతులకందని పూర్తి పెట్టుబడి సాయం
- రైతు భరోసాపై ఆశలు వదులుకోవాల్సిందేనా?
- ప్రభుత్వ తీరుపై రైతుల పెదవి విరుపు

ప్రజాపక్షం/సూర్యాపేట

పంట పెట్టుబడి సహాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా సకాలంలో అందకపోవడంతో ఇక వస్తుందో రాదో అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆశలు వదులుకునే పరిస్థితులు నెలకొన్నాయి. రబీ సీజన్‌కు ముందు అందించాల్సిన భరోసా సీజన్ ముగిసినా పూర్తిస్థాయిలో అందకపోవడంతో ప్రభుత్వ తీరుపై రైతులు పెదవి విరుస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో 2లక్షల 79వేల 853 మంది రైతులు ఉండగా 8లక్షల 95వేల 680 ఎకరాల పంట సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు పంట సాగు పెట్టుబడి సహాయం కింద (రైతుబరోసా) రూ.10వేలు రెండు విడతలుగా ఇవ్వగా, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా దానిని రూ.12వేలకు పెంచి రూ.6వేల చొప్పున రెండు సార్లు ఇవ్వడం జరుగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ద్వారా అందించే పంట సాగు పెట్టుబడి సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటసాగుకు పెట్టుబడి లేక అప్పులు ఇచ్చే వారిని ఆశ్రయిస్తున్నారు. రైతు భరోసా కింద గత (2025) ఖరీఫ్ సీజన్‌లో రూ.366.50లక్షలు పెట్టుబడి సహాయం అందించిన తరువాయి 12లో

# సాహిత్యంలో మహిళా వాదం..

మహిళలను గౌరవిస్తున్నామంటూ ఎవరు, ఎన్ని రకాలుగా చెప్పినా... ప్రకటనలు గుప్పించినా వాస్తవ పరిస్థితులు మాత్రం దశాబ్దాలుగా మారిన దాఖలాలు కనిపించడం లేదు. అయితే, మహిళల పక్షాల నిలబడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి వాస్తవ పరిస్థితులను కళ్లకు గట్టే రచనలు రావడం ఆహ్వానించదగిన పరిణామం. కాగా, 'స్త్రీలు.. వాస్తవికత' అనే సాహిత్య ధోరణి, ఆధునిక సాహిత్య చరిత్రలో అత్యంత కీలకమైన మలుపులలో ఒకటిగా మారింది. దీనిని ఒక శైలీ మార్పుగా మాత్రమే కాకుండా, ఒక ఆలోచనా విప్లవంగా కూడా చూడాలి. సాహిత్యంలో మహిళల జీవితాలను ఎలా చూడాలి? ఎలా వర్ణించాలి? వారి అనుభవాలకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? అనే ప్రశ్నలకు ఈ సాహితీ ఆలోచన సమాధానం ఇస్తున్నది. 19వ శతాబ్దంలో ప్రారంభమై 20వ శతాబ్దంలో మరింత విస్తరించిన ఈ ధోరణి, స్త్రీల జీవితాలను ఆదర్శవాదం, రొమాంటిసిజం వంటి శైలుల నుంచి బయటకు తీసుకువచ్చి, వాస్తవికతతో, నిజాయితీతో, మానసిక లోతులతో చిత్రీకరించింది. సాహిత్యంలో మొదటి దశల్లో స్త్రీలను ఎక్కువగా పురుష రచయితల దృష్టిలో చూసేవారు. ఆ దృష్టిలో స్త్రీలను త్యాగమూర్తులుగానో లేక ఆకర్షణీయమైన పాత్రలుగానో చూపేవారు. వారి అంతర్గత భావాలు, ఆలోచనలు, ఆత్మగౌరవం వంటి అంశాలు పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. కానీ 'వాస్తవికత' అనే ధోరణి పెరుగుతున్న కొద్దీ, రచయితలు స్త్రీలను నిజమైన మనుషులుగా, వారి అంతర్గత సంఘర్షణలతో, ఆత్మపరిశీలనతో చిత్రీకరించడం ప్రారంభించారు. ఇదే 'ఉమెన్స్ రియలిజం' మూలభావం. స్త్రీల అంతర్గత జీవితాలపై దృష్టి పెట్టడం ఈ ధోరణిలో అత్యంత ముఖ్యమైన అంశం. 20వ శతాబ్దంలో, ముఖ్యంగా వర్జీనియా ఊల్ఫ్ వంటి రచయిత్రులు 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' అనే శైలిని ఉపయోగించి స్త్రీల ఆలోచనల ప్రవాహాన్ని, వారి మానసిక స్థితులను సున్నితంగా ఆవిష్కరించారు. ఆమె రచనలు స్త్రీల మనస్సులో జరిగే చిన్న చిన్న భావోద్వేగ మార్పులను కూడా సాహిత్యంగా మలిచాయి. ఉదాహరణకు 'మిసెస్ డాలోవే' లేదా 'టు ది లైట్‌హౌస్' వంటి రచనలు, బాహ్య సంఘటనల కంటే అంతర్గత అనుభవాలపై ఎక్కువగా దృష్టి సారిస్తాయి. ఇది స్త్రీల జీవితాన్ని ఒక కొత్త కోణంలో చూడటానికి దోహదపడింది. 19వ శతాబ్దంలోనే జార్జి ఇలియట్, చార్లొటె బ్రాంట్ వంటి రచయిత్రులు స్త్రీల జీవితాలను గంభీరంగా పరిశీలించడం ప్రారంభించారు. జార్జ్ ఎలియట్ రచనల్లో స్త్రీలు సామాజిక పరిమితుల్లో ఎలా బంధించబడ్డారో, ఆ బంధాలను ఎలా ఎదుర్కొన్నారో స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె రచనల్లో మానసిక విశ్లేషణకు ప్రత్యేక స్థానం ఉంది. చార్లెట్ బ్రొంటే రచనల్లో స్త్రీల స్వతంత్ర ఆలోచన, ఆత్మగౌరవం, ప్రేమలో సమానత్వం వంటి అంశాలు బలంగా వ్యక్తమవుతాయి. 'విల్లెట్టె' వంటి రచనల్లో స్త్రీల ఒంటరితనం, అంతర్గత పోరాటం, సమాజంతో వారి సంబంధం వంటి విషయాల లోతైన అధ్యయనం కనిపిస్తుంది. మహిళల వాస్తవ పరిస్థితులను వెలికితీసే రచనల ప్రధాన లక్షణాల్లో కీలకమైనదిగా పితృస్వామ్య వ్యవస్థపై విమర్శను పేర్కోవాలి. స్త్రీలు పెళ్లి, కుటుంబం, ఆర్థిక ఆధారపడడం వంటి అంశాల వల్ల ఎలా పరిమితులలో బంధించబడ్డారో ఈ రచనలు స్పష్టంగా చూపించాయి. పెళ్లి అనేది స్త్రీకి ఒక గమ్యం మాత్రమే కాదు, ఒక బంధనంగా కూడా మారుతుందనే భావజాలాన్ని ఈ రచనలు ప్రశ్నించాయి.



స్త్రీలకు విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వతంత్రం లేకపోవడం వల్ల వారి జీవితం ఎలా నియంత్రితమవుతుందో వాస్తవికంగా చిత్రీకరించారు. 19వ శతాబ్దం చివరిలో 'న్యూ ఉమన్' అనే భావన సాహిత్యంలో ప్రాముఖ్యత పొందింది. ఇది స్వతంత్రంగా ఆలోచించే, విద్యను కోరుకునే, రాజకీయ హక్కులను డిమాండ్ చేసే కొత్త తరహా మహిళను సూచిస్తుంది. ఈ భావన స్త్రీల పాత్రను పూర్తిగా మార్చింది. ఫలితంగా స్త్రీలు కేవలం కుటుంబానికి పరిమితమైన పాత్రలుగా కాకుండా, సమాజంలో చురుకుగా పాల్గొనే వ్యక్తులుగా రూపుదిద్దుకుంటున్నారు. ఈ మార్పు సాహిత్యంలో కూడా స్పష్టంగా కనిపించింది. 20వ శతాబ్దంలో ఈ రకమైన భావజాలం మరింత విస్తరించింది. ముఖ్యంగా వర్ణ వివక్ష, వర్గ వివక్ష వంటి అంశాలు కూడా ఈ ధోరణిలో భాగమయ్యాయి. జొరా నీలె హర్‌స్టన్ వంటి వారు ఆఫ్రికన్‌అమెరికన్ మహిళల జీవితాలను, వారి పోరాటాలను సాహిత్యంలో ప్రతిబింబించారు. జొరా రచించిన 'దెయిర్ ఐస్ వర్ వాచింగ్ గాడ్' అనే నవలలో ఒక నల్ల జాతి మహిళ తన స్వరాన్ని ఎలా కనుగొంటుందో, తన జీవితాన్ని ఎలా స్వయంగా నిర్మించుకుంటుందో చూపించారు. ఇది మహిళల జీవితాల్లోని వాస్తవ కోణాలకు ఒక విస్తృత పరిశీలనను అందించింది. స్త్రీల అనుభవాలు ఒకే విధంగా ఉండవని, వర్ణం, వర్గం, సంస్కృతి వంటి అంశాలు వాటిని ప్రభావితం చేస్తాయని ఈ రచనలు స్పష్టం చేశాయి.

భారతీయ సాహిత్యంలోనూ 'మహిళలు.. వాస్తవికత' అనేది ముఖ్యమైన స్థానం సంపాదించింది. శశి దేశ్ పాండే వంటి రచయిత్రులు భారతీయ మహిళల జీవితాలను వాస్తవికంగా చిత్రీకరించారు. సంప్రదాయం మరియు ఆధునికత మధ్య స్త్రీలు ఎలా చిక్కుకుపోతారో, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయాల మధ్య వారు ఎలా సమతుల్యత సాధించడానికి ప్రయత్నిస్తారో ఆమె రచనల్లో కనిపిస్తుంది. భారతీయ సమాజంలో స్త్రీల స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ఈ రచనలు ముఖ్యమైన ఆధారాలుగా నిలిచాయి. కాగా, ఈ కోణాన్ని పరిశీలించే సమయంలో, ఇలాంటి రచనలు కేవలం స్త్రీల బాధలను మాత్రమే చూపించే ధోరణిగానే కొనసాగాలా? అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాలి. స్త్రీల సామర్థ్యాన్ని, వారి ఆత్మగౌరవాన్ని, వారి ఆలోచనా శక్తిని కూడా ప్రతిబింబించాలనే ఆలోచనను స్వాగతించాలి. స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను చూపడమే కాదు, వాటిని అధిగమించడానికి వారు చేసే ప్రయత్నాలను కూడా మహిళావాద రచనలు కళ్లకు కడతాయి. ఇది ఒక రకంగా స్త్రీల స్వరాన్ని ప్రపంచానికి వినిపించే సాధనం. ప్రతి నాణానికే మరో కోణం ఉన్నట్టే, మహిళావాద సాహిత్య ధోరణిపైనా విమర్శలు లేకపోలేదు. కొందరు విమర్శకులు ఈ తరహా రచనలు ఎక్కువగా మధ్యతరగతి మహిళల అనుభవాలపై మాత్రమే దృష్టి పెట్టాయని అంటారు. గ్రామీణ మహిళలు, పేద వర్గాల మహిళలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన మహిళల అనుభవాలు కొన్నిసార్లు ఈ సాహిత్యంలో తక్కువగా కనిపిస్తాయని విమర్శిస్తారు. ఇది ఒక పరిమితి. కానీ తరువాతి దశల్లో వచ్చిన రచయితలు ఈ లోపాన్ని పూరించడానికి ప్రయత్నించారు. ఇక్కడ, మరో ప్రధాన అంశాన్ని కూడా ప్రస్థావించాలి. వాస్తవిక పరిస్థితులు అంటే ఏమిటి? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వడం కష్టం. ప్రతి రచయిత తన దృష్టి కోణం నుంచి వాస్తవాన్ని గ్రహించడానికి ప్రయత్నిస్తాడు. రచనల్లో ప్రతిబింబిస్తాడు. ఈ దిశగా ఆలోచించినప్పుడు, మహిళల వాస్తవ పరిస్థితులపై వచ్చే రచనలన్నింటినీ నిష్పాక్షికంగా పేర్కోవడానికి వీల్లేదు. అవి ఒక నిర్దిష్ట దృష్టికోణాన్ని ప్రతిబింబించే ప్రమాదం ఉంది. ఇలాంటి కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, స్థూలంగా చూస్తే మాత్రం 'మహిళ.. వాస్తవికత' అనేది సాహిత్యంలో ఒక కొత్త మార్గాన్ని తెరిచిందని చెప్పవచ్చు.

ఉమెన్స్ రియలిజాన్ని కొంత మంది పూర్తి స్థాయి సాహిత్య ధోరణిగా అంగీకరించరు. వారి ఉద్దేశంలో ఇది ఒక సామాజిక ఉద్యమం. ఈ వాదనలో కొంత వాస్తవం లేకపోలేదు. అయితే, 'వాస్తవికత' అనేది ఏదో ఒక మూలంపై ఆధారపడి ఉంటుంది. స్వేచ్ఛ కోసం... సమానత్వం కోసం.. హక్కుల కోసం మహిళల చేస్తున్న మహా ఉద్యమంలో, స్త్రీవాద సాహిత్యం ఒకటి. అందులో వాస్తవికత మరో కోణం. సమాజం ద్వారా సాహిత్యం ప్రభావితమవుతుంది. సాహిత్యం ద్వారా సమాజంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ రెండూ పరస్పర పూరకాలు. అంతేకాదు, స్త్రీల వాస్తవికత అంటే అది కేవలం స్త్రీల జీవితాలను నిజంగా చూపించడం అని అనుకుంటే, అది పూర్తి సత్యం కాదు. ఎందుకంటే 'వాస్తవం' అనే పదమే ఒక నిర్మాణాన్ని సూచిస్తుంది. అది ఎవరి దృష్టిలో వాస్తవం? ఎవరి అనుభవం ప్రామాణికం? అనే ప్రశ్నలు ఇక్కడ కీలకం. ఈ ప్రశ్నలు సాహిత్యాన్ని మాత్రమే కాకుండా, జ్ఞానం అనే భావనను కూడా లోతులుగా పరిశీలిస్తాయి. కాగా, కొంత మంది విమర్శలు 'స్త్రీల వాస్తవికత' కంటే, 'ఆధునిక స్త్రీవాదం', 'వలసవాదానంతర స్త్రీవాద రచనలు' వంటి ధోరణులు మరింత సమగ్రంగా స్త్రీల అనుభవాలను చూపించాయని అంటారు. ఎందుకంటే అవి కేవలం వాస్తవికతతో పరిమితం కాకుండా, భాష, శైలీ, కథన నిర్మాణం వంటి అంశాలను కూడా విప్లవాత్మకంగా మార్చాయని వారి వాదన. ఏదిఏమైనా, స్త్రీల వాస్తవికత సాహిత్యంలో ఒక కీలక దశ. ఇది స్త్రీలను ఒక విషయంగా కాకుండా, ఒక స్వరంగా మార్చింది. ఇది సాహిత్యాన్ని మరింత సమానత్వ దిశగా నడిపించింది. ఇది ఇంకా అభివృద్ధి చెందుతున్న ప్రక్రియ. సమాజం మారుతున్న కొద్దీ, స్త్రీల అనుభవాలు కూడా మారుతున్నాయి. అందువల్ల ఈ ధోరణి కూడా నిరంతరం కొత్త రూపాలను సంతరించుకుంటూనే ఉంటుంది. ఈ ధోరణిని అర్థం చేసుకోవడం అంటే కేవలం సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం కాదు.... సమాజాన్ని, శక్తి సంబంధాలను, లింగ అసమానతలను, మానవ అనుభవాలను అర్థం చేసుకోవడం. స్త్రీల బాధ, నిశ్శబ్ద వేదన, సామాజిక ఒత్తిళ్లు వంటివి సాహిత్యంలో పదే పదే ప్రతిధ్వనించే ప్రధాన అంశాలు. చాలా ప్రసిద్ధ గ్రంథాలు ఈ అనుభవాలను కేవలం కథలుగా కాకుం డా, ఒక సామాజిక నిర్మాణంపై విమర్శగా కూడా చూపిస్తాయి. ముఖ్యంగా పితృస్వామ్యం, కుటుంబ బంధనాలు, భావోద్వేగ గాయాలు వంటి అంశాలు ఈ రచనల్లో కేంద్రంగా ఉంటాయి. అయితేఈ కథలు కేవలం బాధను చూపించడమేనా, లేక బాధను అర్థం చేసుకునే ఒక రాజకీయ, సామాజిక ఫ్రేమ్ వర్క్‌ను కూడా నిర్మిస్తున్నాయా? అనేదే ప్రశ్న. సమాధానం అనుకున్నంత సులభం కాదు.

— సత్యశ్రీ

# విలక్షణ కవితా ప్రవాహం.. అనుముల కృష్ణమూర్తి

తెలుగు, సంస్కృతం, పారసీ, అరబ్బీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో చక్కని పాండిత్యం కలిగినవాడు, పద్యం, గేయం, వచనం, పాట, గజల్, రుబాయీ ఏదైనా ఆకర్షణీయంగా, సమర్థవంతంగా రాయగలిగే సత్తా ఉన్నవాడు, ఎవ్వరితోనైనా నిర్మొహమాటంగా మాట్లాడే మనస్తత్వం కలిగినవాడు, చిన్నప్పుడే వేదాలను, ఉపనిషత్తులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు, సంస్కృత భాషారీతుల లోతులను తరచిచూసిన ఒక విలక్షణమైన కవితా ప్రవాహం అనుముల కృష్ణమూర్తి.

అనుముల కృష్ణమూర్తి మే 16, 1923న అనుముల వంశంలో శ్యామలా దేవి, పండరినాథ శాస్త్రి దంపతులకు జన్మించాడు. పండరినాథ శాస్త్రికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరిలో రెండవ కుమారుడు అనుముల కృష్ణమూర్తి. కృష్ణమూర్తి చదువులో చాలా చురుకుగా ఉంటాడు. అందుకే సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఫార్సీ, అరబీభాషలలో మంచి పట్టు సాధించాడు. సంస్కృతం వానమామలై వరదాచారుల తండ్రి బక్కయ్య శాస్త్రి వద్ద నేర్చుకున్నాడు. ఫార్సీ, అరబీ మౌల్వీ సమయుజ్జీమా వద్ద నేర్చుకున్నాడు. మడికొండకు చెందిన ఈయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఎ, బికాం, బిఇడి పూర్తి చేసాడు. ఆదిలాబాద్ జిల్లా చేస్నూరులో తొలి ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి మధిర, ఖిలా వరంగల్, కోస్ట్, మానుకోట, నిర్మల్, భువనగిరి, హన్మకొండ, వరంగల్‌లో పనిచేసి ప్రమోషన్‌పై పెద్దపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసారు. ఆ తర్వాత పరకాల, సుల్తానాబాద్‌లో పనిచేసారు. 1978లో పదవీ విరమణ చేశాడు. తన మేనమామ కూతురు నర్సమాంబతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన పాఠం బోధిస్తుంటే ఒక సాహిత్య సభ నిర్వహించినట్టుగా ఉండేది. తెలుగు భాషను ఎంత కమనీయంగా, ఎంత రమణీయంగా బోధించేవాడో అంతే రసవత్తరంగా ఆంగ్లభాషను కూడా బోధించి విద్యార్థి లోకాన్ని ఉర్రూతలూగించేవాడు. సరస్వతీ సాక్షాత్కారం, శబరి, అంజలి, సీతా కళ్యాణం, సహస్ర చంద్ర దర్శనం, ఉదయ భాండం మొదలైన కావ్యాలతో తెలుగు సరస్వతిని అలంకరించాడు. కృష్ణమూర్తి మిక్కిలి భావావేశం కలవాడు. కవిత్వాన్ని అత్యంత వేగంగా పరుగులు పెట్టిస్తాడు. ఆయన లయాత్మక కవితా ధార రసజ్ఞుల హృదయాలను తట్టి లేపుతుంది.

అనుముల కృష్ణమూర్తికి కాళోజీ సోదరులంటే భక్తి, కృష్ణమూర్తి ని సొంత తమ్ముడిగా భావించేవాడు. కాళోజీ సోదరులతో పాటు బిరుదురాజు రామరాజు, వానమామలై వరదాచార్యులు మొదటినుండి సన్నిహితులుగా ఉన్నారు. కృష్ణమూర్తి, జువ్వాది కాంతమరావు మంచి మిత్రులు. సాహిత్యం తప్ప ఏమీ ఎరుగని కృష్ణమూర్తి సతీమణి నర్సమాంబ జబ్బు చేసి 1983లో మరణించింది. కృష్ణమూర్తి రచించిన పద్యాలకు మొదట శ్రోతధారి ఆమె.

అనుముల కృష్ణమూర్తి కుదురులేని మనిషి. ఎంతో గొప్ప కవితాధార ఉండి, పాండిత్యముండి, విస్తృతమైన అధ్యనాలు చేసారు, కానీ ఈయన రచనలు చాలా తక్కువ. చిత్తు కాగితాలపై ఎక్కడపడితే అక్కడ రాసి పారేసేవారు, అనువుగా చెప్పేవారు. ఈయన పద్యాలు సరస్వతీ సాక్షాత్కారము శబరి, ఇతర ఖండికలు అనే గ్రంథం. ఈ కావ్యాన్ని కాళోజీ ప్రమేయంతో 1967లో యువభారతి వారు తమ మొదటి ప్రచురణగా ప్రచురించారు. రెండవ ముద్రణ కూడా ప్రచురించారు.

1967లో ప్రచురించబడిన 'సరస్వతీ సాక్షాత్కారము' కావ్యం శబరి ఇతర ఖండికలతో కలిసి 2007 వారి పిల్లల ప్రచురణ చేసారు. ఈ ప్రచురణకు సహకరించిన వారు నాగిళ్ళరామశాస్త్రి, ఆచార్య ఎస్.లక్ష్మణమూర్తి. సరస్వతీ సాక్షాత్కారము ఒక గొప్ప రసకావ్యం. ఈ రచనతో అనుముల కృష్ణమూర్తికి మహాకవి అని పేరు వచ్చినది. ఈయన గాత్రం కూడా గొప్పగా ఉంటుంది. ఆయన ఏ పద్యం చదివినా శ్రోతలు తన్మయంలో ఊగిపోయేవారు. తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, యువభారతి వారి 'రసబ్రహ్మ' బిరుదు వంటి అనేక గౌరవ సత్కారాలు అందుకొని తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అనుముల కృష్ణమూర్తి 1996, మార్చి 31న స్వర్గస్థులైనప్పటికీ తెలుగు సాహిత్య వనంలో ఎల్లప్పుడూ కవితా సుమాలు వెదజల్లుతూనే ఉంటాడు.

**(మే 16న అనుముల కృష్ణమూర్తి జయంతి)**

**— సుధాకర్.ఏ.వి**
**స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)**
**రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు**
**9000674747**

## ఈ వారం కవితలు

### ఓ కవీశ్వరా!

కుళ్ళును కడిగేయ్—
కంపు కాయాల్ని కాల్చివేయ్,
కపటపు కవచాల్ని ఛేదించేయ్,
కలుషిత మనసులను శుద్ధిచేయ్

చెడును చెరిపేయ్—
చీకటి చాటున దాగిన దుర్బుద్ధిని,
చెరగని మచ్చలై పెరిగిన పాపాన్ని,
చైతన్య జ్వాలలతో చిదిమివేయ్

మలినాన్ని మట్టుబెట్టేయ్—
మనసుల్లో పేరుకున్న మసకలను,
మాటల్లో మొలిచిన మోసపు ముళ్లను
మానవత్వ వర్షంతో ముంచెత్తేయ్

అవినీతిని అంతంచేయ్—
అధికారపు అహంకార జ్వాలలను,
అన్యాయపు అడ్డగోలు దారులను
అక్షర సత్యంతో అణచివేయ్

అహంకారాన్నీ అణగకొట్టేయ్—
అధికత్వపు అంధకార గర్జనలను,
అణగారిన వారి ఆర్తనాదాలపై
సమానత్వ అమృతం చల్లివేయ్

దౌర్జన్యాలను తుదముట్టించేయ్—
దుర్మార్గపు దండయాత్రలన్నిటినీ,
దీనుల కన్నీటి గాథలన్నిటినీ,
ధర్మధ్వజంతో ధూళిలో కలిపివేయ్

మానవత్వమే మంత్రంగా మారనీ,
మమతలే మహోన్నత మార్గమవనీ,
నిజాయితీనే నిత్యదీపమై వెలగనీ,
నూతన సమాజం నవోదయమై విరియనీ

**— గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**

### చెట్టు నీడ చల్లని మేడ!!

ఎండాకాలం వస్తే చెట్టు నీడను వెతుక్కుంటాం

చల్లని నీడ కోసం
మన ఇంటి దగ్గరే
చెట్టు నాటాలను
కుంటాం



ఎండా కాలం
చెట్టు విలువ తెలు
స్తుంది
ఉన్న చెట్టును కొట్టే వాళ్లకు
హితోపదేశం చేస్తాం

అందరికీ 'పిల్లలమర్రి 'మహా వృక్షం యాదికొస్తుంది

చెట్టు నీడ నిజంగా చల్లని మేడ అనుకుంటాం

**— కందాళై రాఘవాచార్య**
**8790593638**

### కెరటాలు కేరింతల పిల్లలు!

కెరటాలు లేచిపడుతు ఆడే పిల్లలు
అందుకే అటువైపు మన చూపులు
కేరింతల చిన్న పిల్లల సరదాలు
చూపు మరల్చనీయని సంతోషాల
అలలు

తల్లి ఒడిలో ఊగే పిల్లలు అలలు
అలల సవ్వడులు పిల్లల కేరింతలు
వింటే వీనుల విందు నవ్వుల
సరాగాలు
సప్తస్వరాల పదనిసల సరిగమలు!

అటు ఇటు వచ్చి పోయే కెరటాలు
విశాల సముద్ర మైదానంలో
పరుగులు తీసే క్రికెట్ బ్యాట్స్‌మన్‌లు
కొన్ని ఫోర్‌లు కొన్ని బౌండరీ దాటే
సిక్స్‌లు!
పిల్లల మనసులో అశాంతి
ఆందోళనలు
సముద్రం లోటు పాటు ఆటు పోటులు
పిల్లలు పెద్దలై చేపట్టే పౌర బాధ్యతలు
రవాణా బాధ్యతలు మోస్తున్న
కెరటాలు!

చెలియలి కట్ట దాటని కెరటాలు
నియమ నిబంధనలు పాటించే పిల్లలు
ఎడతెగక ఒడ్డును ముద్దాడే కెరటాలు
పెద్దలకు ఎప్పుడూ కేరింతల చిన్న
పిల్లలు!

**— పట్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

### వేసంగి వ్యథలు

మండుటెండలు మంటలు రేపగా—
గ్రీష్మ ఋతువు గగనమంతా గర్జిస్తోంది,
మేమాస వడగాల్పులు వీస్తుంటే
వేడి గాలులు వీధుల్ని వణికిస్తున్నాయి

ఉక్కపోతలు ఊపిరిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే,
చెమట చుక్కలు శ్రమల సాక్ష్యాలై జారుతున్నాయి,
ఎండిన చెరువులు నిశ్శబ్దంగా నిలిచిపోతుంటే
ప్రవహించని నదులు వేదనను వెల్లబోస్తున్నాయి

తడిలేని నాలుకలు తపనగా వణుకుతుంటే,
దప్పికైన గొంతులు నీటి కోసం మొరపెడుతున్నాయి,
కొట్టుకుంటున్న గుండెలు వేడిని తట్టుకోలేకపోతుంటే
కూలిపోతున్న దేహాలు నీడ కోసం పరుగెడుతున్నాయి

వేసంగి వదలని వేదనగా వెంటాడుతుంది,
నీడకై పరుగులు తీయిస్తుంది,
నీటికై ముచ్చెమటలు పట్టిస్తుంది,
కదలకుండా గృహాల్లో బంధిస్తుంది

ఇదే గ్రీష్మ తాపము—
జీవితాన్ని జ్వాలలతో పరీక్షించే కాలము,
ఇదే సూర్య ప్రతాపము—
ప్రకృతిశక్తి పరాక్రమం చూపించే ఉగ్ర రూప


చినుకులు చిందించే మేఘాల కోసం ఎదురుచూపులు,
చల్లని గాలుల స్పర్శకై తపిస్తున్న ప్రాణాలు
గ్రీష్మాగ్ని గుండెల్ని గాయపరిచినా—
వానకాలం వస్తుందనే ఆశే జీవనానికి ఊపిరై నిలుస్తోంది

**— జిఆర్‌పి**



## చదవాల్సిన పుస్తకం

### స్వేచ్ఛా 'మైదానం'లోకి పరుగు




'స్త్రీ స్వేచ్ఛ' అనగానే తెలుగు పాఠకులకు ముందుగా గుర్తొచ్చే పేరు చలం (గుడిపాటి వెంకట చలం). చలం పేరుతోపాటు ముడిపడిన మరో పదం 'మైదానం'. ఒక రకంగా మైదానం నవల చలం పేరుతో కలిసిపోయి నట్టు కనిపిస్తుంది. ఈ నవల తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మక మలుపు. ఈ పుస్తకం కథను చెప్తుంది. ప్రశ్నలు అడుగుతుంది. సంప్రదాయ ధోరణులకు సవాళ్లు విసురుతుంది. బహిరంగ చర్చలో ఒక రకమైన అసౌకర్యాన్ని అనుభవించేవారు ఎందరో. ఈ రచనను పాఠ్యపుస్తకాల ద్వారా కాకుండా, నాటక ప్రకటనలు, ఆడియో రూపాలు వంటి ఆధునిక మాధ్యమాల ద్వారా, ప్రత్యామ్నాయ మార్గాల్లో అనుభవించడం ఆసక్తికరం. ఈ పరిణామం, సాహిత్యం ఎలా కాలంతో పాటు తన పాఠకులను చేరుకుంటుందో చూపిస్తుంది. కేవలం ఇరవై నిమిషాల వ్యవధిలో ముగిసే ఈ కథ, తన ప్రభావంలో మాత్రం దీర్ఘకాలికంగా నిలుస్తుంది. సంక్షిప్తత ఇక్కడ పరిమితి కాదు... అది కేంద్రీకరణ. ఒక మెరుపు లాంటి దెబ్బలా, ఈ కథ ముగిసిన తర్వాత కూడా మనస్సులో ప్రతిధ్వనులు కొనసాగుతాయి. ఈ నవల ప్రారంభమే ఒక విడిపోవడం... ఒక విరామం... రాజేశ్వరి అనే యువ బ్రాహ్మణ గృహిణి తన భర్తను వదిలి, అమీర్ అనే ముస్లిం వ్యక్తిని ఎంచుకోవడం ద్వారా కథ ప్రారంభమవుతుంది. ఈ చర్యను సాధారణంగా ఒక వ్యక్తిగత నిర్ణయంగా చూడటం సరిపోదు. ఇది ఒక సామాజిక వ్యవస్థపై ప్రత్యక్ష దాడి. వివాహం అనే పవిత్ర బంధాన్ని, కుల పరిమితులను, మత విభజనలను ఒకేసారి ప్రశ్నించే వైనం. ఈ నిర్ణయం నైతికంగా సరైనదా? తప్పిదమా? అన్నది ప్రధానం కాదు... ఈ నిర్ణయం ఎందుకు అంత తీవ్ర ప్రతిస్పందనను కలిగిస్తుందన్నదే అసలు ప్రశ్న. రాజేశ్వరి పాత్ర ఈ నవలలో కేంద్రంగా ఉంటుంది. ఆమె ఒక బాధితురాలు. ఆమె ఒక నిర్ణయాత్మక వ్యక్తి. తన కోరికలను, తన శరీరాన్ని, తన జీవితాన్ని తనే నిర్ణయించుకోవాలనే ప్రయత్నం చేస్తుంది. ఈ కోణంలో చూస్తే, రచయిత చలం తన కాలానికి చాలా ముందు ఉన్నాడు. ఎంతో దూర దృష్టిని ప్రదర్శించాడు. స్త్రీల కోరికలను, శృంగారాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను బహిరంగంగా రాయడం ఆ కాలంలో ఎవరూ చేయలేని ఒక గొప్ప సాహసం. ఒక తిరుగుబాటు. అయితే, రాజేశ్వరి స్వేచ్ఛను పొందిందా? లేక ఒక బంధం నుంచి బయటపడి, మరొక బంధంలోకి ప్రవేశించిందా? అనే ప్రశ్నలు తలెత్తినప్పుడు, అత్యంత లోతైన విశ్లేషణ అవసరమవుతుంది. అమీర్‌తో కలిసి మైదానం అనే ప్రదేశానికి వెళ్లడం ఒక స్వేచ్ఛా యాత్రలా కనిపించినా, అది పూర్తిగా విముక్తి కాదనే భావన కథలో అంతర్లీనంగా ఉంటుంది. ఇది 'ఉమెన్స్ రియలిజం'లో ముఖ్యమైన అంశం. స్వేచ్ఛ అనేది సులభంగా పొందే గమ్యం కాదు. అంతర్గత సంఘర్షణలతో కూడిన ప్రక్రియ. ఈ నవలలో మైదానం అనే స్థలం కూడా ఒక ప్రతీకగా పనిచేస్తుంది. అది ఒక ఖాళీ ప్రదేశం మాత్రమే కాదు... ఒక పరీక్షా స్థలం. అక్కడ రాజేశ్వరి తన కోరికలను, తన అపరాధ భావనను, తన ఆకాంక్షలను ఎదుర్కొంటుంది. ఇది ఒక అంతర్గత యుద్ధభూమి. స్వేచ్ఛ కోసం తీసుకున్న నిర్ణయం కూడా బాధను, సందేహాన్ని, ఒంటరితనాన్ని తెస్తుందని ఈ ప్రదేశం సూచిస్తుంది. స్త్రీకి భద్రత కల్పించే మిషతో, మెరుగైన జీవితాన్ని అందించాలనే వాదనతో వారి స్వేచ్ఛకు సంకెళ్లు తగిలించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఒక పురుషుడు తన కోరికలను వ్యక్తీకరించినప్పుడు.. అనుసరించినప్పుడు లేని అభ్యంతరం మహిళల విషయంలో ఎందుకు వస్తుందంటూ సమాజాన్ని నిలదీస్తాడు చలం. ఒక స్త్రీ తన కోరికలను బహిరంగ పరచడానికి ఒక అపరాధంగా... ఒక విప్లవంగా... ఒక పతనంగా ఎందుకు చూస్తారన్న ప్రశ్న మైదానం చదివిన ప్రతి ఒక్కరి మనసులోనూ మెదులుతుంది. స్త్రీపురుషుల పట్ల సమాజం అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను రచయిత తీవ్రంగా ప్రశ్నించాడు. ఈ ప్రశ్నలు నిన్నమొన్నకాదు... సుమారు వంద సంవత్సరాల క్రితమే చలం సంధించాడంటే, ఆయన ఆలోచనా పరిధిని ఊహించుకోవచ్చు. అందుకే, 1927లో విడుదలైనప్పుడు ఎంత సంలచనం సృష్టించిందో, 2026లోనూ 'మైదానం' అదే స్థాయిలో ప్రకంపనలు రేపుతుంది. అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పులు వచ్చినప్పటికీ, స్త్రీ స్వేచ్ఛపై సమాజం ఇంకా సందేహంతోనే చూస్తుంది. రాజేశ్వరి నిర్ణయాలను కొందరు ఆచరణకు అసాధ్యమైనవిగానూ, బాధ్యతారహితంగా భావించవచ్చు. ఈ విమర్శను పూర్తిగా తిరస్కరించడం కష్టం. ఎందుకంటే ఆమె చర్యలు వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, ఇతరుల జీవితాలను కూడా ప్రభావితం చేస్తాయి. కానీ, సామాజిక నిర్మాణాలు ఎంత బలంగా ఉంటే, వాటిని కదిలించడానికి అంత తీవ్ర చర్యలు అవసరమవుతాయనే వాస్తవాన్ని కూడా గుర్తించాలి. చిన్న మార్పులు పెద్ద వ్యవస్థలను కదిలించలేవు. కాబట్టి రాజేశ్వరి చర్యలను ఒక వ్యక్తిగత తప్పిదంగా కాకుండా, ఒక నిర్మాణాత్మక సవాలుగా చూడాలి. ఈ నవల ముగింపులో స్పష్టత లేదన్న విమర్శలున్నాయి. ఎందుకంటే, కథకు స్పష్టమైన పరిష్కారం ఇవ్వదు. రాజేశ్వరి సంతోషంగానే ఉంటుంది. తిరిగి పాత జీవితంవైపు వెళుతుంది. ఈ అస్పష్టత పాఠకుడికి అసంతృప్తిని కలిగిస్తుంది. కానీ ఇదే ఈ రచన బలం కూడా. జీవితం ఎప్పుడూ మనం కోరుకున్న ఫలితాలను మాత్రమే ఇవ్వదు. ముఖ్యంగా స్త్రీ విముక్తి వంటి సంక్లిష్ట అంశాలు ఒక సరళమైన ముగింపుతో ముగియవు. ఈ అసంపూర్ణత వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. ఈ సందర్భంలో 'అమ్మా వంధాళ్' అనే తమిళ రచనతో పోలిక ఆసక్తికరంగా ఉంటుంది. అక్కడ తల్లి చేసిన పాపం వల్ల కుమారుడు అనుభవించే మానసిక వేదన ప్రధానంగా ఉంటుంది. ఇక్కడ స్త్రీ స్వరం కనిపించదు... బదులుగా, సమాజం ఆ చర్యను ఎలా చూస్తుందో కనిపిస్తుంది. ఈ రెండు రచనలు కలిసి ఒక సమగ్ర దృశ్యాన్ని ఇస్తాయి. ఒకటి తిరుగుబాటును చూపితే, మరొకటి దాని ప్రతిఫలాలను చూపిస్తుంది. ఇది ఒక కీలక విశ్లేషణను సూచిస్తుంది. స్త్రీ స్వేచ్ఛ ఒక వ్యక్తిగత నిర్ణయం కావచ్చు. కానీ, అది కుటుంబం, తరాలు, సమాజం మీద ప్రభావం చూపుతుంది. మైదానంలో రాజేశ్వరి కథను ఒక సాధారణ స్త్రీ ప్రతినిధిగా చూడవచ్చా? లేక ఆమె ఒక ప్రత్యేక సందర్భమా? ఎందుకంటే ఆమెకు తీసుకునే ధైర్యం, ఆర్థిక పరిస్థితి, వ్యక్తిగత స్వభావం వంటివన్నీ ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఈ కారణంగా, ఈ కథను ఒక సాధారణ పరిష్కారంగా చూడడం సరైంది కాదు. కానీ ప్రశ్నించడం అనే ఒక ముఖ్యమైన బాధ్యతను స్వీకరిస్తుంది. సమాధానాలను ఇవ్వడం కన్నా, ప్రశ్నలను నిలబెట్టడం ఈ రచన ప్రధాన లక్ష్యం. సంక్షిప్తత గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇరవై నిమిషాల్లో పూర్తయ్యే కథ అయినప్పటికీ, ఇది ఒక శతాబ్దం పాటు కొనసాగిన చర్చలను తనలో సాంద్రీకరించింది. ఇది ఒక సాహిత్య వ్యూహం. అనవసరమైన వివరాలను తొలగించి, కేవలం ముఖ్యమైన భావాలను మాత్రమే ఉంచడం ద్వారా, రచయిత పాఠకుడిని నేరుగా సమస్యలతో ఎదుర్కొమంటాడు. ఇది ఒక సూటి దెబ్బలా పనిచేస్తుంది. 1927లో రాజేశ్వరి తన వివాహాన్ని వదిలి వెళ్లింది. అది ఒక సంచలనంగా మారింది. కానీ దాదాపు శతాబ్దం తర్వాత కూడా, ఒక స్త్రీ తన జీవితం గురించి స్వతంత్ర నిర్ణయం తీసుకుంటే, అది ఇంకా చర్చకు, విమర్శకు గురవుతోంది. ఇది సమాజంలో మార్పు ఎంతవరకు జరిగింది అనే విషయాన్ని ప్రశ్నిస్తుంది. మొత్తంగా చూస్తే, మైదానం ఒక సాహిత్య కృతి మాత్రమే కాదు... ఒక ఆలోచనా ప్రక్రియ. ఇది పాఠకుడిని అసౌకర్యానికి గురి చేస్తుంది. ప్రశ్నలను లేవనెత్తుతుంది, స్పష్టమైన సమాధానాలను ఇవ్వకుండా వదిలేస్తుంది. అదే దీనికి ఉన్న స్థిరమైన ప్రాముఖ్యత. ఇది ముగిసిన తర్వాత కూడా, దాని ప్రభావం మనలో కొనసాగుతూనే ఉంటుంది.

**(చలం జయంతి మే 18, వర్ధంతి మే 4)**

### బిసిలకు ద్రోహం చేస్తున్న బిజెపికి

# రాజకీయ పతనం తప్పదు

జనగణనలో కులగణన చేయడానికి అభ్యంతరం ఏమిటి ?

గన్‌పార్క్ వద్ద జరిగిన ఆందోళనలో అఖిలపక్ష నేతల హెచ్చరిక

బిసిలు కన్నెర్రజేస్తే బిజెపి అధికారంలో ఉండగలుగుతుందా?

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి ఆవిర్భావం నుండి నేటి వరకు బిసిలకు అన్యాయం చేస్తూనే ఉందని, బిసిలకు ద్రోహం చేస్తున్న బిజెపి చరిత్రలో పతనంగాక తప్పదని అఖిలపక్ష నేతలు తీవ్రంగా హెచ్చరించారు. జనగణంలో సమగ్ర కులగణన చేపడతామన్న ప్రధాని మోదీ హామీ విస్మరించడంతోపాటు ఆదివారం మోదీ తెలంగాణ పర్యటనకు నిరసనగా బిసి సంక్షేమ సంఘం పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా బిసిలు నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. అందులో భాగంగా హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర ఒబిసి సెల్ చైర్మన్ కె.శంకరయ్య, టిజెఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కొదండరాం, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్, ఎంఎల్‌సి మధుసూధనచారి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారత దేశంలో అత్యధిక జనాభా కలిగిన బిసి సమాజానికి విద్య, ఉద్యోగ, రాజకీయాలలో సమాన వాటా దక్కాలంటే జనగణనలో కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం అందరికీ సమాన హక్కులు కల్పించాలని అన్నారు. ఈ దేశంలో పశువులు, కుక్కలు, జంతువుల సంఖ్య లెక్కకడుతున్నా బిజెపి, అత్యధిక జనాభా కలిగిన బిసిలను ఎందుకు లెక్కించడం లేదని ప్రశ్నించారు. బిసిలు కన్నెర్రజేస్తే బిజెపి అధికారంలో ఉండగలుగుతుందా అని ప్రశ్నించారు. బిసిల పట్ల అంకితభావంతో జనగణనలో కులగణన చేపట్టాలని, లేకపోతే రాబోయే రోజుల్లో తెలంగాణ ఉద్యమ తరహాలో బిసిలు అందరం రాజకీయాలకు అతీతంగా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా బిసి సమాజం 'ప్రధానికి పది ప్రశ్నలు' పేరుతో ప్రశ్నలు సంధిస్తే 24గంటలు గడిచినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వైపు నుండి ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం లేదని మండిపడ్డారు.

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మెజార్టీ ప్రజల ఆకాంక్షలను గౌరవించాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని, బిసిల డిమాండ్లను పరిష్కరించడంలో నరేంద్రమోదీ నేతృత్వంలో ఉన్న బిజెపి పూర్తిగా విఫలమైందన్నారు. కె.శంకరయ్య మాట్లాడుతూ బిసిలకు అన్యాయం చేస్తున్న బిజెపికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని, బిసి ప్రధానిగా నరేంద్ర మోదీ ఉన్నందుకు బిసిలు సిగ్గుపడుతున్నారని అన్నారు. మధుసూదనాచారి, వి.శ్రీనివాస్ గౌడ్‌లు మాట్లాడుతూ బిజెపి బిసిలకు ద్రోహం తలపెడుతుందని, భవిష్యత్తులో బిసిల ఆగ్రహానికి బిజెపి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించాలి

ప్రధాని మోదీకి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీకి టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టుకు వెంటనే కేంద్ర ఆమోదం ఇవ్వాలని, రూ.38,595 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మెట్రో విస్తరణను జాయింట్ వెంచర్ విధానంలో అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని, దాన్ని జాతీయ స్థాయి అర్బన్ రివర్ రీస్టోరేషన్ ప్రాజెక్టుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. బాపూఘాట్ గాంధీ సరోవర్ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ అమరావతి బందర్ పోర్ట్ గ్రీన్ ఫీల్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం, హైదరాబాద్ బెంగళూరు హైస్పీడ్ కారిడార్, రేడియల్ రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, సిగ్నల్ ఫ్రీ హైదరాబాద్ ప్రాజెక్టుల కోసం కేంద్ర నిధులు, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, తెలంగాణ విభజన చట్టంలోని హామీలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. తెలంగాణపై బిజెపి నేతలు విషం చిమ్మడం ఆపాలని, అమరవీరుల త్యాగాలకు గౌరవం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

# వి.హనుమంతరావు దీక్ష విరమణ








వి.హెచ్ దీక్షకు సంఘీభావం తెలిపిన..
సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,
మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో 60 శాతం ఉన్న బిసిలకు న్యాయం చేయాలనీ, జనగణనలో కులగణన చేయాలని కొరుతూ హైదరాబాద్ అంబర్‌పేటలోని ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావు రెండు రోజులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. కాగా, తెలంగాణ శాసనసభ పక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు ఆదివారం రాత్రి నిమ్మరసం ఇచ్చి ఆయన దీక్ష విరమింపచేశారు. అనంతరం వి.హెచ్ మాట్లాడుతూ బిసి జనాభా ప్రకారం బిసిలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించాలన్నారు.

బిసి అయి ఉండి కూడా మోదీ కూడా బిసిలకు అన్యాయం చేస్తున్నాడని విమర్శించారు. రిజర్వేషన్లు సాధించుకునే వరకు బిసిలందరం కలిసి నిరంతర పోరాటాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. దీక్షలో తనకు మద్దతు తెలిపిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**అంతకు ముందు...** జనగణనలో కులగణన చేపట్టాలని, దేశ జనాభాలో 60 శాతం ఉన్న బిసిలకు సామాజిక న్యాయం చేయాలని, సమగ్ర కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకి సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో బిసి వర్గాల అసలు జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవాలంటే కులగణన అత్యవసరమని అన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయ సాధనలో కులగణన ఒక కీలక అంశమని, బిసిల అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. బిసిల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్–విజయవాడ రహదారిని

# 8 లేన్లుగా విస్తరించాలి

ఎచ్‌హెచ్‌ఎఐ చైర్మన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ డెత్ రోడ్‌గా పేరుపొందిన హైదరాబాద్ విజయవాడ రహదారిని 8 లేన్లుగా విస్తరించే పనులను అత్యవసరంగా ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) చైర్మన్‌తో ఆదివారం మంత్రి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొనసాగుతున్న, చేపట్టబోయే జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65) విస్తరణ పనులపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే ఎల్‌బినగర్ నుంచి హయత్‌నగర్ వరకు నాగ్‌పూర్ నమూనాలో 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, దీనికి సంబంధించిన డిపిఆర్‌ను కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్)కు పంపిన విషయాన్ని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్ విజయవాడ హైవే విస్తరణతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన జాతీయ రహదారి ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్య, ఎన్‌హెచ్‌ఎఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజినీర్లు ధర్మారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కీలక క్లూ లభించింది.. పోలీసుల అదుపులో ఇద్దరు

ఐపిఎస్ భార్య హత్య కేసులో త్వరలో అరెస్టులు

ధీమా వ్యక్తం చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనుజా రంజన్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. దర్యాప్తు అధికారులకు ఈ కేసులో కీలక క్లూ లభించింది. ఈ మేరకు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాల్‌కు చెందిన కల్పన కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. త్వరలోనే అరెస్టులు ఉండే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు ఇప్పటివరకు నగరవ్యాప్తంగా 200కు పైగా సిసిటివి కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించినట్లు సమాచారం. ప్రాథమిక దర్యాప్తులో కల్పనతో పాటు మరో ముగ్గురు నేపాలీ వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దోపిడీ కోసం ఈ హత్యకు పాల్పడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి 1 గంట ప్రాంతంలో నిందితులు ఇంట్లోకి వెళ్లి, తెల్లవారుజామున 2 నుంచి 2.30 గంటల మధ్య బ్యాగులు, ఇనుప రాడ్లతో బయటకు వచ్చినట్లు సిసిటివిల్లో గుర్తించారు. అనంతరం వారు నగరం విడిచిపోయినట్లు అనుమానిస్తున్నారు.పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో తనుజా రంజన్‌ను నోట్లో గుడ్డ కుక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు తేలింది. ఘటన అనంతరం ఇంట్లోని బంగారు నగలు, విలువైన వస్తువులు మాయమైనట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు దీనిని మర్డర్ ఫర్ గెయిన్ కోణంలో విచారిస్తున్నారు. ఈ కేసు విచారణ కోసం హైదరాబాద్ పోలీసులు 10కు పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో కూడా సమన్వయం చేస్తూ నిందితుల ఫోటోలు, వివరాలు పంపినట్లు సమాచారం.

### ప్రధాని మోదీ పర్యటనలో ...

# భద్రతా లోపం కలకలం

కాన్వాయ్‌కు అడ్డంగా వెళ్లి నిరసనకు యత్నించిన ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా నేత హేమ

ఒక్కసారిగా జరిగిన పరిణామంతో అప్రమత్తమైన ఎస్‌పిజి, పోలీసులు

హేమను అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా భద్రతా వ్యవస్థలో చోటుచేసుకున్న లోపం కలకలం రేపింది. పరేడ్ గ్రౌండ్ వైపు ప్రధాని కాన్వాయ్ కదులుతున్న సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మహిళా నేత హేమ అకస్మాత్తుగా కాన్వాయ్ దిశగా దూసుకెళ్లి నిరసన వ్యక్తం చేసే ప్రయత్నం చేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో ఇప్పటికే ఎస్‌పిజి, తెలంగాణ పోలీసులు భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేశారు. అయినప్పటికీ హేమా అనే మహిళా నాయకురాలు ఒక్కసారిగా భద్రతా వలయాన్ని దాటేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ప్రధాని కాన్వాయ్ వేగంగా వెళ్తున్న సమయంలో హేమా రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేస్తూ కాన్వాయ్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది.

అయితే వెంటనే స్పందించిన పోలీసులు, ఎస్పీజీ సిబ్బంది ఆమెను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. క్షణాల్లోనే ఆమెను అక్కడి నుంచి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టు అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. భద్రతా వలయంలోకి ఎలా ప్రవేశించగలిగిందన్న అంశంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. కాన్వాయ్ రూట్‌లో విధుల్లో ఉన్న కొంతమంది సిబ్బందిపై కూడా విచారణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. హేమను పోలీసులు అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆమె నిరసనకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. కొంతసేపు బేగంపేట ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని పర్యటన సందర్భంగా దేశ అత్యున్నత స్థాయి భద్రత అమల్లో ఉండగా ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.



## రుక్మాపూర్ రైల్వే క్వార్టర్స్‌లో నలుగురు మావోయిస్టులు అరెస్టు

* ఉలిక్కిపడ్డ మహారాష్ట్ర తాండూర్ పోలీసుల కూంబింగ్ సక్సెస్, తాండూర్ డిఎస్‌పిని అభినందించిన రాష్ట్ర పోలీస్‌శాఖ

**ప్రజాపక్షం/వికారాబాద్ :** తాండూర్ నియోజకరవర్గం, పెద్దముల్ మండల పరిధిలోని రూక్మాపూర్ రైల్వే స్టేసన్ సమీపంలో గల రైల్వే స్టేషన్ క్వార్టర్స్‌లో కూలీ పనుల పేరుతో చత్తీస్‌గఢ్ నుండి వచ్చి ఇక్కడ తలదాచుకున్న ఒక మహిళ మావోయిస్టు తో సహ మరో ముగ్గురు పురుష మావోయిస్టులను తాండూర్ పోలీసుల సహకారంతో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. వికారాబాద్ జిల్లా, తాండూర్ నియోజకవర్గంలోని పెద్దముల్ మండల పరిధిలోని రుక్మాపూర్ రైల్వేస్టేషన్ జరుగుతున్న రైల్వే పనుల నిమిత్తం చత్తీస్‌గఢ్ నుండి వచ్చికూలీ పనులకు కుదిరిన నలుగురు మావోయిస్టులు ఇక్కడ తలదాచుకుంటున్నట్లు అక్కడ స్థానికంగా తెలుసుకున్న పక్కా సమాచారం మేరకు మహారాష్ట్ర పోలీసులు అదివారం రాత్రి తెల్లవారుజామున తాండూర్ పోలీసుల సహకరంతో ఆపరేషన్ నిర్వహించారు.

ప్రాథమిక సమాచారం మేరకు చత్తీసగఢ్ రాష్టానికి చెందిన నలుగురు నక్సలైట్లపై మహారాష్టలో కేసులు కూడా నమోదు అయినట్లు తెలుస్తుంది. గత వారం రోజుల నుండి నక్సలైట్లు ఇక్కడ కూలీ పనులు చేస్తునట్లుగా ప్రాథమిక సమాచారం తెలుసుకున్న మహారాష్ట్ర పోలీసులు తెలంగాణ తాండూర్ పోలీసుల సహాయం కోరినట్లు తెలుస్తుంది. తాండూర్ పోలీసుల సహకరంతో అరెస్టు చేసి మహారాష్ట్రకు తరలించడం జరిగింది. దీంతో తాండూర్ డిఎస్పి యాదయ్యకు, పోలీసుశాఖకు రాష్ట్ర పోలీసుశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

# తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం

ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నిలిపేద్దాం

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారని, తెలంగాణ ప్రజలు కుటుంబ పాలనను తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. సభ ప్రారంభంలో తెలుగులో మాట్లాడిన ప్రధాని మోదీ, ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించినట్లే తెలంగాణలో కూడా కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని, జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తును మార్చనున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా అవినీతి తప్ప మరొకటి ఉండదు అని విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ రాజకీయమని మోదీ ఆరోపించారు. దేశవ్యాప్తంగా నక్సలిజాన్ని నిర్మూలించామని, తెలంగాణలో కూడా మావోయిస్టు ప్రభావాన్ని పూర్తిగా అంతం చేయాలంటే బిజెపి పాలన రావాలని అన్నారు. కుటుంబ రాజకీయాలు, వారసత్వ పాలనకు ప్రజలు విసిగిపోయారని, విశ్వాస రాజకీయాలకే దేశ ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ సాధించిన విజయాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. 'అబ్ కీ బార్ తెలంగాణ మే బిజెపి సర్కార్' అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఏడాదిపాటు బంగారం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేద్దామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన, ఎరువుల ధరలు పెరిగాయని, అయినప్పటికీ ప్రజలపై భారం పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని కోరారు. విదేశీ వస్తువులపై ఆధారపడకుండా స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలన్నారు. పండుగలు, శుభాకార్యాలకు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని చెప్పారు. బంగారం దిగుమతులు తగ్గితే విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందన్నారు. విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లను తగ్గించుకోవాలని సూచించారు. రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తూ ఎలక్ట్రిక్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్ పెట్రోల్, డీజిల్ అవసరం దేశానికి భారీగా తగ్గుతుందని, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గితే విదేశీమారక ద్రవ్యం మిగులుతుందని తెలిపారు. వంట నూనెను కూడా మనం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. వంట నూనెలో స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. మనం ఇంట్లో వాడే వస్తువులను ఒకసారి పరిశీలించాలని, నిత్యావసర వస్తువులన్నీ విదేశాల నుంచి వచ్చినవే అన్నారు. మన ఇళ్లలో స్వదేశీ వస్తువులే ఎక్కువగా ఉండాలని, వాటినే వినియోగిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. స్వదేశీ అనేది కేవలం బిజెపి నినాదం కాదని, ఇది దేశ విధానమన్నారు.

**పరేడ్ గ్రౌండ్‌లో జనసందోహం రాజకీయ మార్పునకు సాంకేతం : రాంచందర్ రావు :** పరేడ్ గ్రౌండ్స్‌ను తరలివచ్చిన జనసందోహం రాష్ట్రంలో రాజకీయ మార్పుకు సంకేతమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న పోరాటం జాతిని విభజించే శక్తులపై పోరాటమన్నారు. కేంద్రం తెలంగాణ అభివృద్ధికి రూ.9,700 కోట్ల విలువైన ప్రాజెక్టులను అంకితం చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత 11 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని, జాతీయ రహదారులు, వందేభారత్ రైళ్లు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి వంటి అనేక ప్రాజెక్టులను అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ఒకప్పుడు బిఆర్‌ఎస్ కుటుంబ పాలనలో బందీగా ఉంటే, ఇప్పుడు గాంధీ కుటుంబం చేతిలో చిక్కుకుపోయిందన్నారు. సభలో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. తనపై రాజకీయ ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ కంటతడి పెట్టుకున్నారు. జై శ్రీరామ్ నినాదమే బెంగాల్‌లో బిజెపికి విజయాన్ని తీసుకొచ్చిందని, అదే నినాదంతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మైనారిటీ సంతుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సర్‌ను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
11-05-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD



## మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది

ఎఐఎస్ఎఫ్ నేతల అక్రమ అరెస్టులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విభజన హామీలను నెరవేర్చలేని మోదీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మోదీ తెలంగాణా పర్యటనను వాతియతంగా నిరసిస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు, నేతలను అక్రమ అరెస్టు చేయటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న యువజన ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టులు, హౌజ్ అరెస్టులతో నిర్బంధించటం రాజ్యాంగ విరుద్ధమని,ప్రజా స్వామ్య విలువలను కాలరాచటమేనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న యువజన సంఘాలపై అక్రమ కేసులను బనాయించటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ప్రధాని పర్యటనను నిరసిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు శేఖర్, రాజకుమార్, శివకుమార్, గిరిబాబు, వికాస్, ఇస్మాయిల్, ప్రదీప్, అజీం పాషా తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నిత్యావసర వస్తువులు అందజేత



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్‌లోనర్సమ్మ అనే నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ నేతలు పిట్టల నాగరాజు, గుండా నిరంజన్‌లు మూడు నెలలకు సరిపడే విధంగా నిత్యావసర వస్తువులు, 50 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందచేసారు.

## సిపిఐ నేతల అక్రమ అరెస్టులు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణా పర్యటనను సందర్భంగా సిపిఐ, అనుబంధ సంఘాల నేతలను మల్కాజిగిరి పోలీసులు ఆదివారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు తాము ఎలాంటి నిరసనలకు పిలుపివ్వనప్పటికి అక్రమంగా అరెస్టు చేయటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ముందస్తు అరెస్టుల పేరిట వామపక్షవాదులను ప్రజా సంఘాల వారిని ఎందుకు అరెస్టు చేసారో కూడా చెప్పక పోవటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు, ఎస్‌కె అజీజ్, ఐద్వా మండల కార్యదర్శి పి.మంగ తదితరులను ఆదివారం తెల్లవారు జామునే హౌజ్ అరెస్టు చేసారు.

## చలివేంద్రం ఏర్పాటు



**ప్రజాపక్షం/పరిగి :** ఎండల తీవ్రత దృష్ట్యాప్రయాణికులు, బాటసారులు ,ప్రజల దాహార్తిని తీర్చేందుకు పరిగి మండల కూదావంద్‌పూర్ గ్రామం లోని గేటు సమీపంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచు మోడే యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆళ్ల రామకృష్ణ హౌస్ అరెస్టు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పెద్ద ఎత్తున రామకృష్ణ నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు, వి.హనుమంతరావు జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. వీహెచ్ మద్దతుగా శనివారం నేషనల్ ఓబీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీ ర్యాలీ చేపట్టి సంఘీభావం తెలిపారు. ఆదివారం వీహెచ్‌కు మద్దతు గా బీసీ సంఘాల నాయకులతో కలసి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారు. కాగా నేడు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు భాగంగా ఆళ్లను హౌస్ అరెస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల మొండి వైఖరి అవలంబిస్తూ, వివక్ష చూపుతోందని ఆళ్ల రామకృష్ణ మండిపడ్డారు. మోదీ ఓబీసీ ప్రధానిగా చెప్పుకుంటూనే ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం బీసీలను అణిచివేసే కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిని, పోలీసుల తీరును ఆళ్ల రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలకు ఖూనీ చేస్తున్న బీజేపీ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

# పడకేసిన వైద్యారోగ్యశాఖ

మేడ్చల్ జిల్లాలో బస్తీ దవాఖానలు, పిహెచ్ సెంటర్లపై నిర్లక్ష్యం
అనుమతులతో పని లేకుండా వెలుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు
గుండుపై జుట్టు మొలిపిస్తాం అంటూ నకిలీ క్లినిక్‌లు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వివిధ రంగాల్లో శరవేగంతో పెరిగి పోతున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వైద్యారోగ్యశాఖ పడకేసింది. ప్రయివేట్ ఆస్పత్రులు, అనధికార క్లినిక్‌లు, నకిలీ వైద్యులతో కుమ్మక్కై నెలసరి మామూళ్లతో లక్షలాది రూపాయలు వెనకేసుకొంటున్నారే తప్ప పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులైన బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల అందించడంలో శ్రద్ధ కనపరచటం లేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగు పరచాల్సింది పోయి ప్రాంతాల వారీగా తమ సిబ్బందితో పాటు కొంత మంది ప్రయివేట్ వ్యక్తులను నియమించుకొంటూ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ మితిమీరిన వసూళ్లకు అనుగుణంగా మామూళ్లు ఇవ్వని క్లినిక్‌లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలపై నామ మాత్రంగా తనిఖీలు చేస్తూ వాటిపై చర్యలు తీసుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్లినిక్‌లు, ఆస్పత్రులు, వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులచే అనుమతులు తీసుకోవాల్సి ఉండగా నిబంధనలు జిల్లాలో ఎక్కడా కనపడకుండా పోతున్నాయి. ఇటీవలి కాలంగా జిల్లాలో ధనార్జనే లక్ష్యంగా ఆరోగ్య శాఖ అధికారులను గుప్పిట్లో పెట్టుకొంటున్న వైద్యులు ఓ పక్క ఇష్టారాజ్యంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఖరీదైన చికిత్సల పేరిట దోచుకొంటుంటే నకిలీ వైద్యులు యథేచ్ఛగా ఎలాంటి రిజిస్ట్రేషన్‌తో పని లేకుండా ఎక్కడ పడితే అక్కడ క్లినిక్‌లను నెలకొల్పి వెలసిన పెద్ద మొత్తాల్లో వసూలు చేస్తున్నారు. మరో పక్క ఎలాంటి అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న వారి బాగోతాలు సైతం తరచు కనపడుతూనే ఉన్నాయి.

### అధికారిక లెక్కలకు మించి ఆస్పత్రులు, క్లినిక్‌లు

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిక లెక్కలకు జిల్లాలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాల సంఖ్యకు పొంతన లేకుండా పోతోంది. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకొంటూ ఓ పక్క ప్రజల బలహీనతలు, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని వ్యాపారంగా కొనసాగుతున్న వైద్య రంగంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అనధికారికంగా ఆస్పత్రులు, పాలి క్లినిక్‌లు నెలకొల్పుతూ నకిలీ వైద్యులు విజృంభిస్తున్నారు. అర్హత లేకున్నా, వైద్య శస్త్ర చికిత్సలు చేస్తూ లక్షల వసూలు చేసే నకిలీల రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ఈ నకిలీ వైద్యుల తతంగాన్ని అరికట్టాల్సిన జిల్లా వైద్యారోగ్య శాఖ మామూళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకొంటూ ఆ సమయంలో చేసే హెచ్చరికలు చేసి మామూళ్ల ప్రభావంతో ఆ తర్వాత కళ్లు మూసుకొంటున్నారు. దీనికి తోడు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ విభాగం సైతం ఇదే తరహాలో కొనసాగుతుండటం గమనార్హం.




### జుట్టు మొలిపిస్తాం, చర్మ వ్యాధులు చిటికలో మాయం చేస్తాం

బట్టతల, గుండుపై జుట్టు మొలిపిస్తాం, ఎలాంటి మొటిమలనైనా మాయం చేస్తాం, ఎక్కడా నయం కాని దీర్ఘ కాల చర్మ వ్యాధులను నయం చేస్తాం, ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటూ విస్తృత ప్రచారంతో ప్రొఫెషన్ పేరిట పెద్ద మొత్తాల్లో వసూలు చేసే క్లినిక్‌లు కుప్పలు తెప్పలుగా జిల్లాలో ఇటీవలి కాలంగా కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. ఇలాంటి క్లినిక్‌లలో ఎలాంటి వైద్యార్హతలు లేని వైద్యులు లేక పోని వారితో మాత్రమే నిర్వహిస్తుండటం గమనార్హం. గత వారం కెపిహెచ్‌బి కాలనీలోవామెన్ స్కిన్ అండ్ కాస్మెటిక్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్, హెయిర్ క్రియేషన్స్, డెర్మా కాస్మెటాలజీ, ఆమెస్టా కాస్మెటాలజీ పేరిట నడుస్తున్న సెంటర్లపై వైద్యారోగ్య శాఖాధికారులు దాడులు నిర్వహించి అక్కడ ఎలాంటి అర్హత ఉన్న వైద్యులు లేక పోవటం, క్లినిక్‌ల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు తీసుకోక పోవటాన్ని గుర్తించి వాటిని సీజ్ చేసారు.

# ఘనంగా విద్యా వారోత్సవాలు

కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియం నందు నిర్వహించే సమావేశనికి ప్రతి మండలం నుండి రెండు బస్సులు చొప్పున వికారాబాద్ జిల్లాకు 40బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలం నుండి రెండు బస్సులలో పదవ తరగతి ,ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నికల్ విద్యార్థులు ,తల్లిదండ్రులు వేళ్లే విధంగా మండల విద్యాధికారి కో ఆర్డినేట్ చేయాలని సూచించారు. ఏ బస్సులో ఎంతమంది వెళ్తున్నారు. నేడు సాయంత్రం 4.30వరకు స్టేడియంకు చేరుకునేలా సంబంధిత అధికారులు సూచించారు. తిరిగిప్రయాణంలో అందరికి డిన్నర్ ఏర్పాటు చేసి గమ్యస్థానలకు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి బస్సుకు లైసైన్స్ అధికారి ,పోలీస్ అధికారి ,అశ ,ఎన్ఎంలను నియమిస్తు ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకదేవి, డిఆర్డిఓ శ్రీనివాస్ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం




ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి
జిల్లా ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** సమగ్ర ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకయని దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కీలకమని ,దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ముఖ్య ప్రణాళి అధికారి వెంకటేశ్వర్లు ,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సత్తార్ పిలుపునిచ్చారు. అదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్ నుండి ఎన్నెపల్లి చౌరస్తావరకు అవగాహన వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత భారతదేశంలో జనగణన చేయడం జరుగుతుందని 2021లో జనగణన జరగలేదని ,స్వాతంత్రం వచ్చినప్పటి నుండి చేస్తున్న జనగణన ఇది 16వ సారి ,మన తెలంగాణ రాష్టం సిద్ధించిన తర్వాత ఇది మొటది జనగణన అని ,మొదిటి సారి డిజిటల్ విదానంలో ఈ జనగణన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మీ కుటుంబ వివరాలను స్వయంగా మీరే నమోదు చేసుకునే అవకాశం స్వీయ గణన ద్వారా కల్పించారని ,ఇందులో 34 ప్రశ్నలు ఉన్నాయని ,కేవలం ఐదు నిమిషాల్లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం https// se.census,gov,in సైట్‌లో మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్య ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్వీయ గణనలో పాల్గొని వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జనగణన పేరుతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ఇంటికి వచ్చి వివరాలు అడిగే అవకాశం ఉంటుందని అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. జనగణనలో పాల్గొనే సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డుల మీద క్యూర్‌కోడ్ ఉంటుందని ,దానిని స్కాన్ ,చేస్తే అధికారిక వెబ్‌సైట్‌లో పొంది ఉంచిన వారి పూర్తి వివరాలు వస్తాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. జనగణనలో అందరు భాగస్వాములు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ, రవిచంద్ర , తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా కాషాయమయం

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ప్రధానమంత్రి మోదీ పర్యటన సందర్భంగా లష్కర్ కాషామయం అయ్యింది. నగరంలోని వివిధ ప్రధాన కూడళ్లు, ప్రధాన మార్గాల్లో బిజెపి కటౌట్లు ఏర్పాటు చేసి ప్రధానమంత్రికి స్వాగతం పలికారు. ఇక క్యూర్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి కమలం నేతలు ర్యాలీలుగా జింఖానా మైదానానికి బయలుదేరి వెళ్లారు. ఇదిలాఉండగా బిజెపి సీనియర్ నాయకుడు మూట గణేష్ ఆధ్వర్యంలో 60 మంది కార్యకర్తలతో శ్రీదేవి నర్సింగ్ హోమ్ నుంచి బయలుదేరడం జరిగింది. తరలివెళ్లిన వారిలో టి.రాజశేఖర్‌రెడ్డి, నీలి శ్రీనివాస్, బంగారి అంజనేయులు, శ్రీనివాస్, సంధ్య తదితరులు ఉన్నారు. కాగా తార్నాక, లాలాపేట్ ప్రాంతాల నుంచి పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు బండ చంద్రారెడ్డి, ఆకుల శ్రీనివాస్, వీరన్న, శివారెడ్డి, కరుణాకర్, సంపత్, రాజేష్, కృష్ణ గౌడ్, అనూష తదితరులున్నారు. బౌద్ధనగర్ డివిజన్ నుంచి ప్రధాని మోదీ సభకు డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు 10 బస్సుల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, రవిప్రసాద్ గౌడ్, నేతి సత్యనారాయణ, చైతన్య, సుబ్బారావు, నాగరాజు, కవిత సంపత్ కుమార్, అగుల్ల శీను జయంత్ జ్ఞానేశ్వర్, నరేష్, మోయిన్, వెంకటేష్ ముదిరాజ్, విష్ణు, భాస్కర్ గౌడ్, నవీన్, బిక్షపతి సుమారు వెయ్యి మంది కార్యకర్తగా వెళ్లడం జరిగింది. ఇదిలాఉండగా.. వీవీఐపీ, వీఐపీల కదలికల దృష్ట్యా హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, తాత్కాలిక నిలిపివేతలు అమలు చేశారు. ఇందులో భాగంగానే ఎయిర్‌పోర్టు నుంచి బేగంపేట్, గ్రీనల్యాండ్స్, పంజాగుట్ట, నాగార్జున సర్కిల్, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, సాగర్ సొసైటీ, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, పెద్దమ్మతల్లి కమాన్... తదితర ప్రాంతాల్లో ఆంక్షలు అమలు చేయడం జరిగింది.




# అటవీ ప్రాంతంలో అందమైన కాటేజీలు

ఊటీనీ తలపించేలా ఏర్పాట్లు, అడ్వెంచర్ టూరిజం
స్పాట్‌గా అనంతగిరి ఏర్పాటు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న అనంతగిరి అభివృద్ధి చేసేందుకు అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. కర్ణాటకలో జంగల్ లాడ్జీస్ పేరిట పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. అదే తరహాలో అనంతగిరిని అభివృద్ధి చేస్తున్నారు. అదే తరహాలో తెలంగాణ ఎకో టూరిజం బ్రాండ్ దక్కన్ ఉడ్స్ అండ్ ట్రయల్స్ అని నామకరణం చేసింది. ఇందులో భాగంగా రాష్టంలోని పలు చోట్ల పర్యాటక అభివృద్ధి పనులకు ఒక్కో పేరు పెట్టాలని నిర్ణయించింది. అనంతగిరి అటవీ ప్రాంతంలో డెవలప్ చేసిన కాటేజీలు, దర్శనీయ స్థలాలకు దీబ్రీజ్ అని పేరు పెట్టారు. ఇక్కడ పర్యాటకుల కోసం ట్రెక్కింగ్, బర్డ్‌వాక్ ,నైట్ క్యాంప్స్, జంగల్ కాటేజెస్ ,సఫారీ, అడవిలో బుసప్ బ్రేక్ ఫాస్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ఆ సంస్థ అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. నైపుణ్యం ఉన్న గైడ్‌లు పర్యాటక అందాలను దగ్గరుండి చూపిస్తారు. ఒక్కరు ఇద్దరు ముగ్గురు, ఇలా వ్యక్తుల సమూహాన్ని బట్టి రూ.5వేల నుంచి 10,000వరకు చార్జి చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి ఉదయం 11గంటల చెక్ అవుట్ వరకు భోజనం, టిఫిన్, స్టాఫ్ట్‌డ్రింక్స్, కాఫీ, రాత్రి బసచేసి జంగల్ కాలేజి తదితర విషయాలన్నీ వారే చూసుకుంటారు. ట్రెక్కింగ్, బర్డ్‌గ్రాస్, వాక్ ట్రాక్‌లు, వ్యూపియిట్స్, సఫారీ తదితర కార్యక్రమాలు గైడ్‌లు దగ్గరుండి వారికి వివరిస్తారు. దీ బ్రీడ్ పేరుతో పర్యాటకులను మరింత అకర్శించేందుకు కసరత్తు చేస్తున్నారు. అనంతగిరి కొండలను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను పరిచయం చేయబోతుంది. స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.1000కోట్ల మంజురు కాగా మెఘా సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది. అనంతగిరి అడవులు 3600 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. కొండ మధ్యలో రెవెన్యూ శాఖకు చెందిన 213 ఎకరాల భూమి ఉంది. అందులో రూ.110 కోట్ల వెచ్చించి అభివృద్ధి పనులు చేపటాలని నిర్ణయించారు. ఇప్పటికే రూ.38కోట్లతో డిపిఆర్ సిద్ధం చేశారు. గడిచిన ఎనిమిది నెలల నుండి అనేక ఏర్పాట్లు నిర్మాణాలు చేపట్టి ఊటిని తలపించే స్థాయిలో అభివృద్ధి చేశారు. ఇప్పటివరకు రూ.2.5 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇరువై రోజుల క్రితం స్పీకర్ ప్రసాద్‌కుమార్ దీ బ్రీజ్ ఎకో కాటేజీస్‌ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఏడాదికి రూ.37 లక్షలతో మొదలైన ఆదాయం ప్రస్తుతం రూ.80లక్షలకు చేరింది. సాధారణంగా పర్యాటక కేంద్రాలను రెండు రకాలుగా అభివృద్ధి చేస్తారు. రాష్ట రాజధాని హైదరాబాద్‌కు 60కిలోమీటర్ల సమీపంలో ఉన్నందున ఈ ప్రదేశం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది.




**పర్యాటకుల సంఖ్యపెరిగేలా సదుపాయాలు కల్పిస్తాం : డిఎఫ్ఓ**

అటవీశాఖ ఆధ్వర్యంలో దిబ్రీజ్ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రైవేట్ సంస్థల కంటే తక్కువ ధరలకు పర్యాటకులకు మంచి నాణ్యమైన భోజన సదుపాయం కల్పిస్తున్నాం. అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యాటకులు 23 గంటల పాటు సేద తీరేలా కొత్త అనుభూతిని కల్పిస్తున్నాం. అన్ని సౌకర్యాలు కల్పించి పర్యాటకుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటామని, అనంతగిరి పరిశుభ్రంగా ఉండేందుకు పర్యాటకులు సహకరించాలని డిఎఫ్ఓ వికారాబాద్ జిల్లా అధికారి తెలిపారు.



## గడిమైసమ్మ ఆలయాన్ని పునఃనిర్మించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లోని అతి పురాతణమైన గడిమైసమ్మ ఆలయ పునఃనిర్మాణం చేపట్టడానికి గ్రామస్థులు ఆదివారం సమావేశమయ్యారు. గడిమైసమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ పునర్ధరణకు గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. పటేల్, పట్వారీ వ్యవస్థకాలంలో పోలీస్ కుటుంబం ఆనవాయితీగా ఈ గ్రామంలో మొదటి పూజలు నిర్వహించేవారు. అదే సాంప్రదాయం నేటికి కొనసాగుతోంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు గడి మైసమ్మ ఆలయం పూర్తిగా దెబ్బతింది. గ్రామస్థులు, పెద్దలు అందరు కలిసి పురాతణమైన గుడిని దాతల సహాకారంతో నిర్మించాలని తీర్మాణం చేశారు. రాబోయే బోనాల పండగ నాటికి గుడి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ సింగం అంజనేయులు, మాజి ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, మాజి ఉపసర్పంచ్ వైద్యనాద్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కటికెల గోపి, మాజి వార్డు సభ్యుడు బాలేష్, గ్రామపెద్దలు సింగం కృష్ణ పటేల్, యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, పింగం బాగయ్య పటేల్, బండి జగన్నాదం, శ్రీనివాస్, కీసరి నర్సింలు, ఎల్లగౌని చిత్తయ్య, సింగం నర్సింగరావు పటేల్, అశోక్‌చారి, సాయి శ్రీనివాస్‌చారి, శావుకారి, కొమ్ము స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సూరారంలో ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ రాజీవ్ గృహకల్పలో బి కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ కోఆర్డినేటర్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. వైద్యంతో పాటు పేద మధ్యతరగతి పిల్లలకు విద్యకు ఎలాంటి ఇబ్బందులున్న బికేఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కాలనీ ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలియజేశారు. మాకు సహకరిస్తున్న సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందానికి బిగ్ న్యూస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యాదవ్ నరసింహారెడ్డి, గజేంద్ర ప్రజా గాయకుడు శంకర్, శ్రీశైలం యాదవ్, అరుణ్ రెడ్డి, జగన్ ముదిరాజ్, రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## తలసేమియా దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** ప్రపంచ తలసేమియా దినోత్సవం2026 సందర్భంగా ఆదివారం నగరంలో తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ(టీఎస్ సీఎస్) అవగాహన కార్యక్రమాన్ని, స్వచ్ఛంద రక్తదాన శిబిర నిర్వాహకుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీఎస్ సీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఈఓ, సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రత్నవల్లి కొత్తపల్లి, జాయింట్ సెక్రటరీ మిస్టర్ అలీమ్ బేగ్ లతోకలసి ఆయన మాట్లాడుతూ, ఈ వేడుకల్లో భాగంగా 'హిడెన్ నో మోర్‌అన్మాస్కింగ్ థలసేమియా, ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్' పేరుతో భారీ మోటార్ సైకిల్ అవగాహన యాత్రతో 75 మందికి పైగా బైకర్లు పాల్గొన్నట్లు చెప్పారు. వాండరర్స్ బ్రదర్‌హుడ్ రైడింగ్ కమ్యూనిటీ మద్దతుతో జరిగిన ఈ అవగాహన ర్యాలీ థలసేమియా నివారణ, స్వచ్ఛంద రక్తదానం, క్యారియర్ స్క్రీనింగ్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా సాగిందన్నారు. ఈ బైక్ ర్యాలీ హైదరాబాద్లోని ప్రముఖ ప్రాంతాల గుండా ప్రయాణించి తిరిగి టీఎస్ సీఎస్ భవనం వద్ద ముగిసినట్లు చెప్పారు.



## గుత్తాను కలిసి కృతజ్ఞతలు తెలిపిన టిజిపి ట్రిబ్యునల్ చైర్మన్ సూధిని



ప్రజాపక్షం/కడ్తాల్ : శాసనమండలి చైర్మన్ గుత్తా సురేందర్ రెడ్డి ని తెలంగాణ గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మాడ్గుల మాజీ ఎంపిపి,టిపిసిసి కార్యదర్శి సూధిని రాంరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని శాసనమండలి చైర్మన్ నివాసంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తాండ్ర సాయిరెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపినట్లు తాండ్ర సాయి రెడ్డి వివరించారు.

## కులగణనలో బిసిల జనాభాను పారదర్శకంగా తేల్చాలి



ప్రజాపక్షం/కేశంపేట: కుల గణనలో బీసిల జనాభా ఎంతో ఉందో పారదర్శకంగా తేల్చాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కేశంపేట మండలం నుండి కాంగ్రెస్ బీసి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ కుల గణనలో బీసిల జనాభా ఎంతో ఉందో పారదర్శకంగా తేల్చడంతోపాటు నిష్పత్తి మేరకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసి వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని అంతం చేసి రాజ్యాంగ బద్ధమైన హక్కులను అమలు చేయాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుమగల్ల రమేష్, తైద పర్వతాలు, బోదునంపల్లి సర్పంచ్ నగేష్, మాజీ సర్పంచ్ పోమాల్‌పల్లి కృష్ణయ్య, రఘుపతి, నాని, నర్సింహ, కోడూరు రాములు, అంజయ్య, యాదగిరి చారి, వట్టెల లింగం, దర్శన్, భీమయ్య, సురేష్, శ్రీకాంత్, సచిన్, చరణ్‌లు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/మియాపూర్:హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళ మాతృ మూర్తులకు ఫౌండేషన్ చైర్మేన్ కొండ విజయ్ కుమార్ సన్మానించారు.కార్యక్రమంలో భాగంగా మహిళ మూర్తులకు శాలువాతో సన్మానించి స్వీట్ ప్యాకెట్లను అందచేశారు.మాతృ దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులను సన్మానించుకోవడం ఏంతో అనందంగా ఉందని కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కేశంపేట: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీను, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఎన్ఆర్ఐ సామాజిక సేవకుడు గోగు వెంకట్ నారాయణలు పుష్ప గుచ్చం ఇచ్చి వశుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచన శ్రీను మాట్లాడుతూ ప్రజా సేవ దృక్పథం, ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం, అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. అంజయ్య యాదవ్ ఆయురారోగ్యాలతో మరెన్నో ఏళ్లు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అదే విధంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, భరత సింహారెడ్డి, జగత్‌రెడ్డి, సురేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

### షాద్‌నగర్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో



మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా కారు రూపంలో తయారు చేసిన కేక్‌ను కట్ చేయడంతోపాటు మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటితోపాటు ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల అధ్యక్షులు, కార్యర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతోపాటు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తల అభిమానానికి తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానని, వారికి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా 516 పుస్తకాలను గ్రంథాలయానికి అంధించారు. అభిమాన నాయకుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని రక్తదానం చేసిన 105మందికి ప్రశంస పత్రాలను అంధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ నరేందర్, మాజీ వైస్ చైర్మెన్ నటరాజన్, యువనేత మురళీ యాదవ్, రాజావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు

**• మౌలిక వసతులు, విద్యావిధానంలో సంస్కరణలు • ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు • నేటి నుంచి విద్యావారోత్సవాలు • శ్రీకారం చుడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి**





ప్రజాపక్షం / సిటీ బ్యూరో : రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు' కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ సోమవారం నుంచి మే 17తేది వరకు విద్యావారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ వేదికనే విద్యారంగ ప్రక్షాళనకు తొలి మెట్టు కానుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్‌బిస్టేడియంలో వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భ ంగా క్యూర్ (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు, కొంత సంగారెడ్డి జిల్లాలోని ప్రాంతాలు)ప్రాంతంలోని పాఠశాలల్లో చేపట్టనున్న మౌళిక సదుపాయాలు, అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ప్రారంభించనున్న వాటికి శంకుస్తానలు, ఇప్పటికే పూర్తయిన వాటిని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధి, విద్యావ్యవస్థలో చేపట్టనున్న సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, విద్యాభివృద్ధికి చేపడుతున్న చర్యలు తదితర అంశాలను ముఖ్యమంత్రి వివరించనున్నారు. ఇప్పటికే ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో కలిపి ఒకే బోర్డు పరిధిలోకి తేనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో అధ్యాపకులు, సిబ్బంది కలిసి రావడంతో పాటు పాఠశాలల్లో భోదనా సిబ్బంది కొరత తీరనుంది. ఇదొక్కటే కాదు జూనియర్ కళాశాలల భవనాలు కూడా పాఠశాల విద్యకు కలిసి వస్తాయి. ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు వారు రోజు చూస్తున్న, బోధిస్తున్న అధ్యాపకులు ఉండడంతో వారి విద్యాబోధనకు అలవాటు పడుతారు. ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో చేరిస్తే ఇప్పుడున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలల దోపిడి, ఐఐటి, నీట్ ప్రత్యేకం అంటూ చేస్తున్న వ్యవహారాలకు కూడా కొంత మేర అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ రంగంలోని విద్యాలయాల్లో మౌళిక వసతులు కల్పించనున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రైవేటు విద్యాసంస్థలను తీర్చిదిద్దడంతో పాటు బోధన అందుకు అనుగుణంగా మారనుంది.

ప్రతిభావంతులైన జూనియర్ లె క్చరర్లను కూడా పాఠశాల విద్యకు ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుండడంతో బోధనలో నాణ్యత పెరగనుంది. వీటితో పాటు విద్యారంగంలోని అన్ని విభాగాల్లోను పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈకార్యక్రమానికి సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటుండగా ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులతో పాటు విద్యాశాఖ ఉన్నతాదికారులు పా ల్గొంటున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభతో తయారు చేసిన వాటితో కూడిన స్టాల్లు ఏర్పాటుచేస్తున్నారు. ఐఐటి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిన కేజీబీవి యంగ్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయనున్నారు.

## నేటి నుంచి ఐబిసిఎ వర్క్‌షాప్

### అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు విదేశీ ప్రతినిధుల పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్: పెద్ద పిల్లి జాతుల సంరక్షణ (ఐబిసిఎ)పై తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా భారత విదేశాంగ శాఖతో కలిసి ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబిసిఎ)పై వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. పులులు, చిరుత పులుల సంరక్షణ చర్యలపై ప్రధానంగా ఈ కార్యక్రమం కొనసాగనుంది. పులి, సిం హం, జాగ్వార్, చిరుత, స్నో లియోపార్డ్ చీతా, ప్యూమా వంటి పెద్ద పిల్లి జాతుల సంరక్షణలో అంతర్జాతీయ సహకా రం, వన్యప్రాణి ఆవాసాల పరిరక్షణ, జీవ వైవి ధ్య రక్షణ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని, ప్రకృతి సంరక్షణ ఆధారిత అభివృద్ధి, జీవ వైవిధ్య పరిరక్షణ పట్ల తెలంగాణ ప్రభుత్వ కట్టుబాటును ఈ కార్యక్రమం ప్రతిబింబించనుందని అటవీ దళాల అధిపతి డాక్టర్ సి. సువర్ణ తెలిపారు. మొదటి రోజు హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్, మంత్రి కొండా సురేఖ హాజరు కానున్నారు. మొదటగా ఫోటో ప్రదర్శన నిర్వహించి, తెలంగాణ అటవీ శాఖ చేపడుతున్న వన్యప్రాణి సంరక్షణ చర్యలు, వేట నిషేధిత కార్యక్రమా లు, అడవుల పునరుద్ధరణ, వాటి సంరక్షణ వంటి అవగాహన కార్యక్రమాలను ఫోటోల రూపంలో ప్రదర్శించనున్నారు. రెండో రోజు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు ఫీల్డ్ విజిట్ నిర్వహించనున్నారు. దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్‌లలో ఒకటైన అమ్రాబాద్‌లో అమలు చేస్తున్న పులుల సంరక్షణ చర్యలు, ఆవాసాల నిర్వహణ విధానాలను విదేశీ ప్రతినిధులు పరిశీలించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు ఫ్రాన్స్, మలేషియా, రష్యా, శ్రీలంక, థాయ్‌లాండ బంగ్లాదేశ్, టర్కీ దేశాల ప్రతినిధులతో పాటు హైదరాబాద్‌లోని కాన్సుల్ జనరల్స్, దౌత్యవేత్తలను ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబిసిఎ) కార్యక్రమంపై అవగాహన పెంపుతో పాటు వన్యప్రాణి సంరక్షణలో ఉత్తమ విధానాల పరస్పర మార్పిడికి ఈ కార్యక్రమం వేదిక కానుందని పేర్కొన్నారు.

## వంజరులను డిఎన్‌టిలుగా గుర్తించాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంచార కులాలను డిమాటిక్ నోటిఫైడ్ ట్రైబ్స్ (డిఎన్‌టి)లుగా గుర్తించడం హర్షనీయమని అయితే నిజమైన సంచార జాతి వంజరి కులాన్ని డిఎన్‌టిగా గుర్తించుకోకపోవడం బాధాకరమని తెలంగాణ వంజరి సంఘం అభిప్రాయపడింది. సికింద్రాబాద్‌లో జరిగిన వంజరి సంఘం ప్రతినిధుల సమావేశంలో పలువరు ప్రతినిధులు మాట్లాడుతూ అడవుల నుంచి ఉత్పత్తులను మైదాన ప్రాంతంలో అమ్మే వనచరులు అనగా అడవుల్లో సంచరించేవారు తద్వారా వంజరులుగా పిలవబడుతున్న తమ కులస్తులు నిజమైన సంచార జాతి అని ప్రభుత్వానికి ఈ విషయాన్ని ఎన్నిసార్లు వివరించిన అధికారులు ఆదేశంగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో సంచార గిరిజనులుగా గుర్తింపబడ్డారు తమ జాతి గిరిజన హోదా అనుభవిస్తుంటే ఇక్కడ 1978లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం ఒక జిఒ ద్వారా ఎస్‌టిలుగా ఉన్న తమకులాన్ని బిసి( డి) లోకి మార్చారని ఇది అన్యాయం అని ఎన్నిసార్లు గొంతు చించుకొని అరిచిన ప్రయోజనం లేదని, తమ గురించి మాట్లాడే పార్టీలు గాని ప్రతినిధులు లేకపోవడం బాధాకరమని వారు అన్నారు. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షలు గా ఉన్న తమ జనాభాను మొన్న కులగణన లో తక్కువ చేసి చూపించారని వారు వాపోయారు. తమ ఎస్‌టి తమకు తిరిగి పునరుద్ధరించాలని లేనిచో డిఎన్‌టిలుగా గుర్తించి వెనుక పడ్డ కులస్తులను సామాజికంగా ఆర్థికంగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలేరు విశ్వనాథం సాల్వేరు కృష్ణ ఎదగని హరినాథ్, దాత్రిక కాశీనాథ్, ముజకరి రవీందర్ అముద లక్ష్మణ్ కాలేరు సురేష్ ముజకరి దినేష్ కాలేరు సాయిబాబా మల్లక్ ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన చేపట్టాల్సిన బాధ్యత కేంద్రానిదే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: జనగణనలో కులగణన చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం హైద్రాబాద్ లోని గన్‌పార్క్ వద్ద నిర్వహించే ఓబిసి కుటగణనకు షాద్‌నగర్ నుండి కాంగ్రెస్ బిసి నాయకులు పెద్ద ఎత్తున తరలివేళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడుతూ దేశంలో బిసి ప్రధాన మంత్రి ఉండి బిసిలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిసిల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రానికి అనేక మంది ప్రధాన మంత్రులు వచ్చారని, ఒక బీసి ప్రధాన మంత్రిగా పేరు తెచ్చుకున్న మీరు ఏం చెస్తారో చెప్పాల్సిన బాధ్యత మీపై ఉందని పేర్కొన్నారు. దేశ ప్రధాన మంత్రి తెలంగాణ వస్తుంటే తాము స్వాగతిస్తామని, బిసిలకు 60శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసిలు ఎన్నో ఏళ్ల నుండి రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేస్తున్నారని, ఈ దిశగా ప్రధాన మంత్రి స్పంధించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బిసి ప్రధాన మంత్రి అంటూ చెప్పుకోవడమే తప్పా ఆచరణలో బిసిల కష్టాలను ఏనాడు పట్టించుకోలేదని మండిపడ్డారు. మహాత్మజ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు పోరాటాలు చేసి హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. చట్ట సభల్లో బీసిలకు వాటా కల్పించాలని బిసి సంఘాలు 60ఏళ్ళుగా పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చెప్పడం జరుగుతుందని, ఇదే విధంగా దేశ వ్యాప్తంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదే విధంగా నాన్చుడు దోరణి అవలంభిస్తే ఉద్యమాలను ఉధృతం చేసేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర అప్ప, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, దిలీప్, సర్పంచులు కొమ్ము కృష్ణ, బాబునాయక్, కాంగ్రెస్ నేతలు బాల్‌రాజ్ గౌడ్, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, చించోడు అనంతం, చందులాల్, నల్లమోని శ్రీధర్, జాంగారి రవి, తుపాలకు శేఖర్, రాజు, సుదర్శన్ గౌడ్, ముబారక్ అలీఖాన్, మాధవులు యాదవ్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధిష్టానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మాజీ అధ్యక్షుడు

### సబ్బండ వర్గాలకు సముచిత న్యాయం అంటే ఇదేనా..

### డివిజన్‌లో జోరందుకున్న కాంగ్రెస్ నేతల చర్చలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ స్థాయి నుండి వెనుకబడిన కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చిన నేతలకు సముచిత స్థానం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో వెన్నంటే ఉంటూ పార్టీ విజయానికి దోహదపడిన నేతలకు తగిన గౌరవం ఇవ్వకపోవడంపై మాజీ అధ్యక్షులు తమదైన శైలీలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సబ్బండ వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని గొప్పగా ప్రకటనలు చేస్తున్నారే తప్పా ఆచరణలో ఎక్కడ పాటించడం లేదని వాపోతున్నారు. ఎమ్మెల్యే ఎన్నికలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో తాము ఎంతో కీలక పాత్ర పోషించామని మాజీ అధ్యక్షులు పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేని వ్యక్తులకు మండల పార్టీ అధ్యక్ష పదవులు, పట్టణ అధ్యక్ష పదువులు ఇవ్వడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని కొత్త వ్యక్తులు పదవులు ఇస్తే పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమ పరిస్థితి ఏమిటని పేర్కొన్నారు. ఎవరికి వారే గ్రూపు రాజకీయాలు చేసుకుంటుండటంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ళు ప్రతిపక్ష హోదాలో ఉండి అధికార బిఆర్ఎస్ పెట్టిన కేసులను తట్టుకొని భయపడకుండా నిలబడ్డామని, కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు వేళ్ళామని పేర్కొన్నారు. కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టి షోలు చేసే వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలకు కొత్త అధ్యక్షలను నియమించింది. మాజీ అధ్యక్షులను మధ్య పెట్టి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని ప్రకటించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుల ఏర్పాటుపై తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ నేతల్లో చర్చలు జోరందుకున్నాయి. కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు వస్తుందని ఆశిస్తే నిరాషే మిగులుతుందే తప్పా చేసిందేమి లేదని అంటున్నారు. ఏ కారణం చేత పదవుల్లో నుండి తీయాల్సి వచ్చిందో చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మసిపూసి మారెడు కాయ అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడం సరికాదని అంటున్నారు. అన్నింటికి కాలమే నిర్ణయిస్తుందంటూ నేతలు చెప్పుకోస్తున్నారు.

## హైదరాబాద్‌లో లిక్కర్ మిక్సింగ్ ముఠా గుట్టురట్టు

### ప్రీమియం బ్రాండ్లలో చౌక మద్యం కలిపి అమ్మకాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లో ప్రీమియం లిక్కర్ పేరుతో భారీ మోసానికి పాల్పడుతున్న ఓ ముఠాను సికింద్రాబాద్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. చౌక మద్యంను ఖరీదైన బ్రాండెడ్ లిక్కర్ బాటిళ్లలో నింపి ఫంక్షన్లు, పార్టీల్లో సరఫరా చేస్తూ అక్రమంగా డబ్బులు ఆర్జిస్తున్న ఈ ముఠాపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ డిటిఎఫ్ సిఐ సావిత్రి సౌజన్యకు అందిన పక్కా సమాచారంతో రసూల్‌పుర మెట్రో స్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తుల వద్ద ఆరు శివాస్ రీగల్ ప్రీమియం లిక్కర్ బాటిళ్లు లభించాయి. బాటిళ్లను పరిశీలించగా, వాటిలో అసలు ప్రీమియం మద్యం కాకుండా తక్కువ ధర కలిగిన మద్యం మిక్సింగ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. నిందితులను విచారించగా అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో వారి సూచనల మేరకు మిక్సింగ్ లిక్కర్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు. అక్కడ 41 ఫుల్ బాటిళ్లలో మిక్సింగ్ చేసిన శివా స్ రీగల్ మద్యం లభించింది. అలాగే ఖరీదైన ప్రీమియం లిక్కర్ బ్రాండ్లకు చెందిన 63 ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూ.25 వేల విలువ చేసే రాయల్ సల్యూట్ వంటి అత్యంత ఖరీదైన బ్రాండ్ల బాటిళ్లలో కూడా చౌక మద్యం నింపి విక్రయాలు చేస్తున్నట్లు ఎక్సైజ్ విచారణ లో బయటపడింది. ప్రీమియం లిక్కర్‌ను తక్కువ ధరకే అందిస్తున్నాం అంటూ వినియోగదారుల ను నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ముఠా లో ఒడిశాకు చెందిన చికున్ స్వాయిన్, సోను మహంతి, ప్రఫుల్ కుమార్ నాయక్ ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చికున్ స్వాయిన్, సోను మహంతిని అరెస్ట్ చేయగా, ప్రఫుల్ కుమార్ నాయక్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, ఏఈఎస్ శ్రీనివాసరావు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మిక్సింగ్ లిక్కర్, ఖాళీ బాటిళ్లు ఇతర సామగ్రిని మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సావిత్రి సౌజన్యతో పాటు ఎస్ఐ శివరామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు జనార్ధన్, రిశ్వాన్, సిద్ధిఖీ, అనుష పాల్గొన్నారు.

## వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్.. 137 మందిపై కేసులు



ప్రజాపక్షం/రంగారెడ్డి: తమ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రం క్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ఒకటవ ట్రాఫిక్ ఎడిసిపి జి.హన్మంతరావు తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా137 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.113 ద్విచక్ర వాహనదారులు,05 ఆటోలు,18 కార్లు, 01 హెవి వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి)ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 105 మంది 36 ఎం జి/100 ఎంఎల్ నుంచి 200 ఎం జి/100 ఎంఎల్ మధ్య,18 మంది 201 ఎం జి/100 ఎంఎల్ నుంచి 300 ఎం జి/100 ఎంఎల్ మధ్య,14 మంది 301 ఎం జి/100 ఎంఎల్ నుంచి 550 ఎం జి/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు,జరిమానా విధించే అవకాశం వుంది.గత వారంలో మొత్తం198 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో04 మందికి జరిమానా,జైలు శిక్ష,04 మందికి జరిమానా,సోషల్ సర్వీస్, 190 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** గద్వాల రైల్వే ట్రాక్ పై ఆదివారం గుర్తు తెలియని 75–80 సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు గద్వాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఆశోక్ తెలిపారు. గుర్తు తెలియని రైలులో ప్రయాణం చేస్తూ, ప్రమాదవశాత్తు జోగులాంబ రైల్వే స్టేషన్లో రైలు నుండి జారి పడి పోయి నడుము వరకు తెగిపోయి చనిపోయినట్లు చెప్పారు. ఈ నెల 8న షాద్ నగర్ నుండి తిరుపతి వరకు, 9న గద్వాల నుండి కర్నూలుకు తీసుకున్న ట్రైన్ టికెట్లు ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలో అతని చేతి కర్ర, చెప్పులు, ముదురు గ్రే కలర్ కోటు, లేత నీలి రంగులో పైజమా, వైట్ కలర్ లుంగి, లేత నీలి రంగు, నలుపు రంగుల షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. శవాన్ని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో ఉంచినట్లు చెప్పారు. గుర్తుపట్టినవారు 8341252529 కు సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ ఆశోక్ సూచించారు.

## డిగ్రీ కళాశాలలో 'ఎడ్యుకేషన్ వీక్' వేడుకలు

**ప్రజాపక్షం/ మక్తల్ :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కళాశాల విద్య ఆధ్వర్యంలో నేటి నుండి 17వ తేదీ వరకు ఎడ్యుకేషన్ వీక్ వేడుకలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మక్తల్ లో నిర్వహిస్తున్నట్లు కళాశాల మక్తల్ లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇ. నారాయణ గౌడ్ ప్రకటనలో తెలిపారు. ఏడురోజుల నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, వివిధ పరిశ్రమలలో యంఒయులు, పీజీ చదివే విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ యోగా, మెడిటేషన్ క్లాసులు ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు, అధ్యాపకులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## అమ్మాయిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం



**ప్రజాపక్షం/చిన్నంబావి :** స్థానిక మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు దేశాల మేరకు గ్రామపంచాయితీ భవన నిర్మించాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ మాధగౌని కవిత ప్రభంజన్ గౌడ్, ఉప సర్పంచ్ ఆరేపల్లి మాధవి మాధవ రెడ్డి, వార్డు సభ్యులు అల్లేన్న గౌడ్, మహేశ్వరమ్మ సత్యారెడ్డి, ధర్గయ్య స్వేరో, పావని కవేందర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి యువనాయకులు అనంత నరేష్ గౌడ్, వెంకటేష్ నాయుడు, సుకుమార్, బిట్టు, తారాచంద్ గౌడ్, మహేష్ గౌడ్, సహకరించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## పిఎసిఎస్ నూతన చైర్మన్‌గా మద్దిలేటి



**ప్రజాపక్షం/అలంపూర్:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ అలంపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న పిఎసిఎస్ చైర్మన్ గా ఇమాంపురం మద్దిలేటి ఎన్నికైన సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడుని మద్దిలేటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిండి జయరాముడు, మాజీ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి ఉట్కూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస రాడ్డి పిఎసిఎస్ ఇన్‌చార్జ్ సీఈవో శ్రీనివాసులు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

బొబ్బిలి నిక్సన్ డిమాండ్



**ప్రజాపక్షం/ కొత్తకోట :** కొత్తకోట రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతాంగం మొత్తం ఆందోళన గురవుతున్నారని వెంటనే ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు సిపిఎం పార్టీ మండల పరిధిలోని అమడబాకుల కొత్తకోట కేంద్రాల్లో వరి ధాన్యం రోడ్ల పై ఆరబెట్టిన రైతుల దగ్గరకు వెళ్లి పరిశీలన చేయడం జరిగింది. రైతులు నెల తరబడి వరి ధాన్యం రోడ్ల పై ఆరబెట్టిన ప్రభుత్వానికి అధికారులకు రైతుల పై కనికరం లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. దాదాపుగా ప్రతి రైతు 25 రోజుల పాటుగా ధాన్యం ను రోడ్ల పై ఆరబెట్టడం జరుగుతందని ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం నిర్లక్ష్యంమే కారణమని ఆయన ఆరోపించారు. రైతులు తాము పండించిన పంటకు అధికారులు ప్రభుత్వం పట్టించకపోవడం ద్వారా ఎండలు తీవ్రంగా ఉండడం రైతులు తమ పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని ఆశతో ఎదురుచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం వస్తే మా పరిస్థితి ఏమిటీ? అంటూ బిక్కుబిక్కుమంటూ రైతులు ఆందోళనకు చెందుతున్నారని ఆయన చెప్పారు. గన్ని బ్యాగులు కొరత ఉందని తేమ పేరుతో తాలు పేరుతో రకరకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందుల గురిచేస్తుందని ఆయన ఆరోపించారు. పండించిన వంట కొనుగోలు దగ్గర రెండు కిలోల నుండి నాలుగు కిలోల వరకు వడ్లను తీయడం ప్రభుత్వం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కావలి వెంకటయ్య, గొల్ల రాములు, చెన్నయ్య, శివారెడ్డి, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**ప్రజాపక్షం/ మక్తల్ :** జిల్లా వి 108 ఎ గవర్నర్ కల్మిచర్ల రమేష్ పుట్టిన రోజు సందర్భంగా మక్తల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ.. గవర్నర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపుతూ.. మాకు వెన్నంటే ఉండి క్లబ్ సేవా కార్యక్రమాలను తమ సలహాలు, సూచనలతో ప్రోత్సహిస్తున్న గవర్నర్ కల్మచర్ల రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం వాసవీ క్లబ్ ఆఫీసర్ల పుట్టినరోజు నాడు ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. అలాగే మాతృ దినోత్సవ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ తన తల్లి కి చీరను బహుకరిస్తూ, ఆశీర్వచనాలు తీసుకొని మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పవన్, మాజీ డీప్యూటీ గవర్నర్ దొంత నరహరి, ఫాస్ట్ ప్రెసిడెంట్ బిలకంటి నరసయ్య, వనిత క్లబ్ ప్రెసిడెంట్ ప్రసన్న, రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి విజయకుమార్, డాక్టర్ ప్రహ్లాద్, అక్షయ్ మెడికల్ అగ్లర్ అశోక్ కుమార్, వట్టం కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

# ప్రతీ ధాన్యపు గింజ కొంటాం

కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/వనపర్తి:** రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు రైతులు తాలు లేకుండా నాణ్యమైన వడ్లు తీసుకురావాలి. తద్వారా రైతులతో పాటు ప్రభుత్వానికి ఇబ్బందులు ఉండవు. వడ్ల కొనుగోలు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి, వ్యవసాయ, కోపరేటివ్, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐకెపి సహకార సంఘాల వడ్లు కొనుగోలు కేంద్రాల సభ్యులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి వరి కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు.రైస్ మిల్లులో ధాన్యం త్వరగా దించుకోకుండా రోజుల తరబడి లారీలు ఆగిపోవడం, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంపై వివరాలు అడిగారు. లారీల్లో తెచ్చిన వడ్లు నాణ్యత లేవని, తాలు, చెత్త ఎక్కువగా ఉండటం వల్ల ఎఫ్‌సిఐకి నాణ్యమైన బియ్యం తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని, అందుకే రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు ఇవ్వాల్సిందిగా కోరుచున్నట్లు మిల్లర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ రైతులు సైతం సహకరించి తూర్పారబట్టిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని నాణ్యమైన వడ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేసి డబ్బులు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాడ్ ఎంట్రీ చేయడంలో జప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు వచ్చిన లారీలను త్వరగా ఖాళీ చేసి పంపించాలని, రోజుల తరబడి మిల్లుల వద్ద ధాన్యం లారీలు పెట్టుకోవద్దని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, అకాల వర్షాలు ఎప్పుడైనా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి రబీ కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, డి.సి.ఓ రాణి, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐ.కే.పి సహకార సంఘం కొనుగోలు కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఫైర్ ఇంజిన్



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్:** గద్వాలకు చెందిన ఫైర్ ఇంజిన్ రివర్స్ తీస్తుండగా ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటన గద్వాల మండలం పరమాల స్టేజ్ దగ్గర చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఓ పత్తి మిల్లు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అంటుకోవడంతో ఆ మంటలు మిల్లుకు వ్యాపిస్తాయని కంగారుపడిన మిల్లు యజమాని ఫైర్ ఇంజిన్ కు సమాచారం ఇచ్చారు. గద్వాల నుంచి హుటాహుటిన పాత ఫైర్ ఇంజిన్ పరమాల స్టేజ్ వరకు చేరుకుంది. ఈ క్రమంలో గద్వాల నుండి అయిజకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దిం పేందుకు పరమాల స్టేజ్ దగ్గర నిలిపారు. ఉదయం భూపురం గ్రామంలో గడ్డివాములు దగ్ధమవుతుండగా మంటలను ఆర్పేందుకు గద్వాలకు చెందిన మరో ఫైర్ ఇంజిన్ వెళ్లింది. అక్కడ మంటలను అదుపు చేసి పట్టణ సమీపంలోని మంటలు ఆర్పేందుకు పత్తి మిల్లుకు చేరుకుంది. అప్పటికే భూంపురం నుంచి ఫై ర్ ఇంజిన్ పత్తి మిల్లుకు చేరుకుని మంటలను ఆర్పుతున్నట్లు తెలుసుకున్న మరో ఫైర్ ఇంజిన్ సిబ్బంది తిరిగి గద్వాలకు వచ్చేందుకు రివర్స్ తీసుకుంటున్నారా వెనకాలే నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సును గమనించక ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ అద్దాలు ధ్వంసం కాగా ఫైర్ ఇంజిన్ వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కొంతమంది ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వం ఆసుపత్రి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## విద్యా వారోత్సవాలకు ఆహ్వానం

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన ఎంఇఒలు



**ప్రజాపక్షం/- అలంపూర్ :** రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు నేటి నుండి 17 వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'ఎడ్యుకేషన్ వీక్' వారోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడుకు నియోజకవర్గ ఎంఇఒలు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేకు వారు అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపరేఖలను మార్చడం, విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడం, విద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. నేటి నుండి ప్రారంభం కానున్న ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఒక ప్రత్యేక అంశంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరగబోయే ఈ విద్యా సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరచాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర బండ లాగుడు పోటీలు

ప్రారంభించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం/ పానుగల్ :** శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం పానుగల్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని, శ్రీ వీరభద్ర స్వామిని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి లు దర్శించుకున్నారు. అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలలో విజేతగా నిలిచిన ఎద్దుల యజమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్థిక సహకారంతో 60 వేల రూపాయల నగదు బహుమతిని నంద్యాల జిల్లా పిఆర్‌పల్లి గ్రామానికి చెందిన నాగయ్య కు నగదును అందజేశారు. సాగర సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంట్రాక్టర్ తిరుపతయ్య సాగర్ ఆర్థిక సహకారంతో రూ.50 వేల నగదును రెండవ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా కొండ వారి పాలెంకు చెందిన జిసి చౌదరికి అందజేశారు. గ్రామ వాసి చిన్న నరసింహా 40 వేల రూపాయల ఆర్థిక సహాయంతో కర్నూల జిల్లా గుడికల్ గ్రామానికి చెందిన దాసుకు చెందిన ఎద్దులు మూడవ స్థానం సాధించడంతో యజమానికి నగదును అందజేశారు. డిసిసిబి మాజీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో నాగర్ కర్నూల్ జిల్లా చంద్రకళ గ్రామానికి చెందిన వెంకటేశ్వర రావు ఎద్దుల నాలుగవ స్థానం సాధించడంతో 30 వేల నగదు రూపాయలను అందజేశారు. గ్రామ వాసి కుర్వ ఆంజనేయులు రూ.20 వేల ఆర్థిక సహకారంతో గద్వాల, వనపర్తి కి చెందిన సుధాకర్ రెడ్డి, గోపాలకృష్ణకు చెందిన ఎద్దులు ఐదవ స్థానంలో విజేతలుగా నిలవడంతో నగదు అందజేశారు. గ్రామానికి చెందిన బోయ కృష్ణయ్య, తెలుగు నాగేంద్రంల ఆర్థిక సహకారంతో అనంతపురం జిల్లా సోమల దొడ్డి గ్రామవాసి రామసుబ్బారెడ్డికి చెందిన ఎద్దులు ఆరవ స్థానంలో విజేతగా నిలవడంతో రూ.15 వేల నగదును అందజేశారు. వీరభద్ర స్వామి ఉత్సవాలకు, బండలాగుడు పోటీలకు ఆర్థిక సహకారం అందించిన వారికి నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పోటీలకు వ్యాఖ్యతగా రహమాన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవి కుమార్, గ్రామ సర్పంచ్ సుగుణ, మాజీ సర్పంచ్ జయరాములు సాగర్, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్యామ్ సుందర్ గౌడ్, కూపేందర్ రెడ్డి, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

సిఐ రామ్ లాల్



**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రస్తుతం ఐపిఎస్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో కొంత మంది యువత తక్కువ సమయంలో సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని సిఐ రామ్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై తీవ్రమైన నిర్ణయాలకు దారి తీసే ప్రమాదం కూడా ఉందని, దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సిఐ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్ ల సమయంలో పిల్లల్లో ఏమైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్‌ల కోసం ఉపయోగించకూడదని అన్నారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతలు వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


## సంగం రాధకు మంత్రి జూపల్లి నివాళులు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** కల్వకోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ సర్పంచ్ సంగం వెంకటస్వామి భార్య సంగం రాధ గత కొంతకాలంగా అనారోగ్యంత బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 3 గంటలకు మరణించింది. విషయం తెలుసుకున్న ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంకటస్వామి ఇంటికి వెళ్లి భౌతికయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి జూపల్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సర్పంచు గువ్వలి కురుమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మదన గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మి నారాయణ, సిపిఐ కార్యదర్శి సంఘం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ గౌడ్, బిచ్చి గౌడ్, వల్లి, తదితరులు ఉన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

జూరాల, భీమ లింక్ కెనాల్ మరమ్మతులు చేపట్టి వానాకాలం సాగునీటికి సిద్ధం చేయాలి ఎండి జబ్బార్



**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** వరి కొనుగోలు కేంద్రాలలో రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించి వచ్చే వానాకాలం సాగునీటికి జూరాల భీమ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి జబ్బార్ అన్నారు. మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నెలల తరబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పోసినా, ఇప్పటికీర గన్ని బ్యాగులు, లారీల కొరత కారణంగా ధాన్యం అక్కడికక్కడే నిల్వ ఉండిపోతుందని తెలిపారు. దీంతో రైతులు ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారని అన్నారు. పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో తూకం వేసి లారీలకు పంపించే సమయంలో రైస్ మిల్లర్లు తూకం, తరుగు పేర్లతో రైతులను వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రతి క్వింటాల్ కు ఐదు కేజీల నుంచి ఎనిమిది కేజీల వరకు అదనంగా తగ్గిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమాలను వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాగునీటి సమస్యలపై కూడా ఎండి జబ్బార్ స్పందించారు. ఎండాకాలంలో జూరాల, భీమ లింక్ కెనాల్ కాలువలకు సరైన మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల భారీగా నీరు వృథా అవుతోందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపడితే జూరాల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే భీమ, కెవెల్ఐ కాలువల పెండింగ్ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి. బాల్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. కృష్ణయ్య, రవి ప్రసాద్, మండల నాయకులు, ఆది, ఆశన్న, నిరంజన్, బాలగౌడ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా కూలిన మట్టి మిద్దె



**ప్రజాపక్షం/ అమరచింత :** అమరచింత మున్సిపాలిటీ పదో వార్డులోని చేనేత కార్మికురాలు మట్టి ఇల్లు మిద్దె అకస్మాత్తుగా కూలింది. బాధితురాలి వివరాల ప్రకారం అమరచింత పట్టణంలోని తిరుమల వీధిలో నివసిస్తున్న చేనేత కార్మికురాలు తిరుమల భారతమ్మ, మధు దంపతుల మట్టి మిద్దె (వంట గది) ఆదివారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో పూర్తిగా పడిపోయిందని తెలిపారు. ఉదయమే వంట చేసుకుని తాను బయటకు వచ్చిన తక్షణమే వంట గది యొక్క పైకప్పు పూర్తిగా పడిపోయిందని తెలిపారు. పైకప్పు పడిపోయిన ఆ వంట గదిలో ఎవ్వరు లేకపోవడం వల్ల ఎవరికి హాని జరగలేదని ఆమె తెలిపారు. వంటగది పైకప్పు పూర్తిగా కూలిపోవడంతో ఇంటిలో ఉన్న వంట సామాగ్రి, స్టీల్ సామాన్లు, బియ్యం, జొన్నలు, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్ లు (2) పూర్తిగా మట్టిలో కూరుకుపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. దాదాపు లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఇందిరమ్మ పథకం ద్వారా డబుల్ బెడ్ రూమును మంజూరు చేయాలని బాధిత కుటుంబీకులు కోరారు. సంఘటన జరిగిన సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలపగా వెంటనే గిర్దావర్ గోపాల్ ఆ ప్రాంతానికి వచ్చి పూర్తి సమాచారాన్ని సేకరించారు. మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలిన వివరాలను బాధితులతో సమాచారాన్ని సేకరించి పంచనామ చేశారు.

## అభివృద్ధి చేసి చూపు సహకరిస్తాం

ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ నాయకులు సవాల్



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తే బిఆర్ఎస్ పార్టీ నుంచి పరిపూర్ణమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆదివారం నాడు జడ్చర్ల పట్టణంలోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పి మాజీ వైస్ చైర్మన్ కోడికల్ యాదయ్య, ఇతర బిఆర్ఎస్ నాయకులు మాట్లడారు. నియోజకవర్గ అభివృద్ధిచేసి ప్రజలకు ఎంతో మేలు చేశారని చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ముఖ్యంగా రైతులు రోడ్డుపై ధర్నా చేస్తున్న సమయంలో ప్రభుత్వ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు మద్దతు పలికి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారని ఈ విషయం గమనించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు 10 సంవత్సరాల్లో జరిగాయని, ప్రస్తుతం ఎమ్మెల్యే అనిల్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేయలేకపోతున్నాడని వారు మండిపడ్డారు. రోడ్లు డ్రైనేజ్, హైమాస్ట్ లైట్లు నల్లకుంట ఏరియా అభివృద్ధి, పార్కులు, కళాశాలలో అదనపు భవనాలు చేసిన ఘనత మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కే దక్కుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నందకిషోర్ గౌడ్, చైతన్య , పిట్టల మురళి మమ్మదరి, నాగిరెడ్డి, ఇంతియాజ్ లత, పర్వత్ రెడ్డి, ఇఫ్తికర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా యుగంధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా గంగిరెడ్డి యుగంధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎస్.కురుమూర్తి కల్వకుర్తికి బదిలీ కాగా, నాగర్ కర్నూల్ వీఆర్‌గా ఉన్న యుగంధర్ రెడ్డి వెల్దండకు బదిలీ అయ్యారు. ఆయనని మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృష్టి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది ఎస్సై యుగంధర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

# సిఎం విజయ్ తొలి టీమ్...

**చెన్నై:** దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. నటన నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టివికె) కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సమక్షంలో విజయ్ సిఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 9 మంది టివికె ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.




**1. ఎన్. ఆనంద్:** విజయ్ పార్టీని ప్రారంభించక ముందే ఆయన అభిమాన సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. టివికె ఏర్పాటులో కీలకమైన నిర్వహణ, నైపుణ్యాన్ని అందించారు. ఆ పార్టీకి మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. ఆ పార్టీ ప్రముఖ అధికార ప్రతినిధుల్లో ఆయన కూడా ఒకరు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నైలోని త్యాగరాయనగర్ నియోజకవర్గం నుంచి ఆనంద్ పోటీ చేశారు. చారిత్రకంగా డిఎంకె, అన్నాడిఎంకె ఆధిపత్యం వహించే ఈ స్థానంలో 51,632 ఓట్లు సాధించారు. డిఎంకె అభ్యర్థి రాజా అన్బళగన్‌ను ఆయన ఓడించారు.

**2. ఆధవ్ అర్జున:** 6 అడుగుల 7 అంగుళాల ఎత్తుతో ఆకట్టుకునే మాజీ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఆధవ్ అర్జున. తమిళనాడుకు చెందిన రాజకీయ వ్యూహకర్త, దాత, క్రీడా నిర్వాహకుడు. గత ఎన్నికల్లో డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్‌తో ఆయన పనిచేశారు. 2026 ఎన్నికల్లో చెన్నైలోని విల్లివాక్కం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టివికె అభ్యర్థిగా ఆధవ్ అర్జున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ పార్టీలో ఎన్నికల ప్రచార నిర్వహణకు సంబంధించిన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తద్వారా పార్టీ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి ఎన్ ఆనంద్ తర్వాత టివికెలో అత్యున్నత స్థాయి పదవిలో ఉన్న నాయకుడిగా ఆయన నిలిచారు. బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు.

**3. ఎస్ కీర్తన:** విజయ్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రి. తమిళనాడులోని బాణసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశి నియోజకవర్గం నుంచి టివికె అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 29 ఏళ్ల కీర్తన, విజయ్ మంత్రివర్గంలో అతి పిన్న వయస్కురాలు. హిందీలో అనర్గళంగా మాట్లాడే ఆమె, క్షేత్రస్థాయి రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ ఎన్నికల వ్యూహంలో కీలక పాత్ర పోషించారు. రాజకీయ సలహాదారుగా కూడా పనిచేశారు. శివకాశిలోని బాణసంచా పరిశ్రమల కార్మికులకు క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, మహిళలకు సమాన వేతనం కల్పిస్తామని కీర్తన హామీ ఇచ్చారు.

4. డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్: తమిళనాడుకు చెందిన వైద్యుడు, మాజీ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి. టివికె పార్టీకి విధాన, ప్రచార వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో నామక్కల్ జిల్లాలోని తిరుచెంగోడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

**5. డాక్టర్ టికె ప్రభు:** ఆయన దంత వైద్యుడు. టివికెలో కీలక నేత. కారైకుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. వి జయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

**6. కెఎ సెంగోట్టయ్యన్:** అన్నాడిఎంకెలో అత్యంత సీనియర్ నేత. ఐదు దశాబ్దాల అనుబంధం తర్వాత గత సంవత్సరం ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. విజయ్ పార్టీలో చేరి తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు సృష్టించారు.

**7.పి వెంకటరమణన్:** న్యాయవాది అయిన ఆయన చెన్నైలోని కీలకమైన మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టివికె ఎమ్మెల్యేగా గెలుపొందారు. టివికె కోశాధికారిగా ఆయన వ్యవహరిస్తున్నారు. క్రియాశీల రాజకీయాలకు కొత్త అయినప్పటికీ, 2000 నుంచి విజయ్‌కు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చాలాకాలంగా సన్నిహితుడిగా ఉన్నారు.

**8. నిర్మల్ కుమార్:** టివికె ఐటి, సోషల్ మీడియా శాఖ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఆయన ఉన్నారు. మదురైలోని తిరుప్పరన్‌కుండ్రం నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

**9. రాజమోహన్ అరుణ్ముగం:** నటుడు, స్టాండప్ కమెడియన్, ప్రేరణాత్మక వక్తగా బహుముఖ పాత్రలు పోషించారు. చెన్నైలోని ఎగ్మోర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి టివికె ఎమ్మెల్యేగా విజయం సాధించారు. విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## 'ఆశా' కార్యకర్తల నిరసనను ఎల్‌డిఎఫ్ పట్టించుకోలేదు

- కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** కేరళలో ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరసనను పదవీ విరమణ చేస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సరిగ్గా నిర్వహించడంలో విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు. 140 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఎల్‌డిఎఫ్ 35 సీట్లకే పరిమితమైన అసెంబ్లీ ఎన్నికల పనితీరును సిపిఐ సమీక్షిస్తోంది. తమ గౌరవ వేతనాన్ని రూ. 21,000కు పెంచాలని, పదవీ వి రమణానంతర ప్రయోజనాల కింద రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేరళ ఆశా ఆరోగ్య కార్యకర్తల సంఘం (కాహ్వా) గత ఏడాది 265 రోజుల పాటు నిరసన చేపట్టింది. అయితే, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఈ డిమాండ్లను అంగీకరించలేదు. 'ఆశా కార్యకర్తల వంటి నిరసనలను ఎదుర్కోవడంలో వామపక్ష ప్రభుత్వం భిన్నమైన వైఖరిని అవలంబించి ఉండాల్సింది. అది ఒక మితవాద ప్రభుత్వంలా ప్రవర్తించకూడదు. వామపక్ష ప్రభుత్వం కార్యకర్తల నిరసనలను అగౌరవపరచకూడదు లేదా వారిని చిన్న చూపు చూడకూడదు. కానీ అదే జరిగింది' అని విశ్వం అన్నారు. ఆశా కార్యకర్తలు సహజంగానే వామపక్ష ఉద్యమానికి దగ్గరగా ఉండాల్సిందని, కానీ వారు ఆ కూటమికి దూరమయ్యారని ఆయన అన్నారు. ఎన్నికలలో తమ ఓటమి, కమ్యూనిస్ట్ సంస్థలు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న దానికి ఒక హెచ్చరిక అని విశ్వం అన్నారు. ఎన్నికల పనితీరును సమీక్షించేటప్పుడు, కామ్రేడ్లు, వామపక్షాలకు సన్నిహితంగా ఉన్నవారు ఉద్యమానికి దూరమయ్యారా లేదా అనే విషయాన్ని పార్టీ పరిశీలిస్తుందని ఆయన చెప్పారు. వామపక్ష పార్టీలలో వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించరని, ఒకవేళ అలాంటి ధోరణి ఏర్పడి ఉంటే అది ఒక లోపమే అవుతుందని కూడా ఆయన అన్నారు. సిపిఐలో నాయకత్వ మార్పు కోసం ఎలాంటి డిమాండ్ లేదని విశ్వం స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన నిర్ణయాన్ని సిపిఐ(ఎం) తీసుకుంటుందని ఆయన తెలిపారు. అయితే, ప్రతిపక్ష ఉప నాయకుడి పదవి కోసం సిపిఐ పోటీ చేస్తుందని ఆయన చెప్పారు.

## తిరుచ్చి తూర్పు అసెంబ్లీ స్థానానికి విజయ్ రాజీనామా

**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తిరుచ్చి తూర్పు అసెంబ్లీ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ అసెంబ్లీ స్థానాన్ని ఆయన అట్టిపెట్టుకున్నారు. దాంతో తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించారు. టివికె చీఫ్ విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి పోటీ చేశారు. మే 4న వెలువడిన ఫలితాల్లో ఆయన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయవచ్చు. ఒకవేళ ఆ రెండు సీట్లలోనూ గెలిస్తే ఒక దానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి గెలిచిన విజయ్ .. ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

## విజయ్‌కి శుభాకాంక్షలు వెల్లువ



**చెన్నై:** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సి. జోసెఫ్ విజయ్‌కి శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే హృదయపూర్వక అభినందనలు తెలియజేశాడు. తమిళనాడు మరియు శ్రీలంకల మధ్య తరతరాలుగా ఉన్న చరిత్ర, సంస్కృతి, ప్రజల మధ్య ఉన్న విడదీయలేని సంబంధాన్ని అధ్యక్షుడు దిస్సానాయకే కొనియాడారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా విజయ్‌కు తన శుభాకాంక్షలు అందించారు. భారత్ మరియు శ్రీలంకల మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యం భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక అవకాశాలకు దారితీస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమిళనాడుతో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకోవడానికి, ఇరు ప్రాంతాల ప్రజల పురోగతికి కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు కలిసి పనిచేస్తాం : మోదీ**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపర్చడం కోసం తాము రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడు ప్రజల సంక్షేమం కోసం తాము అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో మోదీ పాలన అద్భుతంగా ఉండాలని ఆకాంక్షించారు.

**తమిళనాడు తీర్పు యువ గళాన్ని ప్రతిబింబిస్తోంది : రాహుల్‌గాంధీ**

అదేవిధంగా లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా విజయ్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు ప్రజాతీర్పు సమాజంలో పెరుగుతున్న యువ గళాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. దానిని తాను ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ప్రజల కోసం కృషి చేస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు.

**ప్రజలకు మేలు చేసే పాలన సాగించాలి : స్టాలిన్**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తమిళగ వెట్రి కళగం (టివికె) అధినేత విజయ్‌కు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే విజయ్ సంతకం చేసిన తొలి నిర్ణయాలను ఆయన స్వాగతించారు. అయితే ఇదే సమయంలో ప్రభుత్వ నిర్వహణ, ఆర్థిక అంశాలపై స్టాలిన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని సాకులు చెప్పకుండా, ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో పాలన సాగించాలని ఆయన సూచించారు. తమ హయాంలో కరోనా కష్టకాలం, వరదలు, కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, ఐదేళ్ల పాటు లెక్కలేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ఖజానాను ఖాళీ చేసిందన్న ఆరోపణలను స్టాలిన్ ఖండించారు. తమిళనాడు అప్పులు అనుమతించబడిన పరిమితుల్లోనే ఉన్నాయని, ఈ ఏడాది ఫిబ్రవరి బడ్జెట్‌లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాము స్పష్టమైన వివరణ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ వివరాలన్నీ తెలిసే కదా ఎన్నికల్లో హామీలు ఇచ్చారని విజయ్‌ను ప్రశ్నించిన స్టాలిన్, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. సాధ్యమయ్యే హామీలనే ఇస్తాను అని చెప్పి అధికారంలోకి వచ్చిన విజయ్, ఇప్పుడు పరిపాలనలో అడుగుపెట్టారని.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఉన్న మెళకువలను ఆయన త్వరలోనే నేర్చుకుంటారని ఆశిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు. తమిళనాడు అభివృద్ధి ప్రస్థానం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయన తన సందేశాన్ని ముగించారు.

## రేపు అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం



**అసోం:** మాజీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మరోసారి అసోం సిఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనను బిజెపి ఎల్పీ లీడర్‌గానే కాకుండా, ఎన్డీయే కూటమి లెజిస్లేటివ్ పార్టీ లీడర్‌గా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ నెల 12న హిమంత సిఎంగా పదవీ ప్రమాణం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఎన్డీయే ఎల్పీ లీడర్‌గా ఎన్నికైన అనంతరం హిమంత ... ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీకి కతజ్ఞతలు తెలిపారు. 'వరుసగా వడోసారి అసోంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ మమ్మల్ని ఆశీర్వదించారు. ప్రధాని మోదీకి నా హదయపూర్వక ధన్యవాదాలు. ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. రాబోయే ఐదేళ్లు ప్రజల కోసం, అభివద్ధి కోసం కష్టపడతాం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీకి కతజ్ఞతలు' అని హిమంత బిశ్వ శర్మ అన్నారు. ఇటీవల జరిగిన అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధ్వర్యంలోని ఎన్‌డిఎ కూటమి భారీ విజయం సాధించింది. 126 సీట్లున్న అసెంబ్లీలో కూటమి 102 సీట్లు సాధించింది. అందులో బిజెపికి 82 సీట్లు దక్కాయి. కూటమిలోని మిగతా రెండు పార్టీల్లో ఎజిపికి 10 సీట్లు, బిపిఎఫ్ 10 సీట్లు గెలుచుకున్నాయి.

## తమిళనాడు ప్రొటెం స్పీకర్‌గా కరుప్పయ్య



**చెన్నై :** తమిళనాడులో ఆదివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరగా, శోలవందన్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికైన టివికె శాసనసభ్యుడు ఎంవి కరుప్పయ్య, ఆదివారం ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో జరిగిన ఒక సాధారణ కార్యక్రమం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కరుప్పయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జోసెఫ్ సి. విజయ్ హాజరయ్యారు. ఎఐఎడిఎంకె నుండి వైదొలిగిన తర్వాత కరుప్పయ్య టివికెలో చేరారు. 2011–16 మధ్య కాలంలో శోలవందన్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 234 మంది సభ్యులు కలిగిన తమిళనాడు అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సోమవారం నాడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, తమిళనాడు 17వ శాసనసభ తన తొలి సమావేశం సోమవారం ఉదయం 9:30 గంటలకు సచివాలయంలోని అసెంబ్లీ మందిరంలో జరగనుంది. కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రభుత్వ ప్రకటన తెలిపింది. ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేటప్పుడు సభ్యులు తమ ఎన్నికల ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా, సభాపతి (స్పీకర్), ఉప సభాపతి ఎన్నిక మంగళవారం ఉదయం 9:30 గంటలకు జరుగుతుంది.

## కర్ణాటక మంత్రి సుధాకర్ కన్నుమూత



**బెంగళూరు :** కర్ణాటకలో విషాదం జరిగింది. కాంగ్రెస్ నేత, కర్ణాటక ప్లానింగ్ అండ్ స్టాటిస్టిక్స్ మంత్రి డి. సుధాకర్ (66) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నట్లు బాధపడుతున్న ఆయన బెంగళూరులోని క్రిష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతూ ఆదివారం వేకువ ఝామున తుది శ్వాస విడిచారు. ఆయన ముందుగా మోకీలు ఆపరేషన్ కోసం ఆస్పత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు లంగ్ సమస్య ఉన్నట్లు గుర్తించి, చికిత్స అందించారు. సుధాకర్ కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్. ఆయన చిత్రదుర్గ జిల్లాలోని హిరియూర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సుధాకర్ మరణంపై కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ స్పందించారు. సుధాకర్ ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య కూడా సుధాకర్ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. సుధాకర్ మృతితో రాష్ట్రం ఒక గొప్ప పరిపాలకుడిని కోల్పోయిందని సిద్ధరామయ్య అన్నారు. ఆయన తన మంత్రివర్గంలో రెండుసార్లు పని చేశారని గుర్తు చేశారు. అలాగే, సుధాకర్ మరణంపై డిప్యూటీ సిఎం డికె శివకుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. తమ క్యాబినెట్ మినిస్టర్ అయిన సుధాకర్ మరణం తననెంతో కలచివేసిందన్నారు. ఆయన మృతిపై కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు.

## కేరళ కాంగ్రెస్‌లో వర్గపోరు

**తిరువనంతపురం:** కేరళ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు తీవ్రస్థాయికి చేరుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నేతత్వంలోని డీఎఫ్ కూటమి భారీ విజయం సాధించింది. అయినప్పటికీ సిఎం అభ్యర్థి ఎవరనేదానిపై ఇప్పటికీ సస్పెన్స్ వీడలేదు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మాత్రం కేసీ వేణుగోపాల్ సి ఎం కావాలని బలంగా కోరుకుంటున్నట్లు ఆ పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశానికి రాహుల్ కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాట తాస్థాయికి చేరింది. కేసీ వేణుగోపాల్ సిఎం కావడాన్ని కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసినట్లు తెలుస్తోంది. ఈ పోస్టర్ల వెనక సతీశన్ అనుచరుల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశంపై రాహుల్ గాంధీ సతీశన్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వేణుగోపాల్ ఎమ్మెల్యేలపై ప్రభావం చూపుతూ, వర్గపోరు సష్టించారని సతీశన్ ఆరోపించారు.

## ఉత్తర ప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ

కొత్త మంత్రులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం



**లక్నో :** ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బిజెపి కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం ఆరుగురు కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని లక్నోలోని జన్ భవన్‌లో ఆరుగురి చేత గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేయించారు. భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, క్రిష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్ రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దైలర్ మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండేకు క్యాబినెట్ హోదా దక్కింది. అలాగే, మంత్రివర్గంలో మార్పులు కూడా చేపట్టారు యోగి ఆదిత్యనాథ్. ఇప్పటికే మంత్రులుగా ఉన్న అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్లకు స్వతంత్ర మంత్రులుగా అవకాశం కల్పించారు. ఉత్తర ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి, పలువురికి అవకాశం కల్పించారు. యోగి 2.0లో 2024లో చేపట్టిన మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ మంత్రివర్గాన్ని విస్తరించడం ఇదే మొదటిసారి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కూటమి పార్టీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఎస్‌బిఎస్‌పి అధినేత ఓం ప్రకాష్ రాజ్‌బార్, ఆర్‌ఎల్‌డి నేతలు అనిల్ కుమార్, సునీల్ కుమార్ శర్మ, దారా సింగ్ చౌహాన్‌లకు క్యాబినెట్ పదవులు దక్కాయి. అయితే, ఈ మంత్రివర్గ విస్తరణపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఇది కాలక్షేపం కోసం చేసే ప్రక్రియగా అభివర్ణించారు.

## మిత్రుడికి కాంగ్రెస్ వెన్నుపోటు: మోదీ

**బెంగళూరు:** కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పాల్పడిందని దుయ్యబట్టారు. 30 ఏళ్లుగా డీఎంకేతో కాంగ్రెస్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆ పార్టీతో పొత్తు వల్లే కాంగ్రెస్ అనేకసార్లు సంక్షోభాల నుంచి బయటపడిందని మోదీ అన్నారు. బెంగళూరులో ఆదివారం జరిగిన ఓ సభలో మోదీ మాట్లాడుతూ 2014కు ముందు పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం డీఎంకే వల్లే మనుగడ సాగించిందని చెప్పారు. అయినప్పటికీ కష్టసమయంలో కాంగ్రెస్... స్టాలిన్ పార్టీని వదిలి టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. అధికారంపై ఉన్న దురాశతో దొరికిన తొలి అవకాశంలోనే మిత్రుడికి వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. రాజకీయంగా తన ఉనికి నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికైనా పాల్పడుతుందన్నారు. కర్నాటకలోనూ అంతర్గత అధికార పోరాటాల కారణంగా సుపరిపాలన అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని మోదీ అన్నారు. వదేళ్లుగా రాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బదులుగా... అంతర్గత కలహాలు పరిష్కరించుకోవడానికి ప్రభుత్వ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. సిఎం ఎంతకాలం కొనసాగుతారో... మరో వ్యక్తికి అవకాశం లభిస్తుందో లేదో కూడా కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించలేకపోతోందన్నారు. సరైన ఎజెండా లేకపోవడం వల్లే కాంగ్రెస్‌కు ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దేశప్రజల్లో ఆ పార్టీకి ఆదరణ తగ్గిపోతుందన్నారు. సురక్షిత పాలన, అభివద్ధి కోసం దేశ ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ప్రధాని చెప్పుకొచ్చారు. అందువల్లే తాజా ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అసోం ప్రజలు బిజెపికి పట్టం కట్టారన్నారు. భవిష్యత్తులో కర్నాటకలోనూ బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, బాంబు నిర్వీర్వ దళాలు వాటిని అక్కడి నుంచి తరలించాయన్నారు. వాటిని అక్కడ పెట్టినట్లు భావిస్తున్న ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దీంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో విస్తత సోదాలు నిర్వహించారు. మోదీ వేదిక వద్దకు చేరుకోవడానికి ముందు ఆయన కాన్వాయ్ వచ్చే మార్గంలో నిర్వహించిన సాధారణ భద్రతా తనిఖీల్లో ఈ జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టామన్నారు.

## సంజీవ్ అరోరాకు ఏడురోజుల ఇడి కస్టడీ




**చండీగఢ్:** పంజాబ్ పరిశ్రమల మంత్రి సంజీవ్ అరోరాను గురుగ్రామ్ కోర్టు ఏడురోజుల ఇడి కస్టడీకి పంపినట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మనీలాండరింగ్ కేసులో అరోరా అధికారిక నివాసం సహా వివిధ ప్రాంతాల్లో దాడులు జరిపిన అనంతరం శనివారం సాయంత్రం ఇడి అదుపులోకి తీసుకుంది. అరోరాను చండీగఢ్ నుంచి రోడ్డు మార్గంలో గురుగ్రామ్‌కు తీసుకువచ్చినట్లు అధికారులు చెప్పారు. ఇడి పదిరోజుల రిమాండ్ కోరగా, గురుగ్రామ్ లోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల కస్టడీ విధించింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని మంత్రి తరపు న్యాయవాది తెలిపారు. మే ఐదో తేదీ ఇడి కేసు నమోదు చేసి తొమ్మిదో తేదీన అరోరాను అరెస్ట్ చేసిందని అన్నారు.

**బిజెపి పాలనలో ఇడి, సిబిఐ దుర్వినియోగం : హర్భజన్ సింగ్**

కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇడి, సిబిఐలను బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని పంజాబ్ మంత్రి హర్భజన్ సింగ్ ఆరోపించారు. మనీలాండరింగ్ నెపంతో మంత్రిని సంజయ్ ఆరోరాను ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. సహచర మంత్రి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ప్రజలను భయపెట్టి బిజెపిలో చేర్చుకునేందుకు జరుగుతున్న ఈ ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు బిజెపిలో చేరేలా ఒత్తిడి చేయడానికి కేంద్ర సంస్థలను మోదీ సర్కార్ వినియోగిస్తోందని, అధికారాన్ని చేజిక్కించుకోవడానికి బెంగాల్‌లో ప్రయోగించిన అదే ఎత్తుగడలను ఇప్పుడు పంజాబ్‌లోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు, అయితే పంజాబ్‌లో జరగనివ్వమని' ఆయన దీమా వ్యక్తం చేశారు.

**ఇడి దుర్వినియోగం: ఆప్ లూథియానా/హోషియార్పూర్:**

కేబినెట్ మంత్రి సంజీవ్ ఆరోనాపై ఇడి చర్యలతో బిజెపికి వ్యతిరేకంగా పంజాబ్‌వ్యాప్తంగా ఆప్ ఆందోళనలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగిస్తోందని, తమ పార్టీ నాయకులపై చర్యలకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆదేశిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. కొన్ని చోట్ల బిజెపిఆప్ కార్యకర్తల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు జరగడంతో ఉద్రిక్తత నెలకొన్నది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి నియంత్రించాల్సి వచ్చింది. లూథియానాలో గిల్ రోడ్డ వద్ద మార్కెట్ దగ్గర బిజెపి కార్యాలయం బయట ఆప్‌బిజెపి కార్యకర్తలు గొడవ పడ్డారు. పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరాను రూ.100 కోట్ల జీఎస్టీ మోసం మనీలాండరింగ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైఐక్టరేట్(ఇడి) అరెస్టు చేసిన క్రమంలో ఆదివారం ఆప్ అధ్వర్యంలో పంజాబ్ వ్యాప్తంగా నిరసనలు జరిగాయి. అరోరా ఇంటిపై ఇడి దాడి, ఆయన అరెస్టు రాజకీయ ప్రేరేరితమని ఆప్ ఆరోపించింది. రాష్ట్రవ్యాప్తంగా బిజెపి కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చింది. కొన్ని చోట్ల కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలతో ఆప్ నిరసనలు తెలిపింది. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చింది. ఇడిబిజెపి ముర్దాబాద్ ప్లకార్డులు ప్రదర్శించింది. లూథియానా, హోషియార్పూర్, భటిండా, జలంధర్ తదితర ప్రాంతాల్లో ఆందోళనలు పెద్దఎత్తున జరిగాయి. లూథియానాలో ఘర్షణ చోటుచేసుకుంది. బిజెపి కార్యకర్తలు సైతం ఆందోళనకు దిగడ, పరస్పరం విమర్శలు, పోటాపోటీ నినాదాలు చేయడంతో ఘర్షణ తలెత్తి... నలుగురికి గయాలయ్యాయి. నిరసనలో భాగంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను ఆప్ కార్యకర్తలు దహనం చేశారు. అటు బిజెపి కార్యకర్తలు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సిఎం భగవంత్ సింగ్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఆప్ నిరసనకు మంత్రి హర్దీప్ సింగ్ ముండియన్, ఎమ్మెల్యేలు అశోక్ ప్రశార్ పప్పి, కుల్వంత్ సింగ్ సిధూ, బోలా గ్రేవల్, మేయర్ ఇందర్ జిత్ హాజరయ్యారు.

# ముగింపు దశకు యుద్ధం: పుతిన్



**మాస్కో:** ఉక్రెయిన్‌తో నాలుగేళ్లకుపైగా సాగుతున్న యుద్ధం ముగింపు దశకు చేరుకోనున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. విక్టరీ డే సందర్భంగా ఉక్రెయిన్‌పై విజయం సాధిస్తామని సంకల్పించిన కొన్ని గంటల్లోనే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈ వ్యవహారం ముగింపు దశకు చేరుకుంటోంది' అని రష్యాఉక్రెయిన్ యుద్ధంపై విలేకరుల ప్రశ్నకు పుతిన్ సమాధానం ఇచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్ ఇంతటి భయంకర యుద్ధాన్ని చూడలేదు. కాగా, యూరప్ కోసం నూతన భద్రతా ఏర్పాట్లపై చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ఈ చర్చలకు జర్మనీకి మాజీ చాన్సలర్ గెర్హార్డ్ స్కోరీడర్ సరైన వ్యక్తిగా భావిస్తున్నట్లు చెప్పారు. 2022 నుంచి ఉక్రెయిన్, రష్యా మధ్య భీకర పోరు కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో జరిగిన శాంతి చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొన్నట్లు క్రెమ్లిన్ వెల్లడించారు. రష్యా నిర్దేశించుకున్న యుద్ధ లక్ష్యాలన్నీ నెరవేరేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని అనేక సందర్భాల్లో పుతిన్ తెలిపారు. తాజాగా యుద్ధం ముగింపునకు సంబంధించి సంకేతాలు ఇచ్చారు తప్ప అందుకు గాను ఎలాంటి కాలపరిమితిని సూచించలేదు. అలాగే, శాంతి ఒప్పందం గురించీ ప్రస్తావించలేదు. తన అభ్యర్థనతో రష్యా, ఉక్రెయిన్ వడు రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే ఉక్రెయిన్ కాల్పుల విరమణను ఉల్లంఘించిందని రష్యా ఆదివారం ఒక ప్రకటన చేసింది. డ్రోన్లతో దాడి చేసినట్లు తెలిపింది. 24గంటల్లో ఉక్రెయిన్‌కు చెందిన 57 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అంతకుముందు ఉక్రెయిన్ కూడా రష్యాపై ఇలాంటి ఆరోపణలే చేసింది. 24 గంటల్లో 150 ఘర్షణలు జరిగినట్లు తెలిపింది. డ్రోన్లతో రష్యా దాడి చేసినట్లు పేర్కొంది.

# స్కాట్లాండ్ పార్లమెంటుకు భారత వలస విద్యార్థి

## మణివణ్ణన్ ఎన్నికపై నిరసనలు, చర్చలు

**ఎడిన్‌బర్గ్:** స్కాట్లాండ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తనను తాను నాన్‌బైనరీ (ట్రాన్స్‌జెండర్)గా గుర్తించుకునే భారత సంతతికి చెందిన ఆంత్రోపాలజిస్ట్ క్యూ మణివణ్ణన్ స్కాట్లాండ్ పార్లమెంటు (ఎంఎస్‌పీ)కు ఎన్నికయ్యారు. స్కాటిష్ గ్రీన్స్ తరపున పోటీ చేసిన మణివణ్ణన్... ఎడిన్‌బర్గ్, లుథియాన్స్ ఈస్ట్ నుంచి గెలుపొందారు. స్వల్ప కాలిక వీసాలు ఉన్న వారు సైతం పోటీ చేయొచ్చు అంటూ మార్చిన నిబంధన నేపథ్యంలో తమిళనాడుకు చెందిన ఈ విద్యార్థికి అవకాశం లభించింది. తమిళనాడు నుంచి వలస వెళ్లిన మణివర్ణన్ తన గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. శ్రామిక, అణగారిన వర్గాల కోసం విప్లవాత్మక మార్పు తెచ్చేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. శ్రామిక వర్గానికి మరింత సంరక్షణ, ట్రాన్స్‌జెండర్లకు ఆదరణ ఉండే రాజకీయాలు అవసరమన్నారు. హోలీరూడ్‌లో ధైర్యాన్ని, నూతనోత్సాహాన్ని నింపుతానని సంకల్పించారు. మణివర్ణన్ ప్రచారం కోసం 1,600 పౌండ్ల విరాళాలను



క్రౌడ్‌ఫండర్ మాధ్యమంగా ఆన్‌లైన్‌లో సేకరించారు. స్కాట్లాండ్ కాంపెక్స్ ఎలక్టోరల్ సిస్టమ్ పరిధిలో మణివర్ణన్ ఎన్నికయ్యారు. క్యూ మణివర్ణన్ ఎన్నిక తమకు గౌరవప్రదమని స్కాటిష్ గ్రీన్స్ ప్రతినిధి తెలిపారు. ఇదిలావుంటే, ఈ ఎన్నిక బ్రిటన్ వలస విధానాలు, ఎన్నికల నిబంధనలపై నిరసనలకు, చర్చలకు దారితీసింది. గతంలో బ్రిటన్ శాశ్వత నివాస హోదా ఉన్న విదేశీయులకు మాత్రమే హోలీరూడ్ ఎన్నికల్లో పోటీకి అర్హత ఉండేది. 2025లో ఎస్ఎన్‌పీ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం దీనిని మార్చింది. స్వల్పకాలిక విద్యార్థి వీసా వంటివి ఉన్నవారు సైతం పోటీ చేసే అవకాశం కల్పించింది. దీంతో 2021లో సెయింట్ ఆండ్రూస్ నివర్సిటీలో పీహెచ్‌డీ చేయడానికి విద్యార్థి వీసాపై వచ్చిన మణివణ్ణన్, రాజకీయ నాయకుడిగా ఎదిగే వెసులుబాటు కలిగింది. మణివణ్ణన్ తన వీసా ఖర్చులకు సహచరుల సాయం కోరారు. తన గ్రాడ్యుయేట్ వీసాను పొడిగించుకోవడానికి 2,089 (సుమారు 2.2 లక్షల రూపాయలు) నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. ఈ వీసా లభిస్తేనే మరో వడేళ్ల పాటు బ్రిటన్‌లో ఉండి, ప్రజల పన్నుల ద్వారా వచ్చే 77,711 (సుమారు 82 లక్షల రూపాయలు) వార్షిక జీతాన్ని పార్లమెంటు సభ్యుడిగా అందుకోగలరు. మణివణ్ణన్ ఎన్నికపై 'మైగ్రేషన్ వాచ్' అనే గ్రూప్ స్పందించింది. దేశాన్ని విడగొట్టాలని చూసే వారికి రాజకీయాల్లో చోటు కల్పించడం విడ్డూరమని పేర్కొంది. 'రీప్లేస్‌మెంట్ థియరీ' పేరుతో సామాజిక మాధ్యమాల్లో చర్చలు నడుస్తున్నాయి, అంటే వలసదారుల సంఖ్యను పెంచి స్థానికుల ఓటు బ్యాంకును దెబ్బతీస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఇతర దేశాల్లో ఎక్కడా లేని వింత చట్టాలు పెట్టడం పిచ్చితనానికి పరాకాష్ట అని నెటిజన్లు మండిపడ్డారు.

# బోల్సెనారోకు శిక్ష తగ్గింపుపై సుప్రీం నో



**బ్రెసీలియా:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారోకు విధించిన శిక్షను తగ్గించే చట్టాన్ని అమలు చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం అభ్యంతరం తెలిపింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ఫిర్యాదులు పరిశీలించేందుకు పూర్తి స్థాయి విచారణ చేపట్టేంత వరకు ఈ చట్టాన్ని నిలిపివేయాలని ఆదేశించింది. 2022లో లూలా డ సిల్వాపై పోటీ చేసిన బోల్సెనారో ఓటమి చవిచూశారు. పదవిలో కొనసాగేందుకు తిరుగుబాటుకు కుట్ర చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు గతేడాది సెప్టెంబరులో ఆయనకు 27 ఏళ్ల శిక్ష విధించింది. కానీ డిసెంబరులో దోషులుగా తేలిన బోల్సెనారో సహా ఇతరులకు శిక్షను తగ్గించేలా కాంగ్రెస్ ఒక చట్టాన్ని ఆమోదించింది. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా జనవరిలో ఈ బిల్లును వీటో చేశారు కానీ, ఏప్రిల్ చివరలో కాంగ్రెస్ నిర్వహించిన ఓటింగ్‌లో అది వీగిపోయింది. అనంతరం ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, దానిని రద్దు చేయాలని బోల్సెనారో మద్దతుదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# దోహాలో బల్క్ క్యారియర్ నౌకపై దాడి



**దోహా:** ఖతార్ రాజధాని దోహా సమీపంలో భారీ కంటైనర్లను తీసుకెళ్తున్న బల్క్ క్యారియర్ నౌకపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో నౌకలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఆదివారం ఈ మేరకు వెల్లడించింది. దోహాకు 23 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగిందని, గుర్తుతెలియని ఆయుధం ఒకటి నౌకను బలంగా తాకడంతో మంటలు వ్యాపించాయని వెల్లడించింది. సిబ్బంది అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొంది. ప్రాణ నష్టం సంభవించలేదని ధవీకరించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఈ దాడి జరగింది. దాడికి గురైన నౌక ఏ దేశానికి చెందినది, అందులో ఉన్న సరకు ఏమిటి అనే వివరాలను అధికారులు వెల్లడించలేదు.

# పాక్‌లో ఉగ్రదాడి: 15 మంది భద్రతాధికారులు మృతి



**పెషావర్:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్‌లో ముష్కరులు రెచ్చిపోయారు. పోలీసు పోస్టుపై ఆత్మాహుతి దాడి చేశారు. ఈ ఘటనలో 15 మంది భద్రతాధికారులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడ్డారు. బన్ను జిల్లాలో ఈ దాడి జరిగింది. పేలుడు సామగ్రితో కూడుకున్న వాహనం పోలీసు పోస్టు వైపునకు దూసుకెళ్లగా, భద్రతా సిబ్బంది దానిని ఆపే ప్రయత్నంలో కాల్పులు జరపడంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి పరిసరాల్లో అనేక ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. పోలీసు పోస్ట్ భవనం శిథిలమైంది. అనేక మంది భద్రతా సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. పేలుడు జరిగిన వెంటనే పెద్ద సంఖ్యలో తీవ్రవాదులు తమపై దాడి చేయడంతో భీకర ఎదురు కాల్పులు జరిగినట్లు పోలీసులు చెప్పారు. బన్ను పోలీసుల ప్రతినిధి మాట్లాడుతూ 15 మంది అధికారులు చనిపోయారని అన్నారు. ఎదురు కాల్పుల్లో ఎంత మంది తీవ్రవాదులు ప్రాణాలుకోల్పోయారన్న దానిపై స్పష్టత లేదన్నారు. ఈ ఘటనను ఖైబర్ పక్తుంఖ్వా ముఖ్యమంత్రి మహమ్మద్ సొహెయిల్ ఆఫ్రిదీ తీవ్రంగా ఖండించారు. దీనిని ఉగ్రవాద దాడిగా... పరికిపంద చర్యగా వర్ణించారు. జరిగిన ప్రాణ నష్టంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికిమెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి దాడులు పోలీసు, ప్రజల మనోబలాన్ని తగ్గించలేవన్నారు. 'ఉగ్రవాదంపై పోరాటం ఒక ప్రాంతానిది కాదు, మొత్తం దేశానిది. కొన్ని తప్పుడు విధానాలతో దేశం అభద్రతా ఊబిలోకి నెట్టబడింది. పోలీసుల త్యాగాలను వథా కానివ్వం' అని సీఎం అన్నారు.

# చంద్రబాబు నివాసానికి ప్రధాని మోదీ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి చేరుకున్న ప్రధానికి సిఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, ఏపి మంత్రి నారా లోకేశ్ సాదర స్వాగతం పలికారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపైనా ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ సమావేశం ఆసక్తికరంగా మారింది.

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ప్రధాని





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్‌ను ఆయన నివాసంలో పరామర్శించారు. జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ ఇంటికి ప్రత్యేకంగా వెళ్లిన ప్రధాని, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ కల్యాణ్ శస్త్ర చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను కలుసుకున్న ప్రధాని మోదీ, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

తన ఆరోగ్యంపై ఆరా తీసేందుకు స్వయంగా ఇంటికి వచ్చిన ప్రధాని మోదీకి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య కొద్దిసేపు ఆత్మీయంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# బిసి కుల గణన చేపట్టాలని ప్రధానికి వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో బిసి కుల గణనకి సంబంధించి హౌస్ హోల్డర్స్‌లో కాలం 13 లో లేదని బిసి కుల గణన చేర్చాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తూ డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌లు బేగంపేట విమానాశ్రయంలో వినతి పత్రం అందజేశారు. అంతకుముందు తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. ఆదివారం మధ్యాహ్నం బేగంపేట విమానశ్రయానికి చేరుకున్న ప్రధానికి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారికంగా స్వాగతం పలికారు. అలాగే హైదరాబాద్ పర్యటన ముగించుకొని బేగంపేట విమానాశ్రయం నుండి గుజరాత్ వెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌లు వీడ్కోలు పలికారు.

## పొదుపు మంత్రం

**(మొదటి పేజీ తరువాయి)**

మరింత బలోపేతం చేస్తాని, తెలంగాణ అంతటా మెరుగైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ కనెక్టివిటీ దిశగా ఇది ఒక పెద్ద ముందడుగు పడిందన్నారు.

హైదరాబాద్ హెచ్ఐసిసి వేదికగా ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలో రూ.9,400 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ గతంలో భారతదేశం ప్రధాన ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పుడు మన వస్త్ర పరిశ్రమ భారీ పాత్ర పోషించిందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ వారసత్వాన్ని మళ్లీ బలోపేతం చేస్తున్నామని, తెలంగాణలోని వరంగల్‌లో పిఎమ్ మిత్ర పార్కు దేశంలో వస్త్ర క్రాంతిని వేగవంతం చేస్తుందన్నారు. ఇది తెలంగాణ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, తెలంగాణలోని ప్రతి కుటుంబ సభ్యుని కలలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం మరింత వేగంతో పని చేస్తుందని హామీ ఇస్తున్నానన్నారు. ఇక్కడ తయారైన వాహనాలు, యంత్రాలు, ఈ జోన్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెలంగాణ కార్మికులు, రైతులకు సాధికారత కల్పిస్తాయని మోదీ ఉద్ఘాటించారు. తెలంగాణాలోని జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం సంస్కరణల పరివర్తనకు మూలస్తంభంగా ఉందని, పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేయాలనే భారత ప్రభుత్వ జాతీయ మిషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న కాంప్లెక్స్ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అద్భుతమైన విద్యుత్ సరఫరా, అధునాతన ఐసిటి నెట్వర్క్‌తో కూడిన పారిశ్రామిక స్మార్ట్ సిటీగా పనిచేస్తుందని, ప్రపంచ పెట్టుబడిదారులకు కార్యకలాపాలను ప్రారంభించడానికి అవసరమైన ప్రతి సదుపాయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి వేల కోట్ల రూపాయలు ఈ సౌకర్యాలకు నిధులు సమకూరుస్తాయని, తెలంగాణ, హైదరాబాద్‌లోని వేలాది మంది యువకులకు ఉపాధి మార్గాలను సృష్టిస్తాయని ప్రధాని అన్నారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్ రూ.1,000 కోట్ల కంటే తక్కువగా ఉండేది. కానీ నేడు ఒక్క తెలంగాణకే ఈ ఏడాది రూ. 5,500 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి' అని తెలిపారు.

**రేవంత్ జీ మేరే సే హీ జోడో : ప్రధాని మోదీ**

'రేవంత్ జీ మేరే సే హీ జోడో' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రేవంత్ రెడ్డి రాజకీయాలు మాట్లాడను అని అన్నారు. నేను కూడా రాజకీయాలు మాట్లాడబోను' అని మోదీ సున్నితంగా చమత్కారాలు విసిరారు. గుజరాత్‌కు చేసిన కేటాయింపుల కంటే రెట్టింపు తెలంగాణకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నామని, అందుకే తమతోనే కలిసి రావాలని సిఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దీంతో రేవంత్ కూడా మోదీకి అభివాదం చేస్తూ నవ్వుకున్నారు. రేవంత్ పక్కనే కూర్చున్న బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా నవ్వుకున్నారు. గుజరాత్‌కు నాడు ప్రధానిగా మన్మోహన్ సింగ్ సహకరించినట్టే ఇప్పుడు మోదీ తెలంగాణకు సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. గుజరాత్‌కు ఆ రోజు ఎంత ఇచ్చారో ఇప్పుడు తెలంగాణకు అంత ఇస్తే తాము ఇవ్వాలనుకున్న దానిలో సగమే వచ్చే అవకాశం ఉందని మోదీ చమత్కరించారు. దాంతో అభివృద్ధిలో మీరు ఎక్కడికి చేరాలనుకుంటున్నారో అక్కడికి చేరలేరని, ఆ రోజు గుజరాత్‌కు చేసిన కేటాయింపులకు రెట్టిం పు తెలంగాణకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నట్టు ప్రధాని తెలిపారు.

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు పిఎం ప్రారంభోత్సవం**

ప్రధాని మోదీ హెచ్ఐసిసి వేదికగా వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలో రూ.9,400 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

హైదరాబాద్ పనాజీ ఎకనామిక్ కారిడార్ (ఎన్‌హెచ్167)లో గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ.3,180 కోట్లతో చేపట్టనున్న 4 లేన్ల రహదారి పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో రూ.2,360 కోట్లతో ఈ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన వేశారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కాజీపేట–విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులో భాగంగా రూ.1,250 కోట్లతో పూర్తి చేసిన వివిధ విభాగాల పనులను మోదీ ప్రారంభించారు. కాజీపేటలో రూ.300 కోట్లతో నిర్మించిన ఈ అత్యాధునిక బైపాస్ లైన్‌ను ప్రారంభించారు. పరిశ్రమలు, ఇంధన రంగంలో పిఎం మిత్ర పార్క్ కింద వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఆవరణలో రూ.1,700 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈ పార్క్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. హైదరాబాద్ మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) రూ.610 కోట్లతో నిర్మించిన అత్యాధునిక గ్రీన్ ఫీల్డ్ పిఓఎల్ (పిఓఎల్) టెర్మినల్‌ను ప్రారంభించారు.

**ఏ పార్టీ అధికారంలో ఉన్నా వివక్ష చూపకుండా తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

తొలుత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపకుండా తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత రాజకీయ భేదాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ప్రధాని మోదీ ఆశయమైన 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని కేంద్ర మంత్రి చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు మూడేళ్ల క్రితమే కేంద్రం అనుమతి ఇచ్చిందని, భూసేకరణ ప్రక్రియ ముగిసి, కేంద్ర కేబినెట్ ఆమోదం లభించగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. 2014 వరకు తెలంగాణలో 2,400 కి.మీ జాతీయ రహదారులు ఉండగా, గత 11 ఏళ్లలో అదనంగా 2,600 కి.మీ కొత్త హైవేలను కేంద్రం నిర్మించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ.220 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్‌ను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ స్థాయి అత్యాధునిక సదుపాయాలతో ఈ ఏడాది చివరికల్లా సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సమ్మక్కసారక్క సెంట్రల్ యూనివర్సిటీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఎయిమ్స్ ఆసుపత్రి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, గతంలో ప్రారంభించిన రామగుండం ఫర్టిలైజర్ పరిశ్రమ, రూ.13,000 కోట్ల ఎన్‌టిపిసి పవర్ ప్రాజెక్టులను కేంద్రం తెలంగాణకు అందించిందన్నారు.

## పరిశీలించండి

**(మొదటి పేజీ తరువాయి)**

అభివృద్ధి చేయాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ ప్రజల కోసం సానుకూల నిర్ణయాల విషయంలో తాను ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను అనేకసార్లు కలిశానని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు ప్రధాని అత్యవసర అనుమతులు, ఆమోదాలు అవసరమని సిఎం తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం, మెట్రో రైలు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారికి సంబంధించి 2 గంటల పాటు సమయం కేటాయించి సమీక్షించాలని ప్రధానిని సిఎం కోరారు. జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే మనకు అత్యధిక ప్రాధాన్యత, ముందు భారతదేశం, తర్వాత ప్రజలు, ఆ తర్వాతే పార్టీ అనేది స్పష్టమని సిఎం అన్నారు. ఆ స్ఫూర్తితోనే దేశ నిర్మాణానికి ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047ను ప్రకటించినపుడు, తెలంగాణ కూడా భాగస్వామ్యమైందని, తెలంగాణ రైజింగ్‌కు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహ



కారం అందిస్తుందనే విశ్వాసం మాకు ఉందన్నారు. తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు మోదీ వచ్చారని, అందరం అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారని, తెలంగాణ ప్రజలు కూడా రానున్న పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారన్నారు. నాటి మన్మోహన్ సింగ్ మాదిరిగా, ఆయన స్ఫూర్తితో ప్రధాని మోదీ తనకు పూర్తి సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నానన్నారు. 2034లో ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామనే నమ్మకం ఉందని, 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామని ఆశిస్తున్నామని, నాడు మన్మోహన్ సింగ్ సహకరించినట్లే ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలకు సహకారం అందించాలని సిఎం కోరారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మిత్రులు ప్రధానికి పెద్ద మనస్సు ఉందని చెబుతున్నారని, మోదీకి పెద్ద మనస్సు ఉందని తెలంగాణ ప్రజలకు తెలుసునని, నేడు వారు దానిని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులు, ప్రతిపాదనలు అన్నింటినీ ప్రధాని ఆమోదిస్తారని తెలంగాణ ప్రజలు ఆశిస్తున్నారన్నారు. దేశం విషయంలో మేం మీతో కలిసి ఉన్నామని, ప్రధాని వికసిత్ భారత్ 2047తో భారతదేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే అంశంపై మాట్లాడినప్పుడు, తాము తెలంగాణ రాష్ట్ర కోణంలో 'తెలంగాణ రైజింగ్ 2047'ను దానికి అనుసంధానం చేశామన్నారు.

## 'బడి' భారం

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న సర్పంచులను, ఇప్పుడు పాఠశాలల బాధ్యత తీసుకోమనడం అంటే వారిని మరింతగా అప్పుల ఊబిలోకి నెట్టడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం విద్యాశాఖలో ప్రత్యేక యంత్రాంగం ఉన్నప్పటికీ, ఆ బాధ్యతలను సర్పంచుల మెడకు చుట్టడం వెన్ను అధికారుల పలాయనవాదం స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా పరిష్కరించాల్సిన అధికారులు, కేవలం ఏసీ గదుల్లో కూర్చొని అవగాహన సదస్సులు నిర్వహించడానికే పరిమితమవుతున్నారు. సర్పంచులు తమ గోడును జిల్లా యంత్రాంగం ముందు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. జిల్లా స్థాయిలో సర్పంచుల సమస్యలు వినే నాథుడే లేకపోగా, లేనిపోని బాధ్యతలు సృష్టించి వారిని ఇబ్బందులకు గురిచేయడం శోచనీయం.

**బడిబాట కాదు.. ఇది ఒత్తిడి బాట**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడిబాట ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచులకు టార్గెట్లు విధిస్తున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల బాగు చేయించడం, విద్యుత్ సౌకర్యం కల్పించడం, తాగునీరు అందించడం వంటి పనులను సర్పంచులకే అప్పగించారు. అయితే, వీటికి అవసరమైన నిధులను ఏ పద్దు నుండి కేటాయిస్తారో అధికారుల వద్ద సమాధానం లేదు. "పంచాయతీలో జీతాలు ఇవ్వడానికి నిధులు లేవు, పాఠశాలల పనులు ఎలా చేయాలి ?" అని సర్పంచులు సూటిగా ప్రశ్నిస్తునానరు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైన ప్రభుత్వం, ఆ వైఫల్యాన్ని సర్పంచుల ఖాతాలో వేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కొర్రీల రాజకీయం – నిలిచిపోయిన అభివృద్ధి**

గ్రామాభివృద్ధి కోసం సర్పంచుల ప్రణాళికలు రూపొందిస్తే, వాటికి అనుమతులు ఇవ్వడంలో అధికారులు కావాలనే కాలయాపన చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి టెక్నికల్ కొర్రీలు పెట్టడం, ఎంబి రికార్డింగ్‌లో జాప్యం చేయడం వల్ల పనులు పూర్తయినా బిల్లులు రావడం లేదు. ఇలాంటి కొర్రీల సంస్కృతి వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పుడు పాఠశాలల బాధ్యతలు కూడా అప్పగిస్తే రేపు అక్కడ ఏదైన చిన్న లోపం జరిగినా సర్పంచులను బాధ్యులను చేస్తారన్న భయం వారిని వెంటాడుతోంది. అధికారుల వేధింపుల నుండి తమకు విముక్తి ఎప్పుడు లభిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

# చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత..

## ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!



లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్(65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్‌పై సిఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు. పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వకుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. లక్నో నిర్దేశించిన భారీ ఛేదనను ఓపెనర్ శాంసన్(28)ను ధాటిగా ఆరంభించాడు. బౌండరీలో చెలరేగిన సంజూను దిగ్వేశ్ రథీ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అవేశ్ ఖాన్‌ను వణికించిన ఉర్విల్ పటేల్(65) చివరి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపగా 5 ఓవర్లకే చెన్నై స్కోర్ డెబ్బై దాటింది. ఆ తర్వాతి ఓవర్లో దిగ్వేష్‌ను వదలని ఉర్విల్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. వరసగా రెండు ఓవర్లలో 25 చొప్పున రన్స్ రావడంతో పవర్ ప్లేలో సిఎస్కే వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. పవర్ ప్లే తర్వాత సింగిల్‌తో 13 బంతుల్లోనే ఉర్విల్ అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. ఆదే ఊపులో.. ఆడిన అతడు.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ(42)తో చెన్నైని గెలుపు దిశగా నడిపాడు. షాదాబ్ ఓవర్లో అవేశ్ చేతికి చిక్కడంతో ఉర్విల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే సగం లక్ష్యం కరిగిపోవడంతో చెన్నైకి భారీ విజయం పక్కా అనిపించింది. కానీ, షాదాబ్ ఓవర్లో గైక్వాడ బౌల్డవ్వగా.. బ్రెవిస్(10)ను రథీ బౌల్డ్ చేశాడు. ఫామ్‌లో ఉన్న కార్తిక్ శర్మ(20)ను అవేశ్ పెవిలియన్ పంపడంతో ఇంప్యాక్ట్ సబ్‌గా ప్రశాంత్ వీర్(18 నాటౌట్) వచ్చాడు. 18 బంతుల్లో 30 రన్స్ అవసరమవ్వగా.. ప్రిన్స్ 9 రన్సే ఇవ్వడంతో ఉత్కంఠ మొదలైంది. రథీ, పూరన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ప్రశాంత్ రెండు సిక్సర్లతో మెరవగా.. మర్క్‌రమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో శివం దూబే(15 నాటౌట్) తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో 5 వికెట్లతో గెలుపొందిన సీఎస్కే 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(336), అన్షుల్ కంబోజ్(247)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.

# ఉత్కంఠ పోరులో ఆర్‌సిబిదే విజయం

## ప్లే ఆఫ్స్ రేసు నుంచి ముంబై ఔట్



పంతొమ్మిదో సీజన్‌లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను అలరించింది. లో స్కోరింగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీని అదిరే విక్టరీ కొట్టింది. బ్యాటింగ్‌కు అనుకూలించని పిచ్ మీద టాపార్డర్ విఫలమైనా కృనాల్ పాండ్యా(73) ఒంటరి పోరాటంతో బెంగళూరును గట్టెక్కించాడు. కానీ, పట్టువదలని ముంబై బౌలర్లు డెత్ ఓవర్లలో పకడ్బందీగా బౌలింగ్ చేయడంతో చివరి ఓవర్ కీలకమైంది. భువనేశ్వర్(7 నాటౌట్) సిక్సర్ కొట్టగా.. చివరి బంతికి రసిక్ దార్ సలాం(3 నాటౌట్) రెండు పరుగులు తీయడంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఆర్సీబీ కీలక మ్యాచ్‌లో పంజా విసిరింది. రాయ్‌పూర్‌లో ముంబై ఇండియన్స్‌ను ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో చిత్తు చేసిన బెంగళూరు 14 పాయింట్లతో ముందంజ వేసింది. అయితే.. ఈ విజయం అంత తేలికగా ఏమీ రాలేదు. టాపార్డర్ విఫలమైనా.. కృనాల్ పాండ్యా(73) అద్భుత అర్ధశతకంతో గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ముంబైని 166కే కట్టడి చేసిన ఆర్సీబీ ఇన్నింగ్స్ కూడా తడబడుతూనే సాగింది. విరాట్ కోహ్లీ(0) గోల్డెన్ డకవ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ దేవ్‌దత్ పడిక్కల్(12)ను ఔట్ చేసి ఒత్తిడిలో పడేశాడు. బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలించని పిచ్ మీద అపసోపాలు పడి న జాకబ్ బెథెల్(27), కెప్టెన్ రజత్ పాటిదార్(8) లు ఆర్సీబీని ఆదుకోవాలనుకున్నారు.కానీ, పాటిదార్‌ను బాస్చ్ బోల్తా కొట్టించాడు. అనంతరం కృనాల్ పాండ్యా(73) జతగా సమయోచితంగా ఆడిన బెథెల్ స్కోర్ దాటించాడు. క్రీజునంటుకొని నాలుగో వికెట్‌కు 52 రన్స్ జోడించిన ఈ ద్వయా న్ని బాస్చ్ విడదీశాడు. జితేష్ శర్మ(18) ధాటిగా ఆడే క్రమంలో ఔటవ్వగా డేంజరస్ టిమ్ డేవిడ్ (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. అంతే.. అప్పటిదాకా ఆర్సీబీ చేతుల్లో ఉన్న మ్యాచ్ కాస్త ముంబై వైపు మళ్లింది. ఓవైపు కండరాల నొప్పితో బాధ పడుతూనే గజన్‌ఫర్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్సర్లతో మళ్లీ బెంగళూరును పోటీలోకి తెచ్చాడు. కానీ, బుమ్రా మూడు రన్సే ఇవ్వగా చివరి ఓవర్లో 15 పరుగులు అవసరమయ్యాయి. రొమారియో షెపర్డ్) ఔటైనా.. భువనేశ్వర్(7 నాటౌట్) సిక్సర్‌తో ముంబై డీలా పడింది. చివరి బంతికి రసిక్ దార్ సలాం(3 నాటౌట్) రెండు పరుగులు తీయడంతో ఆర్సీబీ జయకేతనం ఎగురవేసింది.

# ఆరోగ్యం

## గుండె సమస్యలను నిర్లక్ష్యం చేయకండి..

గుండె కవాట వ్యాధులు అనేది, కరోనరీ హార్ట్ డిసీజ్ కంటే భిన్నమైన సమస్య. కరోనరీ వ్యాధి రక్తనాళాల బ్లాకేజ్‌కు సంబంధించినది. అదే విధంగా కవాట వ్యాధి గుండెలో ఉన్న వాల్వ్‌ల పనితీరుకు సంబంధించినది. అయితే జీవనశైలి, రక్తపోటు, మధుమేహం వంటి అంశాలు రెండింటిపైనా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. వయసు పెరిగే కొద్దీ గుండె కవాటాలు కఠినంగా మారడం లేదా సరిగా తెరుచుకోకపోవడం, మూసుకోకపోవడం వంటి సమస్యలు రావచ్చు. దీనిని డిజెనరేటివ్ మార్పులు అంటారు. అనారోగ్యకరమైన ఆహారం, ధూమపానం, ఊబకాయం వంటి అలవాట్లు గుండెపై మొత్తం ఒత్తిడిని పెంచి ఈ పరిస్థితిని వేగవంతం చేస్తాయి. అలాగే అధిక రక్తపోటు, మధుమేహం, ఆటో



ఇమ్యూన్ వ్యాధులు గుండె కవాటాల నిర్మాణాన్ని లేదా పనితీరును దెబ్బతీస్తాయి. కేన్సర్ చికిత్సలో ఉపయోగించే కొన్ని మందులు, రేడియేషన్ కూడా గుండె కవాటాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపవచ్చు. లక్షణాల విషయానికి వస్తే, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ముఖ్యమైన సంకేతాలు. ఇవి గుండె సరైన రక్తప్రవాహాన్ని నిలబెట్టలేకపోతున్న సూచనలు. పాదాలు, చీలమండల వాపు అనేది శరీరంలో ద్రవం నిల్వవుతున్న సంకేతం, ఇది గుండె పనితీరు తగ్గినప్పుడు కనిపిస్తుంది. ఛాతీ నొప్పి, గుండె దడ, తలతిరగడం వంటి లక్షణాలు కూడా గమనించాల్సినవి. లక్షణాలు కనిపించే సమయానికి సమస్య కొంత ముందుకు వెళ్లి ఉండే అవకాశం ఉంటుంది. అందుకే, కేవలం లక్షణాలపై ఆధారపడకుండా, ప్రమాద కారకాలు ఉన్నవారు నిరంతర వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. ఏదిఏమైనా జీవనశైలిని నియంత్రించడం, రక్తపోటు మరియు మధుమేహాన్ని కట్టడి చేయడం, ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

## మొలకలతో ఆరోగ్యం..



మొలకలు సహజంగా పోషక విలువలు అధికంగా కలిగిన ఆహారం. గింజలు మొలకెత్తే సమయంలో వాటిలోని పోషకాలు సులభంగా జీర్ణమయ్యే రూపంలోకి మారుతాయి, అందుకే ఉదయం సమయంలో వాటిని తీసుకోవడం శరీరానికి అనుకూలంగా ఉంటుంది. ఉదయం తీసుకున్నప్పుడు జీర్ణక్రియ సజావుగా సాగుతుంది, ఎందుకంటే మొలకల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల పేగుల కదలికలు మెరుగుపడతాయి. దీని ఫలితంగా గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గి, మలబద్ధకం కూడా నియంత్రణలోకి వస్తుంది. అలాగే పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియా పెరగడానికి ఇవి సహాయపడతాయి. మొలకల్లో సహజ జీర్ణ ఎంజైములు, ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ 'సి'తోపాటు వివిధ ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల సాధారణ జలుబు, కాలానుగుణ ఫ్లూ వంటి ఇన్ఫె క్షన్ల నుంచి రక్షణ పొందే అవకాశం పెరుగుతుంది. మొలకలు శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, అలసట, నీరసం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయి. మొలకల్లో క్యాలరీలు తక్కువగా ఉండి, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇవి అనుకూలమైన ఆహారం. దీర్ఘకాలం తృప్తి భావాన్ని కలిగించి, అధికంగా తినే అలవాటును తగ్గిస్తాయి. మొలకల్లో ఉన్న విటమిన్ 'ఎ', 'సి', 'ఇ'లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచి, వృద్ధాప్య లక్షణాలను ఆలస్యంగా కనిపించేలా చేస్తాయి. జుట్టు ఆరోగ్యానికి కూడా మొలకలు ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను బలంగా చేసి, జుట్టు రాలడం తగ్గించడంలో సహాయపడతాయి. మొత్తం మీద, మొలకలను ప్రతిరోజూ అల్పాహారంలో భాగంగా తీసుకోవడం శరీరానికి సమగ్ర ఆరోగ్యాన్ని అందించే సులభమైన మరియు సహజమైన మార్గంగా పరిగణించవచ్చు.

## 'ఇన్సులిన్ రెసిస్టెన్స్'తో జాగ్రత్త

మన శరీరానికి అవసరమైన శక్తిలో ప్రధాన భాగం గ్లూకోస్ నుంచే లభిస్తుంది. ఆహారం ద్వారా వచ్చిన గ్లూకోస్ రక్తంలోకి చేరిన తర్వాత, దాన్ని కణాలు ఉపయోగించుకునేలా చేయడానికి ఇన్సులిన్ అనే హార్మోన్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే రక్తంలో చక్కెర స్థాయిలు దీర్ఘకాలం పాటు అధికంగా ఉంటే, కణాలు ఇన్సులిన్‌కు స్పందించడం తగ్గుతుంది. ఈ పరిస్థితినే ఇన్సులిన్ రెసిస్టెన్స్ అని పిలుస్తారు. ఇది మొదట చిన్న మార్పులా కనిపించినప్పటికీ, దీని ప్రభావం క్రమంగా తీవ్రమవుతుంది. గతంలో శాస్త్రవేత్తలు ఇన్సులిన్ రెసిస్టెన్స్ ప్రధానంగా కండరాలు, కాలేయానికి మాత్రమే పరిమితమని భావించారు. కానీ తాజా అధ్యయనాల ప్రకారం, ఈ ప్రభావం మెదడుపై కూడా పడుతుంది. మెదడు కణాలు, ముఖ్యంగా న్యూరాన్లు, తమ పని చేయడానికి నిరంతర శక్తి అవసరం ఉంటుంది. ఇన్సులిన్ సరిగ్గా పనిచేయకపోతే, గ్లూకోస్ ఈ కణాలకు సరైన స్థాయిలో అందదు. ఫలితంగా, అవి శక్తి కొరతను అనుభవిస్తాయి. ఈ పరిస్థితిని కొందరు పరిశోధకులు టైప్ 3 డయాబెటిస్‌గా పేర్కొంటున్నారు, అంటే మెదడులో జరిగే చక్కెర వినియోగ లోపం. ఈ సమస్య కొనసాగితే, దాని ప్రభావం మరింత విస్తరిస్తుంది. రక్తనాళాలు క్రమంగా దెబ్బతింటాయి, మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది, అలాగే దీర్ఘకాలిక వాపు పెరుగుతుంది. ఇవన్నీ కలిసి మెదడు పనితీరును దెబ్బతీస్తాయి. ఫలితంగా జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపం, ఆలోచనా వేగం మందగించడం వంటి సమస్యలు కనిపిస్తాయి. సమతుల్య ఆహారం, నియమిత వ్యాయామం, అవసరమైన ఔషధ చికిత్స ద్వారా మెటబాలిజాన్ని నియంత్రిస్తే, మెదడు పనితీరును కూడా దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. చివరికి, మెదడు చురుకుదనం, జ్ఞాపకశక్తి నిలకడగా ఉండాలంటే, శరీరంలోని శక్తి వినియోగ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం అత్యంత కీలకం.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

- 17 ఏళ్ల మైనర్ బాలికను అత్యాచారం చేసిన బండి భగీరథపై పోక్సో కేసు పెట్టాలి
- ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, ఇటీవల పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో 17 ఏళ్ల మైనర్ బాలికపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ మద్యం తాగించి కొన్నిసార్లు డ్రగ్స్ ఇచ్చి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు పెట్టడాని కి వెళ్తే కేసు పెట్టకుండా భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదా లక్ష్మి అన్నారు.
బండి సంజయ్ తన కుమారు న్నీ రక్షించు కొనే ప్రయ త్నం చేస్తూ కేసును నిరుగార్చే ప్రయత్నం చే స్తున్నారని, పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి భగీరథ్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని కాళోజీ నారాయణరావు విగ్రహం వద్ద ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేయడం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి, సదా లక్ష్మి మాట్లాడుతూ ఎగువ కులంలో ఉండి తండ్రి హోం సహాయ మంత్రిగా ఉండ దం వలన పోలీసు యంత్రాంగాన్ని, ప్రధాన మీడియాను మేనేజ్ చే స్తూ కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వెంటనే బండి సంజ య్ తన పదవికి రాజీనామా చేసి కేసును నిష్పక్షపాతంగా నమోదు కావడానికి అవకాశం ఉంటుందని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య హ నుమకొండ జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి, అధ్యక్షురాలు దీన, నాయకులు మాలోత్ మంగ, దుంపల రమ, వస్కులా సువర్ణ, సబి తా స్రవంతి, పద్మ సునీత, విజయ, పవిత్ర, మమత, సుకన్య, స్వరూ ప రాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులను గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ్మ

మే 25,26న ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఇండియన్ పీపుల్స్ థియటర్ అసోసియేషన్ అనుబంధమైన తెలంగాణ ప్రజానట్యమండలి రాష్ట్ర మహా సభలు మే 25,26 తేదిల్లో హైదరాబాద్‌లో జరుగనున్నాయని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరం దివారం ముగిసింది. ఈ సందర్భంగా పల్లె నర్సింహా కళాకారులకు పాటలు పాడటం, డప్పు కొట్టడం శిక్షణ ఇచ్చా రు. శిక్షణ ముగింపు సందర్భంగా పల్లె నర్సింహా మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది మేధావులు, రచయితలు,కవులు, కళాకారులు కలిసి ఇప్టా స్థాపించారని కార్మిక కర్షక, ప్రజాసమస్యలపై, వారి జీవన విధానాలపైనిరంతరం అధ్యయనం చేస్తూ అనేక రచనలు చేస్తున్నారని, పాటలు రాస్తున్నారని అన్నారు. కళాకారులు ఎంతో మంది ఉంటారు కాని ప్రజాకాళాకారులు కొంత మందే ఉంటారని అలాంటి కళాకారులు నిత్యం ప్రజల బాధలను చూసి వాటిని ప్రపం చానికి తెలియజేసేందుకు పాటలు పాడుతుంటారని, కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని పాడే కళాకారులే ప్రజానాట్యమండలి వారని అన్నారు. అలాంటి కళాకారులు నిత్యవిద్యార్థులుగా ఎన్నో విషయాలు తెలుసుకొని పాటలు రాస్తూ పాడాలని అందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని నర్సింహా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది కళాకారులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జానపద. యక్షగాన, బుర్రకథ, ఒగ్గు కథ, వీధి బాగోత కళాకారుల బ్రతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని ప్రభుత్వం వారిని గుర్తించాలని, అన్ని రంగాల కళా కారులను గుర్తించిన వారికి గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నర్సింహా కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కష్ట, సుఖాలను పాటల రూపంలో బయటకు తెచ్చి ఎంతో మందిని మెప్పించే అత్యంత బలమైన ఆయుధం పాట అని, గాయకుడు నాయకుడు అవుతాడు కాని.. నాయకుడు గాయకుడు కావడం చాలా కష్టమన్నారు. ఏ పోరాటాలు, ఉద్యమాలు,బహిరంగ సభలు విజయవంతం కావాలన్నా కళాకారులు ఉండాల్సిందేనని, కళాకారులుగా తయారయ్యే వారికి తోడ్పాటు అందించడం కోసం సిపిఐ జిల్లా సమితి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు.ఈ శిక్షణ శిబిరంలో ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కవ్వంపల్లి స్వామి,మాజీ జడ్పీటీసీ అందె స్వామి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మి నారాయణ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి దుద్దేల సమ్మయ్య,కళాకారులు లెనిన్, వరకోలు సదానందం,కోమల,సరిత,రమ, ఏ రాజయ్య, విజయ్,తిరుపతి, లక్ష్మి రాజం తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి గోపాల్ రావునగర్ కాలనీ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో అక్షర హాస్పిటల్ సహకారంతో చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ అక్షర హాస్పిటల్ చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం పేదలకు వరంగా ఉందన్నారు. వైద్య పరీక్షలు చేయడమే కాకుండా ఉచితంగా మందులను అందించడంతో పాటు హాస్పిటల్‌కు వచ్చిన ప్రతీ పేషెంట్‌కు ఓపీ ఫీజులు లేకుండా వైద్యం అందించడం డాక్టర్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరెన్నో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబలక్ష్మి , జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, కాలనీ శాఖ సహాయ కార్యదర్శి ఎండి.మహమూద్, ఆకుల రంజిత్, ఎర్రోజు పద్మ, అక్షర హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో ప్రజాస్వామ్యానికి బాసటగా నిలిచిన కమ్యూనిస్టులు

సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తమినాడులో ప్రజాస్వామానికి కమ్యూనిస్టులు బాసటగా నిలిచారని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్ మండల సిగ్గుటం గ్రామంలో మేడే సందర్భంగా జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో ఇటీవల నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి ఇందులో మిగతా మూడు రాష్ట్రాల కంటే తమిళనాడు రాష్ట్రంలో సిఎం ఎన్నిక అనేది ఆ రాష్ట్ర గవర్నర్ ఒంటెద్దు పోకట విధానాన్ని అవలంభిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రంలో విజయ్ దళపతి టివికే పార్టీతో ఆ రాష్ట్రంలో అధిక మెజార్టీ 108 స్థానాలను కైవసం చేసుకోవడం జరిగింది. అయినా ఆ రాష్ట్ర గవర్నర సిఎంగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఒప్పుకోకుండా మ్యాజిక్ ఫిగర్‌గా 118 సీట్లు వస్తేనే ప్రమాణ స్వీకారం చేయిస్తానని చెప్పడం ఆయన మూర్ఖత్వం. గతంలో అనేక రాష్ట్రాలలో మ్యాజిక్ ఫిగర్ లేకుండా మిగతా పార్టీల కన్నా ఎక్కువ స్థానాలు గెలుచుకున్న వారిని ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. తమిళనాడు రాష్ట్రంలో కమ్యూనిస్టులకు నాలుగు సీట్లు రావడం జరిగింది. విజయ్ దళపతికి సంపూర్ణమైన మద్దతు ప్రకటించి అతన్ని సిఎం చేయడానికి కమ్యూనిస్టులు ముందు వరుసలో నిలిచారు. అయితే కమ్యూనిస్టులకు రెండు మంత్రి పదవులు ఇస్తానని చెప్పి నా కమ్యూనిస్టులు మాకు మంత్ర పదవులు వద్దు, మేము సంపూర్ణమైన మద్దతు మాత్రం ఇవ్వగలుగుతామని చెప్పి విజేత దళపతికి వెన్నంటూ నిలవడం జరిగింది. కానీ విసికె పార్టీ మద్దతు ఇవ్వాలంటే మాకు డిప్యూటీ సిఎం కా వాలని డిమాండు చేస్తూ విజయ్ గెలిచిన రెండో స్థానాన్ని రాజీనామా చేస్తే ఆసీటు మాకు ఇవ్వాలని కోరుతూ మద్దతు ఇవ్వడానికి అంగీకరించింది. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు సింగోటం మాజీ సర్పంచ్ మండల్లా కృష్ణయ్య అలియాస్ లాలి పార్టీ సీనియర్ నాయకులు చింతకుంట నారాయణ శాఖ కార్యదర్శి చంద్రయ్య ప్రజానాట్యమండలి నా యకులు గోపాల్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను ప్రభుత్వాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయ్

ఎండిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఎండిఎం) ఆదిలాబాద్ జిల్లా మహాసభ ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు నాయకత్వంలో జరిగిన ఈ సభకు వివిధ మండలాల నుండి కార్మికులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు శ్రమ దోపిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వెంటనే రూ.10 వేల గౌరవ వేతనం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రైవేటీకరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్మికులకు యూనిఫాం, రూ.10 లక్షల ప్రమాద బీమా, వయసు పైబడిన వారికి రూ.5వేల పెన్షన్ కల్పించాలని కోరారు. జూన్ నాటికి వేతనాలు పెంచని పక్షంలో పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి జిల్లా వ్యాప్తంగా సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కుంటాల రాములు, కోశాధికారిగా ఉప్మాబాయి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీ , గంగామణి, శశికళ తదితరులు తెలిపారు.

# తెలంగాణకు ప్రధాని రైల్వే వరాలు

### రూ.9400 అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు శ్రీకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు భారీ రైల్వే వరాలు అందించారు. రూ.9,400 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని తెలంగాణ రైల్వే మౌలిక వసతుల బలోపేతానికి కీలకమైన కాజీపేట్–విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్ట్ భాగాలను, కాజీపేట్ రైల్ అండర్ రైల్ బైపాస్‌ను దేశానికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ దేశవ్యాప్తంగా కీలక రవాణా హబ్‌గా మరింత బలపడనుందని ప్రధాని పేర్కొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్ఐసి సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. సభను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కోట్ల లోపే రైల్వే బడ్జెట్ ఉండేదని, ప్రస్తుతం తెలంగాణకు ఏటా రూ.5,500 కోట్లకు పైగా కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు రూ.50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందే భారత్, ఆరు అమృత్ భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు.కాజీపేట్–విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాజీపేట్–వరంగల్, నెక్కొండ–మహబూబాబాద్, డోర్నకల్–ఎర్రుపాలెం మధ్య మొత్తం 118 కిలోమీటర్ల మేర మూడో లైన్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి.

ఇందుకు సుమారు రూ.1,243 కోట్లు ఖర్చు అయ్యింది. ఈ ప్రాజెక్టుతో ఉత్తర–దక్షిణ భారతాన్ని కలిపే గ్రాండ ట్రంక్ రూట్‌పై రద్దీ తగ్గడంతో పాటు సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. దీర్ఘదూర రైళ్ల ప్రయాణ సమయం తగ్గి సమయపాలన మెరుగుపడనుంది. అదేవిధంగా రూ.292 కోట్లతో నిర్మించిన 21 కిలోమీటర్ల కాజీపేట్ రైల్ అండర్ రైల్ బైపాస్‌ను కూడా ప్రధాని జాతికి అంకితం చేశారు. సికింద్రాబాద్, బాల్హర్షా, విజయవాడ దిశల మధ్య రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేయడానికి ఈ బైపాస్ ఉపయోగపడనుంది. దీంతో కాజీపేట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణిక మరియు సరుకు రైళ్ల నిర్వహణ వేగవంతం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు ఇది వికాస్ ఉత్సవ్ అని పేర్కొన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, రైల్వేలు, రోడ్లు, టెక్స్టైల్స్, లాజిస్టిక్స్ రంగాల్లో భారీ ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారని చెప్పారు. వరంగల్ రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, 40 అమృత్ స్టేషన్ల అభివృద్ధి, సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# కేంద్ర మంత్రి అయితే చట్టం వర్తించదా..?

### బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలంటూ డిజిపి కార్యాలయాన్ని ముట్టడించిన బిఆర్ఎస్‌వి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం బిఆర్ఎస్‌వి కార్యకర్తలు డిజిపి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. భారతీయ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని కేంద్ర మంత్రి అయితే చట్టం వర్తించదా?, బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి, బాధితురాలికి న్యాయం చేయాలి అంటూ నినాదాలు చేశారు. డిజిపి కార్యాలయం ఎదుట కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులు కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు కార్యకర్తలు రోడ్డుపై కూర్చుని ధర్నా కొనసాగించారు. బిఆర్‌ఎస్‌వి నాయకులు మాట్లాడుతూ.. సామాన్యులపై వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, అధికార పార్టీలకు లేదా కేంద్ర మంత్రుల కుటుంబ సభ్యులకు సంబంధించిన కేసుల్లో మాత్రం ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. పోక్సో వంటి తీవ్రమైన కేసులో ఎవరైనా చట్టం ముందు సమానమేనని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పటికే వివిధ విద్యార్థి, మహిళా సంఘాలు కూడా ఈ ఘటనపై స్పందిస్తున్నాయి. బాధితురాలికి న్యాయం చేయాలని, కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగాలని డిమాండ్లు పెరుగుతున్నాయి.పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని కొంత మంది నిరసనకారులను అక్కడి నుంచి తరలించినట్టు సమాచారం. ఈ ఘటనతో డిజిపి కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

#### బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

##### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్

భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారూపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. బండి భగీరథ్ 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారం చేశాడని ఆరోపించారు. బాధిత యువతి కుటుంబానికి రక్షణ కల్పించాలని, సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. చట్టం ముందు అందరూ సమానులేనని, రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. బిజెపి మహిళా భద్రతపై మాటలు చెప్పడమే తప్ప, వాస్తవాల్లో అమలు చేయడం లేదని విమర్శించారు. సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే సామాజిక, విద్యార్థి, మహిళా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

'వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026' ర్యాంకింగ్స్ జాబితాలో...

# యశోద హాస్పిటల్స్ గ్రూప్ కు అగ్రస్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యశోద హాస్పిటల్స్ గ్రూప్ హైదరాబాద్ ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ 'న్యూస్ వీక్', 'స్టాటిస్టా' ఆధ్వర్యంలో ప్రకటించిన 'వరల్డ్స్‌బెస్ట్ హాస్పిటల్స్ 2026' ర్యాంకింగ్స్ జాబితాలో ప్రముఖ స్థానం సంపాదించింది. భారతదేశంలోని అత్యుత్తమ ఆసుపత్రులలో ఒకటిగా ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకుంది.ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును యశోద హాస్పిటల్స్ గ్రూప్ వరుసగా 8వ సంవత్సరం కూడా సాధించడం ద్వారా ఆరోగ్యరంగ సేవలలో తమ నిబద్ధత, నాణ్యతా ప్రమాణాలు, విశ్వసనీయతను మరోసారి నిరూపించించుకుంది. 2026 సంవత్సరానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా 2,780 ఆసుపత్రులను విశ్లేషించి ఈ ర్యాంకింగ్స్‌ను రూపొందించారు. ఇందులో వైద్య సేవల నాణ్యత, రోగుల అనుభవం, ఆధునిక వైద్య సాంకేతికత, క్లినికల్ ప్రతిభ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో యశోద హాస్పిటల్స్ గ్రూప్ ప్రముఖ స్థానం పొందడం, భారతీయ ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల వైద్య రంగంలో యశోద హాస్పిటల్స్ గ్రూప్ సాధించిన ప్రపంచస్థాయి విశిష్టతను, గౌరవాన్ని ప్రతిబింబించింది.ప్రత్యేకంగా, వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026 జాబితాలో తెలుగు రాష్ట్రాల నుండి కేవలం 7 ఆసుపత్రులు మాత్రమే చోటు దక్కించుకోగా, అందులో యశోద హాస్పిటల్స్ గ్రూప్ కు చెందిన సోమాజిగూడ, సికింద్రాబాద్ మరియు మలక్ పేట్ యశోద మూడు ఆసుపత్రులు, భారతదేశంలోని టాప్ 100 అత్యుత్తమ ఆసుపత్రులు, ప్రపంచ ది బెస్ట్, అత్యుత్తమ ఆసుపత్రుల జాబితాలో ప్రముఖ స్థానం సంపాదించడం విశేషమే కాకుండా, తెలుగు రాష్ట్రాల కు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ శ్రీ గోరుకంటి రవీందర్ రావు మాట్లాడుతూ ఈ గుర్తింపు ద్వారా యశోద హాస్పిటల్స్ ప్రపంచస్థాయి ఆరోగ్య సేవలను అందించే విశ్వసనీయ భారతీయ ఆరోగ్యసంస్థగా మరోసారి నిలవడం సంతోషదాయకం అన్నారు. ఈ గుర్తింపు మా నిరంతర కృషికి, ప్రపంచ స్థాయి వైద్యసేవలను భారత దేశ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న యాజమాన్యం అంకితభావానికి నిదర్శనం అన్నారు. వరుసగా 8వ సంవత్సరం ఈ అత్యున్నత గౌరవం దక్కడం మా వైద్య బృందం, సిబ్బంది ముఖ్యంగా తెలుగు రాష్ట్రల ప్రజలందరికీ ఎంతో గర్వకారణం అన్నారు. ఆధునిక సాంకేతికత, అత్యుత్తమ వైద్యనిపుణుల వైద్యసేవలు, మానవతా దృక్పథంతో రోగుల ఆరోగ్య ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు యాజమాన్యం నిరంతరం కృషి చేస్తూనే ఉంటోందన్నారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ ఎల్లవేళలా అత్యుత్తమ ప్రపంచ స్థాయి వైద్య సేవలు ప్రజలకు అందించడంపైనే ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది అంకితభావం, కోట్లాది రోగుల అపార విశ్వాసం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని రవీందర్‌రావు వివరించారు.

## నూతన ఆదాయ పన్ను చట్టంపై 'ప్రారంభ్ 2026' మెగా అవుట్ రీచ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన ఆదాయ పన్ను చట్టం 2025 పై అవగాహన కార్యక్రమం 'ప్రారంభ్ 2026' మెగా అవుట్ రీచ్‌ను బంజారాహిల్స్‌లోని అమరావతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిబిడిటి సభ్యులు సంజయ్ బహదూర్, ప్రత్యేక అతిథిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రధాన ఆదాయ పన్ను కమిషనర్ సురేష్ బత్తిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ బహదూర్ మాట్లాడుతూ నూతన ఆదాయ పన్ను చట్టం పన్ను చెల్లింపుదారులకు మరింత అనుకూలంగా ఉండేలా, సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించబడిందన్నారు. సురేష్ బత్తిని మాట్లాడుతూ నవీకరించిన పోర్టల్ సేవలు, చాట్‌బాట్ సదుపాయాల ద్వారా సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ వేములు, రాందేవ్ బుట్టడా కుమార్ కోట, ఆశిష్ జోషి, పి.వి. నారాయణ రావు, సోమేశ్వర్, బొజ్జ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటనపై పోలీసుల ట్రయల్ రన్.. ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్రమోది పర్యటన నేపథ్యంలో పోలీసులు నిర్వహించిన ట్రయల్ రన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఘటన నగరంలో చర్చనీయాంశంగా మారింది. బంజారాహిల్స్ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు సంబంధించి భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు, కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే అదే సమయంలో చంద్రబాబు కాన్వాయ్ కూడా అదే మార్గంలో రావడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, సమాచారంలోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ట్రాఫిక్ తీవ్రంగా ఉండటంతో చంద్రబాబు కాన్వాయ్ సుమారు 15 నిమిషాల పాటు ముందుకు కదలలేకపోయింది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్ క్లియర్ చేసే ప్రయత్నాలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు వాహనాలను మళ్లించి కాన్వాయ్‌ను ముందుకు పంపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు తన వాహనం నుంచి కిందకు దిగినట్లు కూడా సమాచారం వెలువడింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. సమాచార లోపం వల్లనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుంది.

# విఐపిల పిల్లలపై లైంగిక ఆరోపణలు

### చోటుచేసుకున్న వరుస ఉదంతాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులపై లైంగిక వేధింపులు, మహిళలపై దాడులు, పోక్సో ఆరోపణలు వంటి కేసులు గతంలో కూడా సంచలనం రేపాయి. తాజాగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు మరోసారి చర్చకు వస్తున్నాయి. కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధుల కుమారులు, అనుచరులపై యువతులను వేధించడం, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు, పార్టీలు నిర్వహించి అసభ్య ప్రవర్తన చేసినట్లు కేసులు నమోదైన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో పోలీసులు సాధారణంగా భారతీయ న్యాయ సంహిత , పోక్సో చట్టం, మహిళల రక్షణకు సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తుంటారు. అయితే కేసులు నమోదు కావడం ఒక దశ మాత్రమేనని, దర్యాప్తు పూర్తై కోర్టులో నిరూపితమయ్యే వరకు ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం బండి సంజయ్ కుమార్ కుమారుడిపై నమోదైన కేసు కూడా రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు–ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో గతంలో కూడా పలువురు విఐపి కుటుంబాలకు చెందిన యువకులపై లైంగిక వేధింపులు, పోక్సో, అత్యాచారం ఆరోపణల కేసులు నమోదై రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో జరిగిన కొన్ని ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి.

**జూబ్లీహిల్స్ గ్యాంగ్‌రేప్ కేసు..**2022లో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో జరిగిన మైనర్ బాలిక గ్యాంగ్‌రేప్ కేసు దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ కేసులో ఒక ప్రముఖ రాజకీయ నేత, ఎంఎల్‌ఎ కుమారుడు సహా పలువురు ప్రముఖుల కుటుంబాలకు చెందిన మైనర్లు నిందితులుగా బయటకు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఫామ్‌హౌజ్ పార్టీ కేసులు..**హైదరాబాద్ శివార్లలోని ఫామ్ హౌజ్‌లు, రిసార్టుల్లో జరిగిన ప్రైవేట్ పార్టీల్లో మైనర్ బాలికలతో అసభ్య ప్రవర్తన, మద్యం సరఫరా, వేధింపుల ఆరోపణలపై పలు కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసుల్లో రాజకీయ నాయకుల బంధువులు, వ్యాపారవేత్తల పిల్లల పేర్లు బయటకు రావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు నిర్వహించారు.

**సోషల్ మీడియా వేధింపుల కేసులు..**
కొంతమంది కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల కుటుంబాలకు చెందిన యువకులపై సోషల్ మీడియా ద్వారా మైనర్ బాలికలను వేధించడం, ఫోటోలు వైరల్ చేస్తామంటూ బెదిరించడం వంటి ఆరోపణలతో కూడా కేసులు నమోదయ్యాయి. కొన్ని ఘటనల్లో పోక్సో చట్టం వర్తింపజేశారు.

**తాజా రాజకీయ చర్చ..**ఇప్పటికే బండి సంజయ్‌కుమార్ కుమారుడిపై నమోదైన కేసు నేపథ్యంలో, గతంలో వెలుగులోకి వచ్చిన ఇలాంటి ఘటనలు మరోసారి చర్చకు వస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటుండగా, మహిళా సంఘాలు మాత్రం ప్రభావశీలులపై వచ్చిన కేసుల్లో పారదర్శక దర్యాప్తు జరగాలని డిమాండ్ చేస్తున్నాయి.అయితే ఈ కేసుల్లో చాలావరకు విచారణ దశలోనే ఉన్నాయని, కోర్టులో నేరం నిరూపితమయ్యేవరకు ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

**పిల్లలపై దృష్టి పెట్టాలి..**సమాజంలో పేరు ప్రఖ్యాతలు కలిగిన వ్యక్తులు తమ పిల్లలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పిల్లలు ఎలాంటి పొరపాట్లు చేసిన వాటి ప్రభావంతో సమాజంలో తల దించుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి.ప్రజా సేవలో నిమగ్నమైన ప్రజా ప్రతినిధులు తమ సొంత పిల్లల అలవాట్లు, నగవడికపై ఒక కంట కనిపెట్టాల్సిందే.

## కేంద్రం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 12 సంవత్సరాల్లో కేంద్రం నుంచి తెలంగాణకు ఎంత మేర నిధులు తీసుకొచ్చారో బిజెపి ఎంపిలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన బిజెపి, తరువాత ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, నిధుల కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇస్తూ, తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటిఎం సెంటర్‌గా అభివర్ణిస్తూ, కెసిఆర్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేసిన ప్రధాని మోదీ, ఆ ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగనివ్వడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం విచారణ కోరినా కేంద్రం స్పందించలేదని చెప్పారు.

# రొక్కం రాక రైతుకు దుఃఖం


### కొందామంటే కొరివి.. అమ్ముదామంటే అడవి
### రైతుల బాధలు పట్టించుకునే నాథుడు ఎడీ?
### పండించిన పంట చేలల్లోనే

**ప్రజాపక్షం/ములుగు:** దేశానికి రైతే వెన్నుముక అని ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతుకు రొక్కం లేక దుఃఖం వచ్చే విధంగా ప్రభుత్వాలు చేస్తున్నాయని రైతులు అంటున్నారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట ఇప్పటి వరకు కూడా ఎగుమతి కాక రైతులు చాలా ఇబ్బందులు పడుతన్నారు. సాయంత్రమైతే చాలా మబ్బులు కమ్ముకొచ్చి ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. వర్షం పడే సమయంలో రైతు అందుబాటులో ఉండినా రైతు వరి ధాన్యంపై మొక్కజొన్నపై పర్దాలు కప్పుతున్నారు. అందుబాటులో లేని రైతు టార్పాలిన్‌లు కప్పలేక ఇబ్బంది పడుతన్నారు. వర్షానికి ధాన్యం తడుస్తుంది. తడిచే ధాన్యాన్ని మరల ఆరబెట్టాలంటే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలా పడ్డ వర్షానికి ధాన్యం తడుస్తూ ఉంటుంది. తడిచే ధాన్యాన్ని మరల అరబెట్టాలంటే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి రైతులను కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకునేది ఎప్పుడు రైతు సొంతంగా పండించిన పంట క ఊడా సొంతంగా అమ్ముకునే హక్కు కూడా కోల్పోతున్నారు. అందువలన రైతు అప్పులపాలై పురుగు మందు తాగి రైతులు మృతి చెందుతున్నారు. ఇలా జరిగినప్పటికీ కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై ఎలాంటి న్యాయం చేయడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించే రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించే పంటకు కూడా ప్రభుత్వ అధికారుల వద్ద పండించిన పంటపై రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పినా అధికారులు తెలుసుకున్న రైతు మాత్రం ఏ పంట వేశాడో ఆ పంటకు రిజిస్ట్రేషన్ చేయించారు. తెలియని రైతు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేక ఇప్పుడు పండించిన పంట అమ్ముకునే హక్కు లేకుండా పోయింది. ఎందుకంటే రైతు పండించిన పంట రిజిస్ట్రేషన్ చేయాలని లేని పక్షంలో ఆ పంటను మేము అమ్మలేమని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి నిబంధనలు ఏ ప్రభుత్వంలో లేదని ఈ ప్రభుత్వంలోనే కొత్తగా వచ్చిందని రైతులు అంటున్నారు. ఇలా అయితే రైతు దేశానికి వెన్నుముక ఎలా అవుతాయని, రైతు రాజు అయ్యేది ఎప్పుడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు పండించే పంటకు సొంత హక్కు కలిగించాలని ఏ పంట అయినా రిజిస్ట్రేషన్ లేకుండా అమ్ముకునే విధంగా చేయాలని మిల్లుల వద్ద ఎలాంటి కటింగ్ లేకుండా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కంటింగ్ లేకుండా చూడాలని రైతులు అంటున్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పండించిన పంటకు సొంతంగా అమ్ముకునే ధానికి హక్కు లేకుండా చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని రైతులు అంటున్నారు.

# కీలక ప్రాజెక్టులతో ఓరుగల్లుకు మహర్దశ

### బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా కాకతీయ మెగా టెక్ స్టైల్
### కాజీపేట - విజయ వాడ మార్గంలో మల్టీ ట్రాకింగ్
### హైదరాబాద్ నుండి వర్చువల్ గా ప్రారంభించిన మోదీ





**ప్రజాపక్షం/హనుమకొండ:** ఓరుగల్లు అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. పారిశ్రామిక, రైల్వే రంగాల్లో భారీ ప్రాజెక్టులతో ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి కొత్త ఊపు వస్తున్నది. ఒకవైపు పీఎం మిత్ర పథకంలో భాగంగా కాకతీయ మెగా టెక్ స్టైల్ పార్కు ను బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తుండగా, మరోవైపు ఉత్తర, దక్షిణ భార తానికి కేంద్రంగా ఉన్న కాజీపేట జంక్షన్ కు రైల్వే కనెక్టివిటీ పెరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే టెక్ స్టైల్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం రూ. 200కోట్లు తొలిదశ నిధులు విడుదల చేసింది. ఇదే సమయంలో కాజీపేట విజయ వాడ మార్గంలో మల్టీ ట్రాకింగ్ పనులు, కాజీపేట రైల్ అండర్ రైల్ బైపాస్ పూర్తి కావటంతో సరుకుల రవాణాతో పాటు ప్రయాణీకుల రాకపోకలు వేగవంతం కా నున్నాయి. ఈ కీలకమైన ప్రాజెక్టులకు ఆది వారం హైదరాబాద్ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్ గా ప్రారంభించారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో చేపట్టిన కాకతీయ మెగా టెక్ స్టైల్ పార్కు ను ఆదివారం వర్చువల్గా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. 2016 కాజీపేట విజయవాడ మార్గంలో కొత్తగా నిర్మించి మూడో రైల్వేలైన్‌లో కాకతీయ టెక్ స్టైల్ పార్కు కోసం గీసుకొండ మండలంలో 1,337 ఎకరాల భూసేకరణ చేపట్టారు. 2017లో టెక్స్టైల్ పార్కుకు శంకుస్థాపన చేశారు. అయితే 21 కంపెనీలు ఎంవోయూ కుదుర్చుకున్నప్పటి కి, కేవలం రెండు కంపెనీలు మాత్రమే ప్రాజెక్టులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. లక్ష మందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయని అప్పట్లో ప్రచారం చేశారు. అయితే టెక్ స్టైల్ పార్కు పనుల్లో జాప్యంతో ఉద్యోగాలు లేవు.. కంపెనీల జాడ లేకుండా పోయింది. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్ స్టైల్ పార్కుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పీఎం మిత్ర పథకంలో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కును చేర్చాలని ప్రధా నమంత్రి నరేంద్రమోడీకి సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. దీంతో గత ఏడాది పీఎం మిత్ర పథకంలో బ్రౌన్ ఫీల్డ్ కేటగిరిలో మెందుకు వెళ్లేలా ప్రోత్సహించింది.

**కాకతీయ టెక్స్ టైల్ కేంద్రం ఎంపిక**

కాకతీయ టెక్ స్టైల్ పార్కును కేంద్రం ప్రభుత్వం ఎంపిక చేసింది. తొలివిడతలో రూ.200కోట్ల నిధులను కేటాయించింది. పార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్ అనే ఐదు సూత్రాల ఆధారంగా ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1,695.54కో ట్లతో పార్కులో మౌళిక సదుపాయాలు కల్పించారు. ఇందులో అంతర్గత రహదారులు, విద్యుత్ సబ్ స్టేషన్లు, 220కేవీ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, 12ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణ కోసం జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జడీఎల్డీ) పద్ధతిలో పని చేసే 5ఎంఎల్డీ కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను కూడా సిద్ధం చేశారు. అలాగే కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు ద్వారా 24,400మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకా శాలు కల్పించాలని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ప్రస్తుతం గణేష్ ఎకో, యంగ్వన్ వంటి కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభిం చగా, సుమారు 2వేల మందికి ఉపాధి లభిస్తుంది. అలాగే కైటెక్స్ సంస్థ కూడా తన కార్యాకలాపాలను ప్రారంభించనుంది.ఇప్పటి వరకు రూ.3,842కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తు ఇవి రూ.6వేల కోట్లకు చేరుతాయని ప్రభుత్వం అంచనా వేస్తు న్నది. కాకతీయ టెక్ స్టైల్ పార్కు పనులు పూర్తికావటంతో ఆదివారం ప్రధానమంత్రి చేతుల మీదుగా వర్చువల్ గా ప్రారంభించారు.

**విస్తరించనున్న రైల్వే కనెక్టివిటీ..**

ఉత్తర, దక్షిణ భారతానికి కేంద్రంగా ఉన్న కాజీపేట జంక్షన్ కు రైల్వే కనెక్టివిటీ విస్తరిస్తున్నది. ప్రధానంగా కాజీపేట విజ యవాడ మార్గంలో రైల్వే ట్రాఫిక్ పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ లైన్ విస్తరణకు దృష్టి పెట్టింది. కాజిపేట నుంచి విజయవాడకు రూ.1,243 కోట్ల వ్యయంతో 118కిలో మీటర్ల మేర మూడో లైన్ నిర్మాణం పూర్తి చేశారు. మల్టీ ట్రాకింగ్, విద్యుదీకరణతో ఆధునీకరించారు. కాజీపేట వరంగల్, నెక్కొండ మహబూబాబాద్, డోర్నకల్ ఎర్రుపాలెం వరకు రైల్వే సామ ర్థ్యాన్ని పెంచేందుకు విస్తరణ చేపట్టారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే ఈ రైలు మార్గంలో ఆటంకాలు లేకుండా రవా ణా, ప్యాసింజర్ రైళ్లు వెళ్లవచ్చు. బొగ్గు, సిమెంట్, ఇతర నిత్యా వసర వస్తువుల రవాణాకు ఈ లైన్ కీలకమైనది. అలాగే కాజీపేట సమీపంలో రూ.240కోట్ల వ్యయంలో రైల్ అండర్ రైల్ (ఆర్ యూఆర్) బైపాస్ ప్రాజెక్టు 21కిలో మీటర్ల మేర నిర్మాణం పూర్తి చేశారు. హసన్ పర్తి రోడ్ కాజీపేట స్టేషన్ల మధ్య ప్రధాన కనెక్షన్ గా పని చేస్తుంది. అండర్ రైల్ సొరంగం కోమటిపల్లి నుంచి వడ్డేపల్లి చెరువు వరకు భూమి లోపల సుమారు 340మీటర్లు పొడవైన సొరంగ మార్గాన్ని నిర్మించారు. భూమి పై నుంచి 4050 అడుగుల లోతులో ఈ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ బైపాస్ ద్వారా సికింద్రాబాద్, బల్ల ర్షా (డిల్లీ వైపు), విజయవాడ వైపు వెళ్లే రైళను ఒకదానికి మరొ కటి అడ్డు లేకుండా సాఫీగా వెళ్లనున్నాయి. ఈ కీలకమైన రెండు రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆది వారం హైదరాబాద్ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు.

## జిల్లాలో 3.99 లక్షల మెట్రిక్ టన్నుల రబీ ధాన్యం కొనుగోలు

రూ. 954.63 కోట్లు చెల్లింపు: కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 954.63 కోట్ల రూపాయల విలువైన 3 లక్షల 99,593 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.ఇప్పటివరకు 6 లక్షల 59 వేల 596 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా,కొనుగోలు చేసిన 3 లక్షల 97,616 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు చెప్పారు. 644 కోట్ల విలువైన 2 లక్షల 69 వేల 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేసినట్లు వెల్లడించారు.ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపుల్లో భాగంగా 30 వేల 167 మంది రైతులకు 558.94 కోట్ల రూపాయలు చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు.రబీ ధాన్యం కొనుగోలుపై ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో కేంద్రం నిర్వాహకులు,మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నామని, సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా,కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.లారీలు,హమాలీ,ధాన్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## ఇంటివద్దే పోలీసు సేవలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బాధితుల ఇంటి వద్ద నుండే కేసు నమోదు, ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ పటిష్టంగా ముందుకు తీసుకెళ్తూ బాధితులకు ఇంటి వద్దే పోలీసు సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే వేగంగా సంఘటనా స్థలానికి బాధితుల ఇంటికి సంబంధిత పోలీసు అధికారులు చేరుకొని పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గడిచిన వారం రోజులుగా బాధితుల ఇంటి నుండి 111 కేసులు నమోదు చేసి బాధితులకు సేవలు అందించడం జరిగిందని తెలిపారు. మహిళల, బాలల, వృద్ధులపట్ల అకృత్యాలు జరిగినప్పుడు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, వ్యక్తులపై భౌతిక దాడులు జరిగినప్పుడు, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి, విద్యాసంస్థల్లో ర్యాగింగ్, బాల్య వివాహాలు జరిగే సమయంలో సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇంటి వద్ద లేదా వారికి అనుకూలమైన ప్రదేశంలో ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి కేసు పత్రాన్ని బాధితులకు అందజేస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమస్యలపై డయల్ 100, ఫోన్ ద్వారా సమాచారం అందించి పోలీసు స్టేషన్‌కు రావల్సిన అవసరం లేకుండానే కేసులు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఇకపై ప్రతి సోమవారం ఆర్‌డిఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్‌డిఓలను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి సోమవారం ఆర్‌డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/అనంతగిరి:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆదివారం అనంతగిరి మండల లబ్ధిదారులకు 40 చెక్కులు సుమారు 14 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఒక వరమని ముఖ్యంగా వైద్య ఖర్చుల అత్యవసర పరిస్థితుల్లో ఈ సహాయం ప్రజలకు ఒక వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి, మొగలాయికోట సర్పంచ్ రాఘవరెడ్డి, గోండ్రియాల పిఎసిఎస్ చైర్మన్ బుర్ర నర్సింహారెడ్డి, మాజీ ఎంపిపి చుండూరు వెంకటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, షేక్ దస్తగిరి, కనగాల వీరయ్య, జొన్నలగడ్డ వీరయ్య, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, మహిళ అధ్యక్షురాలు ఖాజాబీ, బాబురావు, నెల్లూరి వినయ్ పాల్గొన్నారు.

## కార్మికుల పోరాట ఫలితమే మేడే

**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** కార్మికుల పోరాట ఫలితమే మేడే దినోత్సవమని, కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని నర్సాపురంలో సిపిఐ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ శ్రామికుల త్యాగాలకు గుర్తుగా మేడే జరుపుకుంటున్నామని, 1886 మే 1న చికాగో హే మార్కెట్ పోరాటంలో అమరులైన కార్మికుల త్యాగమే ఇందుకు స్ఫూర్తి అని అన్నారు. నాటి పోరాటంతో 18 గంటల పని దినం 8 గంటలకు తగ్గిందని గుర్తు చేశారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల పక్షాన నిలిచి 12 గంటల పని దినానికి కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తెస్తున్నారని ఆరోపించారు.ఈచట్టాలు ఉపసంహరించుకునే వరకు సిపిఐ ఉధృత పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నేత గజ్జల లక్ష్మి నరసింహ రెడ్డి,గ్రామ కార్యదర్శి ధనావత్ బుజ్జి,సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, నాయకులు జమ్ముల కోటయ్య,శుద్ధమైన రాములు,లక్ష్మయ్య,రవి నాయక్ పాల్గొన్నారు



# ‘మెగా జాబ్ మేళా’.. నిరుద్యోగ యువతకు వరం!

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

కుంభం ఫౌండేషన్, ఐబిఎం స్కిల్స్ బిల్ ఆధ్వర్యంలో భారీ ఉపాధి వేదిక

వందలాదిగా తరలివచ్చిన నిరుద్యోగ యువత




**ప్రజాపక్షం/యాదాద్రి :** స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్లో నిర్వహించిన 'మెగా జాబ్ మేళా' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఆదివారం జరిగింది. కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి అధ్యక్షతన, ఐబిఎం స్కిల్స్ బిల్ 1 మిలియన్ 1 బిలియన్ సంస్థల సహకారంతో ఈ మేళాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించగా, గౌరవ అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**నైపుణ్యాలే విజయానికి సోపానాలు: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కేవలం డిగ్రీలతో సరిపెట్టుకోకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తోందని, గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**అంతర్జాతీయ స్థాయి అవకాశాలు: ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

ముఖ్య అతిథి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఐబిఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి కంపెనీలలో ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కుంభం ఫౌండేషన్ చేస్తున్న ఈ కృషి నిరుద్యోగులకు వరం లాంటిదని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

**సొంత గడ్డపైనే ఉపాధి కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**

కుంభం ఫౌండేషన్ అధినేత, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి, మన ప్రాంత యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.

**వందలాదిగా తరలివచ్చిన అభ్యర్థులు:** ఈ జాబ్ మేళాకు యాదాద్రి భువనగిరి జిల్లా నలు మూలల నుండి వందలాది మంది నిరుద్యోగులు తరలివచ్చారు. వివిధ బహుళజాతి సంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కుంభం ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్ల శ్రీ వాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆవేస్ చిస్తి, నాగరాజు, కృష్ణారెడ్డి, ఐ బి ఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కులగణనపై మోదీ మౌనం దేనికో?

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

పెద్ద బీసీ నేత అని చెప్పుకుంటు-న్నారు.. మరి రిజర్వేషన్ల బిల్లు ఎందుకు ఆపారు?



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను స్వాగతిస్తున్నామని చెబుతూనే, రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ అంశాలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రధానిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విభజన హామీల అమలులో కేంద్రం చూపుతున్న వివక్షను, సామాజిక రిజర్వేషన్ల పట్ల మోదీ సర్కార్ అవలంబిస్తున్న వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. నరేంద్ర మోదీని పెద్ద బీసీ నాయకుడిగా బీజేపీ ప్రచారం చేసుకుంటోందని, కానీ బీసీల ప్రయోజనాల విషయానికి వస్తే కేంద్రం వెనుకడుగు వేస్తోందని ఎంపీ విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేసి, ఆర్డినెన్స్ ఇచ్చినప్పటికీ కేంద్రం వద్ద బీసీ బిల్లు ఎందుకు పెండింగ్లో ఉందని ఆయన నిలదీశారు. ‘తెలంగాణ బీసీ బిడ్డలకు మోదీ సమాధానం చెప్పాలి.. జనగణనలో కులగణన కాలమ్ను ఎందుకు చేర్చడం లేదు?‘ అని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లపై ఇండియా కూటమిని విమర్శించడం మానుకుని, 2026 జనాభా లెక్కల వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విభజన హామీలపై 'స్పష్టత' ఇవ్వాలి

రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని చామల విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రధాని ఈ పర్యటనలో స్పష్టత ఇవ్వాలని, భద్రాచలం వద్ద ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపే అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్తోందని, ఈ క్రమంలో కేంద్రం తన వంతు సహకారం అందించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లుగా మార్చాలన్న ప్రధాని లక్ష్యం మంచిదే అని, అదే సమయంలో తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యానికి కేంద్రం అండగా నిలవాలని ఎంపీ కోరారు. ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీ వెళ్లి ట్రిపుల్ ఆర్ , ఫ్యూచర్ సిటీ, మెట్రో ఫేజ్2, మూసీ పునరుజ్జీవం వంటి ప్రాజెక్టుల గురించి విన్నవించినా కేంద్రం నుండి ఆశించిన స్పందన లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని చెబుతూనే, రాష్ట్ర హక్కుల విషయంలో రాజీపడేది లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సొసైటీ ఒకరిది... మధ్య దళారి మరొకరు



**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలో మత్స్యసొసైటి ఒకరిది మధ్య దళారి మరొకరులా చలామణి అవుతున్న తీరుతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సొసైటీలో ఉన్న సభ్యులందరిని తప్పుదోవ పట్టించి అధికార పార్టీ అండతో కొందరి సలహాలు పాటించి గడిచిన రెండు సంవత్సరాల నుండి గ్రామంలోని మూడు చెరువులలో ప్రభుత్వం ఇచ్చిన చేప పిల్లలు చెరువులో పోసిన వాటిని ప్రతి సంవత్సరం రాత్రి వేల పట్టుకొని ఊరులో ఎవరికి చేపలు ఇవ్వకుండా ట్రాక్టర్లతో బయటకు పంపి అధిక ధరలకు విక్రయం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది కూడా గ్రామంలోని వారికి అధిక ధరలకు చేపలు అమ్మడం జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. సొసైటీ సభ్యులకు కనీసం రెండు కిలోలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాల క్రితం పూర్తి సొసైటి సభ్యులందరు గ్రామంలో పెద్దలందరి నిర్ణయం మేరకు రూ.80గా ధర నిర్ణయం చేసి గ్రామంలో ప్రతి ఇంటికి రెండు నుంచి 5 కిలోల చేపలు ఇవ్వడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల రెండు చెరువులలో చేపలు పట్టి ప్రతి కెజికి రూ.120లు తీసుకున్నారని గ్రామ పంచాయితీ పాలకవర్గం గ్రామంలో ఉన్న చెరువులోని చేపలు ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని వాటిని ఒక్కరు తనకు నచ్చిన పద్ధతిలో చేపలు అమ్మడం ఏమిటని ఆగ్రహించిడంతో సొసైటి నుంచి కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి ధరను రూ.80కి అమ్మాలని సూచించగా అట్టి ధరను బేఖాతరు చేసి రూ.100కు అమ్మకం జరిపారని కొందరు తెలియజేశారు. సంబంధిత సొసైటీ ఒకరు ఇద్దరు సభ్యులు కొంతమందిని పోగు చేసుకొని గ్రామంలో చేపలు చెరువులు గతంలో లూటీ చేసి గ్రామంలో భయభ్రాంతులకు గురిచేయడంతో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ తరుణంలో గ్రామంలో హింసాత్మక చర్యలకు తావులేకుండా చేపలు పట్టాలని పలువురు పెద్దల సమక్షంలో రెండు వర్గాలు చర్చించుకోవడం జరిగిందని అయినా గ్రామ ప్రజలకు చేపలు ఇవ్వకుండా రాత్రి వేళల్లో పట్టుకొని దొంగ చాటుగా అమ్మకాలు జరుపుతున్నారని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని పోలీసు స్టేషన్ ముందే తీసుకున్న బయటి వ్యాపారులకు ముందే అమ్ముకొని గ్రామ ప్రజలకు చేపలు లేవని చెప్పడంతో నిరాశతో డబ్బులు వాపస్ తీసుకొని చేసేది లేక వెనుతిరిగారు. మధ్య దళారితో కాకుండా సొసైటి ఆధ్వర్యంలో చేపలు పోయించి సొసైటీ వారితో చేపలు పట్టించి పాత పద్ధతిలో గ్రామ ప్రజలందరికి చేపలు అందించాలని అధికారులను కోరుతున్నారు.

## చీకట్లో సాగర్ ఎర్త్ డ్యాం...!

భద్రతపై ఆందోళన..!



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత విషయంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన ఎర్త్ డ్యాం ప్రస్తుతం రాత్రి వేళల్లో అంధకారంలో మగ్గుతోంది. కట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడం తో రక్షణ వ్యవస్థ సమర్థతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అంధకారంలో కీలక ప్రాంతం**

ప్రాజెక్టు రక్షణలో ఎర్త్ డ్యాం పాత్ర ఎంతో కీలకమైనది. అయితే, ఈ కట్టపై ఏర్పాటు చేసిన వీధి దీపాల్లో అధిక భాగం పనిచేయడం లేదు. అక్కడక్కడా కొన్ని దీపాలు మాత్రమే వెలుగుతుండటంతో రాత్రివేళల్లో మొత్తం ప్రాంతం చీకటిమయంగా మారుతోంది.ఈ పరిస్థితి కారణంగా నిఘా వ్యవస్థ పనితీరుకు అంతరాయం కలిగే అవకాశం ఉందని స్థానికులు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి భారీ ప్రాజెక్టు వద్ద కనీస వెలుతురు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే పనిచేయని విద్యుత్ దీపాలను మరమ్మతు చేసి, ఎర్త్ డ్యాంపై తగిన వెలుతురు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**వారంటీలో ఉన్న దీపాలు:** ఈ సమస్యపై ప్రాజెక్టు అధికారులను సంప్రదించగా కీలక విషయాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం ఉన్న విద్యుత్ దీపాలకు ఇంకా వారంటీ కాలపరిమితి ఉందని, అందుకే వాటిని సంబంధిత సంస్థ ద్వారానే మరమ్మతులు చేయించాల్సి ఉందని వారు తెలిపారు.

**మూడు రోజుల్లో వెలుగులు: శ్రీకాంత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్**

ఎర్త్ డ్యాం పై నెలకొన్న చీకటి సమస్యపై ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్ వివరణ ఇచ్చారు. ఎర్త్ డ్యాం పై వెలగని విద్యుత్ దీపాలకు సంబంధించి ఇప్పటికే చర్యలు చేపట్టాం. సదరు దీపాలకు వారంటీ ఉన్నందున, సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి వారంటీ క్లెయిమ్ చేశాం. మరో మూడు రోజుల్లో అన్ని విద్యుత్ దీపాలకు మరమ్మతులు పూర్తి చేసి,ఎర్త్ డ్యాం పై వెలుగులు నింపుతాం. భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడబోం.

## యాదగిరిగుట్ట దేవస్థాన ఆదాయానికి భారీ గండి!

10 దుకాణాలు.. 112 ఎలా అయ్యాయ్?

వర్తక సంఘం ముసుగులో అక్రమాలు?




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఆదాయానికి కొందరు వర్తకులు గండి కొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, దేవస్థానానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి మళ్లిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక నివాసి అన్నల్దాస్ వెంకటేష్ ఈ అక్రమాలపై దేవస్థాన కార్యనిర్వహణ అధికారికి ఈఓ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.గతంలో కొండపైన కేవలం 10 తాత్కాలిక దుకాణాలు మాత్రమే ఉండేవి. కానీ, కాలక్రమేణా టెండర్ల ద్వారా ప్రవేశించిన వ్యక్తులు ఒక సంఘంగా ఏర్పడి, ఆ సంఖ్యను ఏకంగా 112 దుకాణాలకు పెంచేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రికార్డుల్లో మాత్రం ఇప్పటికీ పాత పది దుకాణాలనే చూపిస్తూ దేవాదాయ శాఖను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యక్తిగత పేర్లపై ఉండాల్సిన దుకాణాల రసీదులను, నిబంధనలకు విరుద్ధంగా ఒక వర్తక సంఘం పేరుతో జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడవాల్సిన దేవస్థానం, ఒక ప్రైవేటు వర్తక సంఘం తీసుకునే నిర్ణయాలను ఎలా ఆమోదిస్తుందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కొండ కింద ఇప్పటికే అత్యాధునిక దుకాణ సముదాయాలు నిర్మించినప్పటికీ, కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలను అక్కడికి ఎందుకు మార్చడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు.ఈ అక్రమ దందా వల్ల దేవస్థానానికి ఏడాదికి సుమారు రూ. 30 కోట్ల ఆదాయం గండి పడుతోందని వెంకటేష్ తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు.

నిజాయితీగా టెండర్లు వేసే వారికి అన్యాయం జరుగుతోంది. వర్తక సంఘం ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టాలి. పాత దుకాణాలను వెంటనే రద్దు చేసి, పారదర్శకంగా కొత్త టెండర్లు నిర్వహించాలి.

**అధికారుల మౌనం వెనుక మతలబు ఏమిటి?**

దేవస్థానం ఆదాయాన్ని పెంచాల్సిన అధికారులు, వర్తక సంఘానికి కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి, స్వామివారి సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## వీహెచ్ పోరాటం స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ‘బిసిల హక్కుల కోసం మాజీ ఎంపీ వి.హనుమంతరావు గారు సాగిస్తున్న పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమైనది. ఈ ధర్మపోరాటంలో యావత్ బిసి సమాజం ఆయన వెంటే ఉంటుంది‘ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. దేశవ్యాప్త జనాభా గణనలో బీసీ కులవారీ లెక్కలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అంబర్పేటలోని తన నివాసంలో వీహెచ్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు బీర్ల అయిలయ్య మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన, వీహెచ్తో కలిసి కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించే వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదని, ఈ విషయంలో వీహెచ్ నిబద్ధత అందరికీ ఆదర్శమని కొనియాడారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న వెనుకబడిన వర్గాలకు అసలైన న్యాయం జరగాలంటే వారి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని, బీసీ జనగణన ద్వారానే సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలువుతాయని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కులవారీ జనాభా గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నేటి నుండి ఎంజియులో తెలంగాణ విద్యా వారోత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేటినుండి విద్య వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవారోత్సవాల్లో భాగంగా మెగా టీచర్ ఫ్లేస్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు, ఒడవ రోజు జాతీయ విద్య ప్రణాళిక 2020 అమలుపై చర్చ కార్యక్రమం, మూడవరోజు డిగ్రీ టీచర్లకు సిలబస్ రివ్యూ కొత్త డిగ్రీ కోర్సులపై ఓరియంటేషన్ కార్యక్రమం,నాల్గవ రోజు బీఈడీ టీచర్లకు సిలబస్ రివ్యూ మరియు మూల్యాంకనంపై ఓరియంటేషన్ కార్యక్రమం,5వ రోజు ఇంజనీరింగ్ టీచర్లకు కృత్రిమ మేధా వినియోగం ట్రైనింగ్ కార్యక్రమం,ఆరవ రోజు నాన్ టీచింగ్ ఉద్యోగులకు కృత్రిమ మేధ వినియోగంపై ఓరియంటేషన్,ఏడవ రోజు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమాల ద్వారా విశ్వవిద్యాలయ విద్య బోధన సాంకేతిక వినియోగం విద్యా విధానంపై సమగ్రమైన చర్చ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భాగస్వాములకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

## అర్హులైన కళాకారులకు పింఛన్లు, ఐడి కార్డులు : దుర్గయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలో అర్హులైన కళాకారులకు పింఛన్లు,ఐడెంటి కార్డులు అందచేయాలని,కళాకారులకు హాస్పటల్లో ఫ్రీ వైద్యం అందించాలని సిపిఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య కోరారు. తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో త్యాగ జాను అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాకారుల నూతన కమిటీ ఎన్నుకున్నారు.ఈ కమిటీకి ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గయ్య కళాకారుల సమస్యలపై మాట్లాడుతూ ఈ నెల20వ తారీకున ఆలేరులో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి మూడో మహాసభకు పెద్ద ఎత్తున కళాకారులు హాజరుకావాలని, కళాకారుల హక్కులకై ఏర్పాటు చేసిన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ హేమలత శ్రీనివాస్, శ్యాగ మల్లేశం, గడిపే సత్యనారాయణ, శ్యగ బాలరాజు, శ్యాగ లింగయ్య,శ్యామల,గడిపే వంశీ,కృష్ణ పోచమ్మ పాల్గొన్నారు.

## రైతు, కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం



**ప్రజాపక్షం/మునుగోడు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పేద, బడుగు,బలహీన వర్గాలకు అన్యాయం చేస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం విమర్శించారు.మేడే వారోత్సవాల సందర్భంగా మండలంలోని సిపిఐ చొల్లేడు గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తీసుకొస్తోందని అన్నారు.అదేవిధంగా రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకువచ్చి,ఎరువులు ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు రైతులకు అందకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రైతు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చాపల శీను,మండల కార్యవర్గ సభ్యుడు వనం వెంకన్న,గ్రామ శాఖ కార్యదర్శి బైరుగొండ్ల వెంకన్న, పగిళ్ల రమేష్,బైరుగొండ్ల బీరయ్య,ఉడుగుండ్ల వెంకన్న,శాఖ సహాయ కార్యదర్శి గూడెపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
11-05-2026
www.prajapaksham.in

" సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (సైఫా) యొక్క రెండవ సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించబడింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమలకు చె ందిన వివిధ నిర్మాతల సంస్థల ముఖ్య ప్రతినిధులు ఈ స మావేశంలో పాల్గొన్నారు. "

రీల్


# అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా వీరభద్రుడు విడుదల



తమిళ నటుడు సూర్య మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు.' దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు . ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు.సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ రిలీజ్ కానుంది.

సూర్య, త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, శ్శివాడ, సుప్రీత్ రెడ్డి నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం సాయి అభ్యంకర్ యాక్షన్ అన్బరివ్ విక్రమ్ మోర్, ఎడిటర్ ఆర్.కళైవానన్, ప్రొడక్షన్ డిజైన్ అరుణ్ వెంజారామూడు, నిర్మాతలు: ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు.

# సింహాసనం పై విజయ్ దేవరకొండ




హీరో విజయ్ దేవరకొండ భారీ పాన్ ఇండియా లైనప్ లో వైరా క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ ప్రదీప్ ఉప్పలపాటి నిర్మాణంలో దర్శకుడు శౌర్యువ్ రూపొందిస్తున్న మూవీ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ ఇటీవలే ఘనంగా ప్రారంభమైంది. టాప్ ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. 'ప్రపంచం వ్యతిరేకించినా, విధి అతన్ని రాజును చేసింది..' అంటూ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. చేతిలో ఖడ్గంతో సింహాసనంపై కూర్చుని ఉన్న విజయ్ స్టిల్ తో ఈ పోస్టర్ ఆకట్టుకునేలా డిజైన్ చేశారు.ఈ సినిమాకు హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాంద్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్నోపియర్సర్ చిత్రాల వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ డస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు. యానిమల్, ఓం శాంతి ఓం వంటి చిత్రాలకు పనిచేసిన సురేష్ సెల్వరాజన్ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాల కంపోజర్ హేషమ్ అబ్దుల్ వాహెబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇండియన్ సినిమాకు గ్లోబల్ స్థాయి క్రేజ్ తీసుకురావడంలో వారణాసి, రాకా చిత్రాల్లా విజయ్ శౌర్యువ్ మూవీ కూడా ప్రయత్నిస్తోంది. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్ లో రూపొందనున్న ఈ సినిమా ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించనుంది. ఈ చిత్రానికి ఎడిటర్ ప్రవీణ్ ఆంటోనీ, మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహెబ్, ప్రొడక్షన్ డిజైనర్ సురేష్ సెల్వరాజన్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అలెజాంద్రో మార్టినెజ్.




# జూన్ 19న గౌతమ్ నంద రీ రిలీజ్

గోపీచంద్ నటించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గౌతమ్ నంద మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు రీరిలీజ్‌కు సిద్ధమైంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో భారీ స్థాయిలో మళ్లీ విడుదల కానుంది. స్టైలిష్ మేకింగ్, పవర్‌ఫుల్ కథనం, యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.విడుదల సమయంలోనే ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో ఆకట్టుకున్న గౌతమ్ నంద చిత్రంలో గోపీచంద్ నటనకు విశేష స్పందన లభించింది. సంగీత దర్శకుడు ఎస్ ఎస్. థమన్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ స్కోర్ కూడా చిత్ర విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.పీకే ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఈ రీరిలీజ్‌ను ప్లాన్ చేస్తున్నారు. మళ్లీ పెద్ద తెరపై గోపీచంద్ స్టైలిష్ అవతార్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో రష్మి ఠాకూర్ క్యాట్ వాక్



ప్రపంచ సినీ ప్రియులను అలరించే 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తెలంగాణ ముద్దుబిడ్డ , మోడల్, హీరోయిన్ రష్మి ఠాకూర్ క్యాట్ వాక్ చేయనుంది. ఈ ఫిలిం ఫెస్టివల్ లో దక్షిణ భారతదేశం నుండి రేడ కార్పెట్‌పై అడుగుపెడుతున్న మొట్టమొదటి హీరోయిన్ రష్మి ఠాకూర్. పలు తెలుగు సినిమాల్లో రష్మి ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. మిస్ ఆసియా రష్మి ఠాకూర్ మే 12 నుంచి 23 వరకు ఫ్రాన్స్‌లో జరగనున్న 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రేడ కార్పెట్‌పై అరంగేట్రం చేయనున్నారు. తెలంగాణ చేనేత, గిరిజన కళలు, హస్తకళలకు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్న మొట్ట మొదటి తెలంగాణ చేనేత రాయబారిగా రష్మి ఠాకూర్ చరిత్ర సృష్టించనున్నారు. ప్రపంచంలోనే నెం.1 చలనచిత్రోత్సవం... 1946 నుండి 79 ఏళ్ల వారసత్వం. సినిమాకు పామ్ డి'ఓర్ అనేది ఆస్కార్ కంటే గొప్ప పురస్కారం.1.2 బిలియన్ మంది వీక్షించే వేదిక: 4,000పైగా అంతర్జాతీయ జర్నలిస్టులు, 90 దేశాల నుండి 12,000 ప్రముఖులు హాజరవుతారు.ఫ్యాషన్ ప్రపంచానికి రాజధాని: భూమిపై అత్యధికంగా ఫోటో తీయబడే రేడ కార్పెట్. ఒకసారి మెట్లు ఎక్కితే 150 దేశాల్లో ట్రేండ అవుతారు. 80 దేశాలు తమ సంస్కృతిని ప్రదర్శించడానికి కేన్స్ ఫిలిం ఫెస్టివల్ ను ఎంచుకుంటాయి. భారత ప్రభుత్వం కూడా అధికారికంగా భాగస్వామ్యం చేస్తుంది.దక్షిణ భారతదేశం నుండి కేన్స్ రేడ కార్పెట్‌పై అడుగుపెడుతున్న మొట్టమొదటి నటి రష్మి ఠాకూర్ చరిత్రకెక్కెనుంది. థ్రెడ్స్ ఆఫ్ ఇండియా, వోవెన్ ఫర్ ది వరల్డ్ పోచంపల్లి నుండి కేన్స్ దాకాతెలంగాణలోని 10 లక్షల మంది నేత కార్మికులు, గిరిజన కళాకారుల కలకు ప్రతిరూపం.ఈ అరంగేట్రం నాది కాదు తెలంగాణలో మగ్గం మీద దారం వడికే ప్రతి అమ్మది అని రష్మి ఠాకూర్ అన్నారు. కేన్స్‌లో నేను నడుస్తుంటే, మన నేతన్నలు నాతో నడుస్తారు. మన చేనేతను ప్రపంచం చూస్తుంది అని ఆమె తెలిపారు.

# సౌత్ ఇండియా ఫిలిమ్ ఇండస్ట్రీని కాపాడుకోవాలి

## హైదరాబాద్‌లో దక్షిణ భారత నిర్మాతల మీటింగ్

సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (సైఫా) యొక్క రెండవ సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించబడింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమలకు చె ందిన వివిధ నిర్మాతల సంస్థల ముఖ్య ప్రతినిధులు ఈ స మావేశంలో పాల్గొన్నారు. దక్షిణ భారత సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రముఖ ని ర్మాతల మండళ్లు, గిలడ్స్ మరియు ఇతర ప్రతినిధి సంస్థలు ఈ సమావేశంలో పాల్గొని పరిశ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించా రు. ముఖ్యంగా నిర్మాణ వ్యయాలు, థియేట్రికల్ ఎగ్జిబిషన్, ఓటిటి విండోయింగ్ విధానాలు, వర్క్‌ఫోర్స్ స మన్వయం, ఫిల్మ్ ఫైనాన్సింగ్ స్థిరత్వం, అలాగే దక్షిణ భారత భాషల చిత్ర పరిశ్రమల మధ్య మరింత బలమైన స హకారం అవసరంపై చర్చలు జరిగాయి.ద క్షిణ భారత సినీ పరిశ్రమలో పారదర్శకత, స్థిరత్వం మరియు సమిష్టి అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఒక ఏకీకృత మరియు నిర్మాణాత్మక వ్యవస్థను ఏర్పరచడంపై నిర్మాతల సంఘం కట్టుబాటును మరోసారి పునరుద్ఘాటించింది. అలాగే డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, వివిధ చిత్ర హక్కుల కొనుగోలుదారులు వంటి ఇతర భాగస్వామ్య వర్గాలతో సమన్వయం , భాగస్వామ్యాన్ని మరింత బ లోపేతం చేయాల్సిన అవసరాన్ని సమావేశం ప్రాముఖ్యతగా ప్రస్తావించారు. పరిశ్రమలోని అన్ని విభాగాల మధ్య సమన్వయపూర్వక విధానాలు మరియు పరస్పర సహకారం మరింత బలోపేతం కా వాల్సిన అవసరంపై కూడా సభ్యులు చర్చించారు.సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తదుపరి సమావేశం జూన్ 14న కొచ్చిలో నిర్వహించబడనుంది. వేశంలో మరిన్ని నిర్మాణాత్మక చర్చలు , సమిష్టి కార్యక్రమాలు కొనసాగించబడతాయి.



# భరోసా.. కొంతేనా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం, గత రబీ సీజన్‌లో 2,44,423 రైతులకు రూ.2,32.92 కోట్లు పెట్టుబడి సహాయం అందజేసి చేతులు దులుపుకుంది. దీంతో పది ఎకరాలకు పైబడి ఉన్న రైతులకు పెట్టుబడి సహాయం కొంతమందికి మాత్రమే ఇచ్చి మిగతా రైతులకు మొండిచెయ్యి చూపింది. ఈ రబీ సీజన్‌లో అందించాల్సిన రైతుబరోసాను ప్రభుత్వం సకాలంలో అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత గ్రామ పంచాయితీ ఎన్నికల ముందు నుండి రేపు మాపు బరోసా నిధులు విడుదల చేస్తామని సాగుతీస్తూ వచ్చిన ప్రభుత్వం ఆ తరువాత మున్సిపల్ ఎన్నికలు రావడం తిరిగి వాయిదా వేసింది. ఇలా వాయిదాలు వేసుకుంటూ పోవడంతో రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో 22 మార్చి 2026న తొలి విడుత ఒక ఎకరా భూమికి రూ.6వేలు రైతుబరోసాను అందించిన ప్రభుత్వం, రెండవ విడుతలో 5 ఎకరాలలోపు రైతులందరికి అందిస్తామని ప్రకటించి కేవలం మరో ఎకరం భూమికి మాత్రమే రూ.6వేలు రైతుల ఖాతాలో 20 ఏప్రిల్ 2026న జమ చేసింది. దీంతో జిల్లాలో రబీ సీజన్‌లో రైతుబరోసా 50శాతం కూడా రైతులకు అందలేదని స్పష్టమవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతుబరోసా అందించకపోవడంపై రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు. 5 ఎకరాల భూమికి పైబడి ఉన్న రైతులందరికి ఏప్రిల్ 2026 చివరి నాటికి రైతుబరోసా అందిస్తామని చెప్పినప్పటికి ప్రభుత్వం నేటికి ఇవ్వని పరిస్థితి. రబీ సీజన్ ముగిసినా పంట పెట్టుబడి సహాయం (రైతుబరోసా) ప్రభుత్వం అందించకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. మరో ఇరవై రోజుల్లో తిరిగి ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభం కానుంది. వాతావరణ శాఖ నిపుణులు కూడా ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తాయని చెప్పడంతో రైతులు పంటసాగుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను సమకూర్చుకునే పనిలో పడ్డారు. రానున్న ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం అందజేసే రైతుబరోసా దేవుడెరుగు రబీ సీజన్‌లో తమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ రైతుబరోసాను అందిస్తే కొంత తమకు ఆసరా అవుతుందని రైతులు వాపోతున్నారు. తమది రైతు ప్రభుత్వం అని పదే పదే చెప్పుకొనే రేవంత్ సర్కారు చిన్నచూపు చూడడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రబీ సీజన్‌లో పెండింగ్‌లో ఉన్న రైతుబరోసాను పూర్తిస్థాయిలో ఇస్తుందా... లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# బ్రేక్ (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి సూచించింది. సిబిఎస్ఇతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదని గతంలోనే సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. దీంతో ఈ నెల 4వ తేదీన ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం షెడ్యూల్ విడుదల చేసిన బోర్డు మరుసటి రోజే షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో సిఎ రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయటంలో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

# భారీ మోసం

(మొదటి పేజీ తరువాయి)

సాకినాల వినీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం, జయసుధ 2022లో బాధితులను సంప్రదించి తమ సంస్థ ఎయిర్‌కండీషనింగ్ రంగంలో పనిచేస్తోందని, పెట్టుబడిపై నెలకు 4 శాతం లాభం ఇస్తామని నమ్మబలికింది. ప్రారంభంలో కొంతమేర లాభాలు చెల్లించడం వల్ల సంస్థపై నమ్మకం పెరిగిందని బాధితులు తెలిపారు.ఆ తర్వాత పలువురు కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్చనా వంగపల్లి రూ.2.25 కోట్లు, ఆమె భర్త శరత్ అన్నమనేని రూ.1.08 కోట్లు, వినీల రూ.1.23 కోట్లు, ఆమె భర్త ప్రశాంత్ రూ.73.5 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అదనంగా ఇతర కుటుంబ సభ్యులు, పరిచయస్తుల నుంచి కూడా భారీ మొత్తాలు సేకరించినట్లు ఆరోపించారు.అయితే కొంతకాలం తర్వాత లాభాల చెల్లింపులు నిలిపివేసి, ఫోన్ కాల్స్‌కు స్పందించడం మానేసిందని బాధితులు పేర్కొన్నారు. కార్యాలయం, నివాసం రెండూ మూసివేసి ఉండటంతో జయసుధ పరారీలోకి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్, రాజేష్‌లు కూడా నగదు సేకరణలో కీలకపాత్ర పోషించారని ఫిర్యాదులో ఆరోపించారు. మొత్తం రూ.6.81 కోట్ల మేర మోసం జరిగిందని బాధితులు పేర్కొనగా, నిందితుల పై కఠిన చర్యలు తీసుకుని తమ డబ్బులు తిరిగి రాబట్టాలని సిసిఎస్ పోలీసులను కోరారు. పోలీసులు ఆర్థిక లావాదేవీలు, బ్యాంక్ ఖా తాల వివరాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గా లింపు చేపట్టారు. త్వరలో ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి.

## గ్రేట్ నికోబార్ దీవుల అభివృద్ధి ప్రాజెక్ట్...

# పర్యావరణ వ్యవస్థ ధ్వంసం

**కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ధ్వజం**
**కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేష్ యాదవ్‌కు లేఖ**

**న్యూఢిల్లీ :** గ్రేట్ నికోబార్ దీవుల అభివృద్ధి ప్రాజెక్ట్ అక్కడి విశిష్టమైన పర్యావరణ వ్యవస్థను 'నాశనం' చేస్తుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్, పర్యావరణ శాఖ మంత్రి భూపేష్ యాదవ్‌కు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత రూపకల్పన, వివరాలను ఒక సారి నిలిపివేసి, పున: రాలోచించి, పున: పరిశీలించాలని యాదవ్‌ను కోరారు. యాదవ్ కు రాసిన తన లేఖలో జైరామ్ రమేష్ ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతి మంజూరు చేయడానికి ఆధారమైన అధ్యయనాలు 'తీవ్రంగా లోపభూయిష్టంగా' ఉన్నాయని, పర్యావరణ ప్రభావ అంచనా ప్రక్రియను 'అపహాస్యం' చేశారని ఆరోపించారు. అటువంటి 'పర్యావరణ విధ్వంసం' కలుగకుండానే దేశానికి సంబంధించిన అత్యవసర భద్రతా అవసరాలను తీర్చ వచ్చని భద్రతా నిపుణలు రాశారని జైరామ్ రమేశ్ హైలెట్ చేశారు. గ్రేట్ నికోబార్ దీవుల జీవనవైవిధ్యం ప్రపంచ వ్యాప్తంగా విశిష్టమైనదని, ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయని నేను పునరుద్ఘాటించాలని అనుకుంటున్నాను. గ్రేట్ నికోబార్ దీవుల అభివృద్ధి ప్రాజెక్ట్ వల్ల ఈ విశిష్టమైన పర్యావరణ వ్యవస్థ నాశనం అవుతుంది' అని మంత్రి భూపేశ్ యాదవ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. నష్ట పర్యావరణ అటవీకరణ వాదన పూర్తిగా బూటకమైనదని, ఆ విషయం మంత్రికి తెలుసని జైరామ్ రమేష్ వాదించారు. ఇంతటి పర్యావరణ విధ్వంసం కలిగించకండానే దేశానికి అవసరమైన భద్రత అవసరాలను తీర్చవచ్చని భద్రతా నిపణులే స్వయంగా రాశారు. ఈ ప్రాజెక్ట్‌కు దాని ప్రస్తుత రూపం, వివరాలతో సహా ఒకసారి ఆగి, ఆలోచించి పున: పరిశీలించాలని నేను మిమ్మల్ని మరోసారి కోరుతున్నాను'అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ నొక్కిచెప్పారు. ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతి మంజూరు చేయడానికి ఆధారమైన అధ్యయనాలు వేగవంతమైన పర్యావరణ ప్రభావ అంచనాలు (ఇఐఏ) కూడా కావని, అవి గరిష్ఠంగా కొన్ని రోజులు, వారాలపాటు సేకరించిన బేస్ లైన్ డేటాపై ఆధారపడి ఉన్నాయని, అవి పూర్తిగా సరిపోవని స్పష్టంగా తెలుస్తోందని రమేష్ అన్నారు.ఎన్‌జిటి ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన హెచ్‌పిసి చర్చలు, నివేదిక గోప్యమైనవి అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. అసలు పర్యావరణ అనుమతి మదింపు ప్రక్రియ బహిరంగంగా ఉన్నప్పుడు, కోర్టు ఆదేశించిన పున: పరిశీలన ప్రక్రియ ఫలితం గోప్యమైనదని వాదించడం చట్టబద్ధమైనదేనా? అని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఇటీవల గ్రేట్ నికోబార్‌ను సందర్శించిన అనంతరం మోదీ ప్రభుత్వం కలవరపడిందని, వెనువెంటనే నష్ట నివారణ చర్యలు చేపడుతోందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. ఏప్రిల్ చివరి వారంలో గ్రేట్ నికోబార్ పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ క్యాంప్ బెల్ బేలోని గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్‌పై ఆరోపణలు చేశారు.

# విజయ్ సర్కార్

(మొదటి పేజీ తరువాయి)



అధికార కేంద్రం ఒక్కటేనని, అది తానేనని కూడా ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు వేదికను పంచుకున్న వారితో, జనసమూహంతో సెల్ఫీలు తీసుకుంటూ తన ప్రసంగాన్ని ముగించే ముందు, 'సోదరుడు' రాహుల్ గాంధీ, వామపక్ష నాయకులతో సహా తనకు మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయన మంత్రివర్గంలో యువకులు, అనుభవజ్ఞులు కలసి ఉన్నారు. 51 ఏళ్ల నటుడురాజకీయవేత్త అయిన ఆయన కీలక బృందానికి తన తొలి మంత్రివర్గంలో చోటు దక్కింది. నగరమంతటా నెలకొన్న కఠోర విజయానందం, భారీ అంచనాల వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం, విజయ్ ప్రజాదరణ, యువతను ఆకట్టుకోవడం, వ్యవస్థ వ్యతిరేక వైఖరి చుట్టూ కేంద్రీకృతమైన ఒక కొత్త రాజకీయ శకానికి నాంది పలికింది. 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో టివికె సొంతంగా మెజారిటీ సాధించలేకపోయినప్పటికీ, విజయ్ కాంగ్రెస్, విసికె, సిపిఐ, సిపిఐ(ఎం), ఐయుఎంఎల్ మద్దతు కూడగట్టుకుని 120 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుని, 118 మెజారిటీ మార్కును దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. ప్రమాణ స్వీకార కార్యక్రమ ప్రారంభంలో వందేమాతరం, జాతీయ గీతం తర్వాత ఒక తమిళ జాతీయవాద గీతాన్ని ఆలపించారు. టివికెకు మద్దతు ఇచ్చేందుకు డిఎంకెతో సంబంధాలను తెంచుకున్న కాంగ్రెస్, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికలకూ విజయ్ పార్టీతోనే తమ సంబంధాలు కొనసాగుతాయని ప్రకటించింది. పమాణ స్వీకారం అనంతరం పిటిఐ వీడియోస్‌తో మంత్రి ఆదవ్ అర్జున మాట్లాడుతూ ఎన్నికల ఫలితాన్ని ప్రజల విజయంగా అభివర్ణించారు. ఈ ఘనతను ఆయన ప్రత్యేకంగా తమిళనాడు యువతకు, మహిళలకు ఆపాదించారు. కొత్త ప్రభుత్వం పారదర్శకత, లౌకికవాదం, సామాజిక న్యాయం అనే సూత్రాలకు కట్టుబడి ఉంటుందని అర్జున నొక్కి చెప్పారు. ప్రమాణ స్వీకారం అనంతరం తమిళనాడు సెక్రటేరియట్ భవనంకి చేరుకున్న విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

# ఎడ్యుకేషన్ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు? ఎడ్యుకేషన్ మాఫియా ఏ విధంగా రెచ్చిపోతున్నది? తలకుంటేనే గుండె ఆగినంత పనవుతున్నది. ఇంటర్ అడ్మిషన్ల విషయంలో డే స్కాలర్, బాయిస్ క్యాంపస్, లేడీస్ క్యాంపస్ పేరిట ఇష్టానుసారంగా ఫీజులు దండుకుంటున్నా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే అక్కడక్కడా వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపడుతుండటంతో కొద్దిగా వెనక్కి తగ్గినట్లు అనిపిస్తున్నా... గుట్టుచప్పుడు కాకుండా బ్రిడ్జి కోర్సుల పేరిట క్లాసులు నిర్వహిస్తూ బరితెగిస్తున్నారు. అయితే చైతన్య, నారాయణ మాఫియా హడావిడి తగ్గిన తరువాత ఇతర రాష్ట్రాల నుంచి ఎడ్యుకేషన్ మాఫియా ఎంట్రీ ఇచ్చింది. ఈ దోపిడీలో స్థానికులను భాగస్వాములను చేసుకుంటూ రూ.లక్షల కోట్లు తరలించుకుపోయే ప్రణాళిక అమలవుతోంది.

**బ్రిడ్జి కోర్సుల హంగామా...**

మూడు వారాల క్రితం నుంచే బ్రిడ్జి క్లాసుల పేరిట ఇంటర్ కోర్సులు ప్రారంభించారు. అసలు ప్రభుత్వం ఇంటర్ షెడ్యూల్ విడుదల చేయకముందే క్లాసులు ప్రారంభించారంటే ఎడ్యుకేషన్ మాఫియా ఎలా రెచ్చిపోతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలాఉండగా.. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో ప్రవేశాల సమయంలో అయోమయం నెలకొంది. సాంకేతిక సమస్యల కారణంగా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున ఈ ఏడాదికి యథావిధిగా అడ్మిషన్లు సాగించాలనే నిర్ణయం ఎడ్యుకేషన్ మాఫియాకు కలిసివచ్చిన అంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే కోర్ అర్బర్ రీజియన్ ఎకానమీ( క్యూర్) ప్రాంతంలోని దాదాపు 700 కాలేజీల్లో చదువుకునే లక్షలాది మంది విద్యార్థులు నీట్, ఎంసెట్, ఐఐటి,జెఇఇ, జెఇఇమెయిన్ పేరిట రూ.వేలాది కోట్లు ఫీజుల రూపేణా చెల్లిస్తుండటంతో 60 మంది విద్యార్థులను ఒక క్లాస్‌గా చూపిస్తూ చేస్తున్న దోపిడీ గురించి ప్రభుత్వం పట్టించుకోవాలనే డిమాండ్ మొదలయ్యింది.

# రంగం సిద్ధం?

(మొదటి పేజీ తరువాయి)

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ పాత ధరకే విక్రయిస్తున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజీ విక్రయాలపై వడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600–1700 కోట్ల చొప్పున గడిచిన పది వారాల్లో రూ.లక్ష కోట్లు నష్టపోయినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో ముడిచమురు కొనుగోలుకు వలధనం సమకూర్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని, వలధన వ్యయాలకు సంబంధించిన కాలవ్యవధులను సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని చమురు రంగ నిపుణులు విశ్లేషించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అనేది రాజకీయ అంశమని, దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని మరో వ్యక్తి తెలిపారు. చమురు ధరల పెంపు అనివార్యమని, అయితే ఎంత మొత్తం... ఎప్పుడు చేపడతారనేది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. జపాన్, బ్రిటన్ వంటి దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను 30 శాతం పెంచాయని గుర్తుచేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com